VISALAANDHRA, VIJAYAWADA Phone 376 ఉదయం ** Regd No. H. 203

విశాలాంధ్ర

7-2230

సంపుటి 15, సంచిక 339] విజయవాడ 14—3—1966 సోమవారం [6 పేజీలు 10పై.

విశాలాంధ్ర
చందా వివరాలు

	ఏజెంటుద్వారా	పోస్టుద్వారా
సంవత్సరం	రు. 38 00	రు. 45 00
ఆరు మాసాలు	19 00	22 50
మూడు మాసాలు	9 75	11 25
ఒక మాసం	3 25	3 75

కృపలానీ అభ్యర్థిత్వానికి యు. పి. స్వతంత్ర పార్టీ ప్రాతికూల్యం

లక్నో, మార్చి 13

ఉత్తర ప్రదేశ్ శాసనసభ నుండి రాజ్యసభ స్థానానికి శ్రీ జె. బి. కృపలానీని ఎంపికచేస్తూ కేంద్ర స్వతంత్ర పార్టీ పార్లమెంటరీ బోర్డు తీసుకొన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 14 మంది రాష్ట్ర స్వతంత్ర పార్టీ శాసన సభ్యులలో 10 మంది, రాష్ట్ర స్వతంత్రపార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యులు 7 గురు నేడు శ్రీ రాజగోపాలాచారికి సంయుక్తంగా ఒక లేఖను పంపారు.

బెంగాల్ పరిస్థితిపై విచారణకు దర్యాప్తుసంఘం

నియామకానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రకటన

ఆందోళనోద్యమ సందర్భంగా అరెస్టుచేసిన 30 మంది ముఖ్యుల విడుదల

కలకత్తా, మార్చి 13

ప్రస్తుతం బెంగాల్‌లో ఏర్పడ్డ తీవ్రమైన పరిస్థితికి దారి తీసిన వివిధ కారకాలపైనా, అందుకు సంబంధించిన విషయాలపైనా విచారణ జరిపేందుకు, కమిషన్‌ను నియమించటానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు అధికార ప్రకటన వెలువడింది.

ప్రస్తుతం పనిచేస్తున్న, లేక పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన 3 గ్గురు సభ్యులతో ఈ విచారణ సంఘం నియమించబడుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ పి. సి సేన్ ప్రభుత్వ నిర్ణయాన్ని పత్రికా విలేకరుల సమావేశంలో ప్రకటించారు.

కేంద్రహోంమంత్రి శ్రీ నందా, ఆహార మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం, ఇతర రాష్ట్ర మంత్రులు కూడా ఈ పత్రికా విలేకరుల సమావేశానికి హాజరయ్యారు.

ఈ ఆహారాందోళనోద్యమ సందర్భంగా దేశరక్షణచట్టం క్రింద అరెస్టు చేయబడిన వారిని 30 మందిని విడుదలచేయటానికి కూడా ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించారు.

విడుదల కానున్న ఈ 30 మందిలో 12 మంది శాసన సభ్యులు, 6 గురు శాసన మండలి సభ్యులు ఉన్నారని ఆయన తెల్పారు.

ఈ 30 మంది విడుదలకు నేటిరాత్రి ఉత్తర్వులు జారీ చేయబడతాయని అన్నారు

ప్రతిపక్ష ముఖ్యులతో ప్రధాని చర్చలు

న్యూఢిల్లీ, మార్చి 13

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ పార్లమెంటులోని ప్రతిపక్షాలకు చెందిన ముఖ్యులతో పశ్చిమ బెంగాల్ రాష్ట్రపరిస్థితులపై చర్చలు జరిపారు.

ఈచర్చల్లో బెంగాల్‌కు చెందిన పార్లమెంటు సభ్యులు కూడా పాల్గొన్నారు. బెంగాల్‌కు చెందిన కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులతో కూడా ఆమె సమావేశమయ్యారు.

ప్రతిపక్ష నాయకులతో 45 నిముషాలు, కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులతో 45 నిముషాలు ఆమె చర్చలు సాగించారు.

బెంగాల్‌లో మామూలు పరిస్థితులను నెలకొల్పేందుకు ఆయా సభ్యులు చేసే సూచనలను వినేందుకు ప్రధానమంత్రి ఈ సమావేశాలను ఏర్పాటు చేశారు.

చర్చలు ప్రధానంగా రాష్ట్ర ఆహార పరిస్థితిపైనా, శాంతిభద్రతలపైనా కొనసాగాయి.

పోలీసు కాల్పులపై న్యాయ విచారణ జరపాలని, డిటెన్యూలను విడుదల చేయాలనే తమ కోర్కెలను ప్రతిపక్ష సభ్యులు పునరుద్ఘాటించినట్లు తెలుస్తున్నది.

శ్రీనంబూద్రిపాద్ పై పి. సి. సేన్ విసుర్లు

కేరళ మార్క్సిస్టు పార్టీ నిరసన

తిరువనంతపురం, మార్చి 13

తమ రాష్ట్రంలో ఆహార ఆందోళనకు శ్రీ ఇ.యం. యస్. నంబూద్రిపాద్ కారకుడంటూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ సేన్ యీమధ్య చేసిన ఒక వ్యాఖ్య పట్ల కేరళ మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి వర్గం నేడు తన నిరసన తెలియజేసింది

ఆహారఆందోళన సందర్భంలో శ్రీ సేన్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో జరిపిన హత్యాకాండపై బహిరంగ విచారణ జరగాలని కార్యదర్శి వర్గం డిమాండు చేసింది.

జాన్సన్ వియత్నాం విధానానికి వత్తాసు

అమెరికా రాష్ట్ర గవర్నర్లచే

వాషింగ్టన్, మార్చి 12

జాన్సన్ వియత్నాం విధానాన్ని బలపరచే ఒక తీర్మానాన్ని 38 అమెరికా రాష్ట్రాలకు చెందిన గవర్నర్లు నేడు ఆమోదించారు.

వైట్ హౌస్‌లో జాన్సన్‌కు 49 రాష్ట్రాల 54 గవర్నర్లకు మధ్య అమెరికా విదేశీయ దేశీయ విధానాలపై చర్చలు జరిగిన తర్వాత యీ తీర్మానం చేశారు.

పొట్టి శ్రీరాములుకు అందివ్వబడని నెహ్రూ లేఖ

శ్రీమతి ఇందిర వెల్లడి

న్యూఢిల్లీ, మార్చి 12

శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ పత్రికా విలేకరు లడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ ఆంధ్ర రాష్ట్ర నిర్మాణంకోసం అసువు లర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు జవహర్‌లాల్ నెహ్రూ ఒక లేఖ వ్రాసినట్లు, అయితే ఆ లేఖను శ్రీరాములుకు అందించటం జరగనట్లు వెల్లడించారు.

హింసా చర్యలకు ప్రజలు పాల్పడితే తప్పితే ప్రభుత్వం కళ్ళు దెరచి కదలి పని చేయదు అనే మాట నిజం కాదా ? అన్న ఒక పత్రికా విలేకరి ప్రశ్నకు సమాధాన మిస్తూ ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి పై విషయాన్ని తెల్పారు.

ఆంధ్రరాష్ట్రం ఏర్పాటును గురించి ప్రస్తావిస్తూ పొట్టి శ్రీరాములు నిరాహార వ్రతాన్ని ప్రారంభించక ముందే ఆ సమస్యను ప్రభుత్వం పరిశీలిస్తున్నదని చెప్పారు.

శ్రీరాములు మరణించకముందే ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయాన్ని గైకొన్నదనిచెబుతూ, ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటుచేయటానికి నిర్ణయాన్ని గైకొన్నామని తెల్పుతూ మా తండ్రి పొట్టి శ్రీరాములుకు ఒక లేఖ కూడా వ్రాశారు, అని ఆమె చెప్పారు. అయితే నాకు స్పష్టంగా తెలియదు గాని ఆ లేఖను ఆయనకు అందివ్వటం జరగలేదని నాకు చెప్పారు అని ఆమె అన్నారు.

మార్చి 14 న భిలాయ్ బంద్

12 వేల మందితో చరిత్రాత్మక ప్రదర్శన

భిలాయ్, మార్చి 12

భిలాయ్ ఉక్కు కర్మాగారాన్నుండి మార్చి 15 నుండి నాల్గువేలమంది కార్మికులను పని నుండి తొలగించ నున్నందుకు నిరసనగా మార్చి 14 న 'భిలాయ్ బంద్'ను జరపటానికి కార్మికసంఘాల ఐక్య కార్యాచరణ సమితి నిర్ణయించుచున్నది.

రిట్రెంచ్‌మెంట్‌ని నిరసిస్తూ నేడు ఎ. ఐ. టి. యు. సి., హింద్‌మజ్దూర్ పంచాయత్, యు. టి. యు. సి. లలో ఏర్పడిన సంయుక్త కార్యాచరణ సమితి నాయకత్వాన 12 వేల మందికార్మికులు భిలాయ్‌లో గొప్పఊరేగింపు జరిపారు.

ఊరేగింపుకు పార్లమెంటు సభ్యులు ఎ. ఐ. టి. యు సి. నాయకులు శ్రీ సుధీర్ కుమార్‌ముఖర్జీ నాయకత్వం వహించారు.

మేనేజర్ బెదిరింపు

మార్చి 14 వ తేదీన భిలాయ్ కార్మికులు తలపెట్టిన సమ్మె చట్టవిరుద్ధమనీ, అందులో పాల్గొన్నవారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొంటామని బెదిరిస్తూ, భిలాయ్ కర్మాగారం పర్సనల్ మేనేజర్ నేడొక ప్రకటన చేశారు.

కరీంనగర్ జిల్లాలో 20 వేల మంది బీడీ కార్మికుల సమ్మె

(విశాలాంధ్ర విలేకరి)

కరీంనగరు, మార్చి 12

కరీంనగరు జిల్లా మెట్టపల్లి, జగిత్యాల తాలూకాలలోని 20 వేల మంది బీడీ కార్మికులు న్యాయమైన కోర్కెల సాధనకు, కనీస వేతనాల అమలుకు ఈ నెల 7 వ తేదీనుండి సమ్మె చేస్తున్నారు.

ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వర్గ వ్యతిరేక, యజమానులకు అనుకూల విధానాలకు, నిరసన తెలుపుతూ, తిరిగి నిర్ణయింపబడిన కనీస వేతనాలను వెంటనే ప్రకటించాలని డిమాండు చేస్తూ ఈ నెల 7 నుండి సమ్మె చేస్తున్నారనీ, కరీంనగరు జిల్లా బీడీ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ సి. ప్రభాకర్ ప్రకటిస్తున్నారు.

కార్మికుల న్యాయమైనకోర్కెలను తిరస్కరించే విధానాన్ని ప్రభుత్వం, యజమానులు కొనసాగించే టట్లయితే, జిల్లాలోని యితర ప్రాంతాలకు కూడా సమ్మె విస్తరించుతుందని, అప్పుడు 50 వేల మంది కార్మికులు సమ్మెలోచేరతారని ఆయన అన్నారు.

ప్రభుత్వం బీడీ కార్మికుల విచారకరమైన పరిస్థితులను గుర్తించటంలేదనే ఆవేదనతో గత 6 సంవత్సరాలుగా కార్మికులు యెంతో సహనాన్ని ప్రదర్శించారని, గత్యంతరంలేక కార్మికులు వారికోర్కెల సాధనకు ముందుకు వస్తే ప్రభుత్వం పారిశ్రామిక శాంతి వచనాలను వల్లిస్తున్నదని, కార్మికుల కనీసావసరాలను గుర్తించటంలో ప్రభుత్వం విఫలమైనదని ఆయన తెలిపారు.

సమ్మె పరిస్థితులు తీవ్రతరం కాక మునుపే ప్రభుత్వం కార్మికుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని ఆయన తన ప్రకటనలో తెలిపారు.

శ్రీ యస్. సత్యనారాయణ రెడ్డి ప్రకటన

మెట్టపల్లి, జగిత్యాల తాలూకాలలో 20 వేల మంది బీడీ కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయసమ్మతమైనదని, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆకార్మికుల సమ్మెకు తన పూర్తి తోడ్పాటును అందజేస్తున్నదని ఆంధ్రప్రదేశ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెసు కార్యదర్శి శ్రీ యస్. సత్యనారాయణరెడ్డి నేడిక్కడొకపత్రికాప్రకటనలో తెలియజేశారు

బీడీ కార్మికుల న్యాయ సమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే గుర్తించాలని ఆయన కోరారు.

అన్ని కార్మికసంఘాలు, కార్మికులందరూ సమ్మె చేస్తున్న బీడీ కార్మికులను బలపరుస్తూ, తమ సంఘీభావాన్ని వెల్లడించాలని ఆయన తన ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రప్రభుత్వంయజమానులకనుకూల వైఖరిని అవలంబిస్తున్నదని, గత 6 సంవత్సరాలుగా ప్రభుత్వం కార్మికుల కోర్కెలయెడ తిరస్కార వైఖరి అవలంబించిందని ఆయన పేర్కొన్నారు.

కాకిరాయి కార్మికుల సమ్మె విరమణ

విశాఖ పట్టణంలో

విశాఖపట్టణం, మార్చి 12

ఆహార రేషన్ కార్డులకోసం స్థానిక కాకిరాయి ఎగుమతి కార్మికులు పదవ తేదీ నుండి ప్రారంభించిన సమ్మె నేటితో ముగిసింది.

ఈ సమ్మె శ్రీ బి. జి. యం. ఏ. నరసింగరావుగారు అధ్యక్షులుగా వున్న డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన జరిగింది.

చట్టబద్ధ రేషనింగ్ ప్రాంతానికి వెలుపలి ప్రాంతంలో నివసిస్తున్న తమకుగూడా ఆహార కార్డులివ్వాలని కార్మికుల కోర్కె.

అధికారులు యీ విషయం హామీయిచ్చిన మీదట సమ్మె విరమణ జరిగింది.

బోనస్‌కోసం సమ్మె

ఇనుము, ఉక్కు ఎగుమతి దిగుమతి కార్మికులు 1964 వ సంవత్సరానికి బోనస్ డిమాండు చేస్తూ నేటి ఉదయం నుండి యిక్కడ సమ్మె ప్రారంభించారు. వారు కూడా పోర్టులో పనిచేసేవారు. ఈ సమ్మెకు ఐ. యన్. టి. యు. సి. కి అనుబంధంగా వున్న పోర్టు కలసి యూనియన్ నాయకత్వం వహిస్తున్నది.

సేన్ కిరాతకత్వానికి బలైన మృతవీరులకు శ్రద్ధాంజలి

శ్రీమతి రేణూచక్రవర్తి, శ్రీ భూపేష్ ప్రభృతుల నాయకత్వాన వేలాదిమంది మౌనప్రదర్శన

కలకత్తా, మార్చి 13

'మృతవీరుల స్మారక దినోత్సవ' సందర్భంగా నేడిక్కడ సాయంత్రం వామపక్ష ఐక్య సంఘటన ఆధ్వర్యాన చరిత్రాత్మకమైన ఊరేగింపు కలకత్తా నగర వీధుల్లో నిశ్శబ్దంగా సాగింది. రాష్ట్ర ప్రజల జీవన స్థితి గతులను మెరుగుపరచేందుకు తమప్రాణాలర్పించిన 'బెంగాల్ ఉత్తమ పుత్రుల గౌరవార్థం 4 మైళ్ళ పొడవుగల ఊరేగింపులో వేలాది ప్రజలు బారులుదీరి పాల్గొన్నారు.

పార్లమెంటు సభ్యులు శ్రీ భూపేష్‌గుప్తా, శ్రీమతి రేణూ చక్రవర్తి, శ్రీ ఇంద్రజిత్ గుప్తా, మహమ్మద్ ఇలియాస్, శ్రీ త్రిదిబ్ చౌదరి, శ్రీ యస్. సి. చటర్జీ, శ్రీ డి. యల్. సేన్‌గుప్తా, శ్రీ దినేష్‌భట్టాచార్యలు ఈ చరిత్రాత్మకమైన ఊరేగింపునకు నాయకత్వం వహించారు.

నిషేధ ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ ఊరేగింపు జరుపవద్దని హోం మంత్రి శ్రీ నందా నిన్న విజ్ఞప్తిచేశారు. అయితే శ్రీ నందాను కల్సుకొన్న పార్లమెంటు సభ్యులు నల్గురు ఊరేగింపు విషయంలో జోక్యం కల్పించుకోవద్దని కోరగా, ప్రభుత్వం అందుకు అంగీకరించింది.

ప్రదర్శకులు నల్లబాడ్జీలు ధరించి కాలేజి, కార్న్‌వాలీస్ వీధులగుండా శాంతియుతంగా నడచి ఉత్తర కలకత్తాలోని దేశబంధు పార్కువద్ద ప్రశాంతంగాచెదిరిపోయారు.

డి.ఏ. సమస్యపై రాష్ట్ర ఆర్థికమంత్రి గడసాము

కేంద్ర, రాష్ట్ర ఉద్యోగుల మధ్య వ్యత్యాసం కూడదంటూనే మొండిచేయిచూపే ధోరణి

హైదరాబాద్, మార్చి 12

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులమధ్య వ్యత్యాసాలు తొలగవలసిందే అని రాష్ట్ర ఆర్థిక మంత్రి శ్రీ మర్రి చెన్నారెడ్డిగారునిన్న యిక్కడ ఆంధ్ర ప్రభుత్వ ముద్రణాలయ వుద్యోగుల మహాసభను ప్రారంభిస్తూ చెప్పారు.

అయితే కేంద్ర వుద్యోగులతో సరిసమానంగా వారికి కరువుభత్యం పెంచడమే యిందుకు పరిష్కార మార్గమా అనేది చర్చనీయాంశం, అన్నారాయన.

కరువుభత్యం పెంచడం కంటే వుద్యోగులకు జీవితావసర వస్తువులను చౌకగా అందజేయడం విషయంలో ప్రత్యేకశ్రద్ధ వహించాలి. అని చెబుతూ నిజామాబాద్ సహకార వుద్యమాన్ని ఉదహరించారు.

అక్కడ బహిరంగ మార్కెట్‌లో బియ్యం క్వింటాల్‌కు 60 రూపాయలచొప్పున అమ్ముతుంటే, సహకార సంఘం ద్వారా 52 రూపాయలకే అమ్ముతున్నారనీ ఆయన చెప్పారు.

కరువు భత్యం కోసంగాని, అలాంటి మరో కోర్కె కోసంగాని జరిగే ఆందోళనను అణచివేయడం ప్రభుత్వ వుద్దేశం కాదు. ఉద్యోగులు పరస్పరం సంప్రదింపుల ద్వారా, యిచ్చిపుచ్చుకొనే సమరసధోరణిలో ఇలాంటిసమస్యలను పరిష్కరించుకోవాలని మాత్రమే ప్రభుత్వం కోరుతూవుంది. అని ఆయన చెప్పారు.

ప్రభుత్వ ముద్రణాలయ భవనాల నిర్మాణంపని, డబ్బులేక కుంటు పడుతూ వుందనీ. ఈపరిశ్రమలోని కార్మికుల సమస్యలన్నీ సామరస్యంగా, పరస్పరం సంప్రతింపుల్ద్వారా పరిష్కరించుకోవడం జరుగుతూ వుంది. ఇది అభినందించ దగిన విషయం అని ఆయన అన్నారు.

కర్నూల్, హైదరాబాద్ కేంద్రాలలోని ప్రభుత్వ ముద్రణాలయాలలోని వుద్యోగుల సర్వీసులను ఏకంచేసే సమస్యను ప్రభుత్వం పరిశీలిస్తూ వుంది అని ఆయన చెప్పారు.

డాక్టర్ గౌడ్ ప్రసంగం

డాక్టర్ రాజబహదూర్ గౌడ్ మహాసభకు అధ్యక్షత వహించారు.

ఈ పరిశ్రమలోని కార్మికులు యన్. జి. ఓ. ల, ఉపాధ్యాయుల ఆందోళనకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు.

మన ప్రభుత్వం చంద్రుని చేరడానికి విషయంలో సోవియట్ యూనియన్‌తో పోటీ పడుతున్నట్లు కనిపిస్తున్నది. వ్యత్యాసమల్లా ఏమంటే రష్యావారు చంద్రుని వద్దకు రాకెట్లను పంపుతుంటే, మన వారేమో ధరలను చంద్రలోకానికి చేరేలా పెంచే ప్రయత్నం చేస్తున్నారు. అని ఆయన చమత్కరించారు.

ధరల పెరుగుదల దుష్ప్రభావం జీవన పరిస్థితులమీద మాత్రమే నిలిచిపోదు. అది యావత్తు దేశాన్ని, మొత్తం ఆర్థిక వ్యవస్థనూ చుట్టబెడుతుంది. దేశాన్ని క్రుంగదీసి బయటి వత్తిళ్ళకు గురి అయ్యేలా చేస్తుంది. అని ఆయన హెచ్చరించారు.

ఈ పరిశ్రమలోని కార్మికులకు సంబంధించిన వివిధ సమస్యలనూ, యిబ్బందులనూ పేర్కొని ప్రభుత్వం వాటిని సర్దుబాటుచేయడానికి పూనుకోవాలని ఆయన కోరారు.

ప్రభుత్వ ముద్రణాలయం మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ విఠల్‌రావ్, అఖిల భారత ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కె. జి. వాత్సవా, ఏ. పి. యస్. ఆర్. టి. సి. కార్మిక నాయకులు శ్రీ మక్దుమ్ మొహియుద్దీన్ గారలు సభలో సందేశాలిచ్చారు.

భిలాయ్ లో నిషేధాజ్ఞలు

భిలాయ్, మార్చి 13

నాలుగువేలమంది కార్మికులను పని నుండి తొలగించినందుకు నిరసనగా కార్మిక సంఘాలు రేపు భిలాయ్‌బంద్‌ను తలపెట్టినందున భిలాయ్‌లో నిషేధాజ్ఞలను జారీచేశారు.

"కాశ్మీర్ విషయమై ప్లెబిసైట్ ప్రసక్తేలేదు"

అమెరికా టెలివిజన్ గోష్ఠిలో భారత ప్రధాని శ్రీమతి గాంధీ ఉద్ఘాటన

న్యూయార్క్, మార్చి 13

కాశ్మీర్‌లో జనవాక్యసేకరణ జరపవలసిన సమస్యేలేదని భారత ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి నేటిరాత్రి న్యూయార్క్ టెలివిజన్ గోష్ఠిలో స్పష్టం చేశారు.

మతప్రాతిపదికపై జనవాక్య సేకరణ ప్రారంభమైతే అది భారతదేశంలోనేగాక ఇతరదేశాల్లో సైతం అనేక సమస్యలను సృష్టించగలదన్నారు. అంతేగాక భారతదేశ స్థిరత్వాన్ని సైతం దెబ్బతీయగలదన్నారు.

భారతదేశం బలహీనపడితేదానివల్ల లాభించేదెవరో తనకు బోధపడడం లేదన్నారు. అది భారతదేశానికిగాని, పాకిస్తాన్‌కుగానీ ఏ రూపంలోనూ లాభించదన్నారు.

సమస్యలు – సమాధానాలు అన్న శీర్షిక క్రింద అమెరికా బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీకి ఇచ్చిన టెలివిజన్ గోష్ఠిలో శ్రీమతి ఇందిరా గాంధి ప్రసంగిస్తూ భారతదేశం తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నదనీ, అయితే అది రాజకీయ సంక్షోభానికి దారితీయదనీ అన్నారు. 'పరిస్థితి అదుపులో వుంది' అని ఆమె అన్నారు.

కొన్ని ప్రాంతాల తీవ్రమైన కొరత మూలంగానే భారతదేశంలో కరువు ప్రబలిందని, ప్రజలు అత్యధిక సంఖ్యలో ఆకలి బాధకు మాత్రం ఎరకావటం లేదని అన్నారు.

వియత్నాం, చైనా భారత-పాక్ సంబంధాలను గురించికూడ అరగంటసేపు సాగిన ఈ గోష్ఠిలో ప్రస్తావనకు వచ్చాయి.

వియత్నాం విషయంలో భారతదేశం సంప్రదింపులు సాగడానికి తోడ్పడాలని భావిస్తారనీ, ఆ విషయంలో ఇతరులు ప్రయత్నించి విఫలమైన మార్గాలనే పునశ్చరణ చేయుటవల్ల ఉపయోగం లేదనీ ఆమె అన్నారు.

చైనాను గురించి ప్రస్తావించి చైనాను అదుపులో పెట్టాలంటే ఆసియాదేశాలు నిజమైన స్వతంత్ర దేశాలుగా, ఆర్థిక రాజకీయ

(మిగతా 7 వ పేజీలో)

అమృతసర్ లో పోలీసు కాల్పులు

ఒకరి మృతి; పెక్కుమందికి గాయాలు

అమృతసర్, మార్చి 13

అమృతసర్‌లో పంజాబీసుబా వ్యతిరేక ప్రదర్శకులపై నేటి సాయంత్రం పోలీసులు కాల్పులు జరిపారు. ఫలితంగా 15 సంవత్సరాల విద్యార్థి మరణించాడు. గాయపడిన మరోముగ్గురు పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా వుంది.

నగరంలోని వివిధ ప్రాంతాల్లో నేడు ప్రదర్శకులు దహనకాండ కొనసాగించారు.

లోహతి గేట్, హాల్‌గేట్ ముందు ప్రదర్శకులపై సాయంత్రం పోలీసులు అనేక సార్లు లాఠీ చార్జి జరిపారు. ఈ సంఘటనలు పురస్కరించుకొని నేడు తిరిగి అమృతసర్ నగరంలో కర్ఫ్యూ విధించారు.

పంజాబ్‌సుబా వ్యతిరేక ప్రదర్శకులను చెదరగొట్టడానికి నేడు అమృతసర్‌లో పోలీసులు రెండుచోట్ల కాల్పులు జరిపిన ఫలితంగా ఒక విద్యార్థి మరణించాడు. పెక్కుమంది గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి ప్రమాదకరంగా వుంది. అమృతసర్‌లో బాంబేవాలాఖూవప్త, కత్రాషర్‌సింగ్ పోస్టు ఆఫీసు సమీపంలోనూ ఈ కాల్పులు జరిగాయి. ప్రదర్శకులుపోస్టాఫీసుకు నష్టం కల్పించడానికి ప్రయత్నించగా పోలీసులు కాల్పులు జరిపారు.

చండీఘర్ లో దహనకాండ

చండీఘర్‌లోని పురానీకొత్వాలి ప్రాంతంలోగల ఆ సబ్ పోస్టాఫీసును, ఒక రైల్వే బుకింగ్ ఏజెన్సీ ఆఫీసులోని రికార్డులనూ, సామగ్రినీ, ఇతర వస్తువులనీ ముగ్గురు పంజాబీసుబా వ్యతిరేక ప్రదర్శకులు నేటి మధ్యాహ్నం తగులబెట్టారు.

పురానీ కొత్వాలికి చెందిన రికార్డులన్నింటిని సైతం వారు తగులబెట్టారు. అంతేగాక అనేక దుకాణాల పెట్టెలను సైతం అగ్నికి ఆహుతిచేసినట్లు వార్తలు అందుతున్నాయి.

బెత్తాల ప్రయోగం, బాష్పవాయు ప్రయోగం

మరొకసబ్‌పోస్టాఫీసునూ, రైల్వేబుకింగ్

(మిగతా 6వ పేజీలో)

బెంగాల్ పరిస్థితిపై ప్రతిపక్ష నాయకులతో నందా సంప్రతింపులు

రాష్ట్రమంతటా ప్రశాంత పరిస్థితి

కలకత్తా, మార్చి 13

కేంద్ర హోం మంత్రి శ్రీ జి. యల్. నందా, యీ రోజుగూడా పశ్చిమ బెంగాల్ పరిస్థితి గురించి యీ రాష్ట్రం నుండి ఎన్నికయిన పార్లమెంటు సభ్యులతోను, రాష్ట్ర మంత్రులతోనూ, వున్నతాధికారులతోనూ సమాలోచనలు కొనసాగించారు.

కలకత్తా నగరంలోనూ, రాష్ట్రంలోని యితర ప్రాంతాల్లోనూ యీ రోజు ప్రశాంతంగానే వున్నట్లు యిక్కడకు వార్తలందాయి.

ప్రభుత్వ ఆహారవిధానానికి నిరసనగానూ, బషీర్‌హాట్, కిషన్‌గర్ పట్టణాల్లో పోలీసు కాల్పులపై న్యాయవిచారణ జరపాలనేకోర్కెపైన అతివాదపార్టీల నాయకత్వాన గురువారంనాడు రాష్ట్ర వ్యాపితంగా "బంద్" జరిగిన విషయం పాఠకు లెరిగినదే.

నగరంలోనూ, పరిసరాల్లోనూ ఈ రోజు ఉదయం నుండి మామూలుగా జన సంచారం ప్రారంభమైంది. దుకాణాలు తెరుస్తున్నారు. అయితే బస్సులు, ట్రాములు ఇంకా మామూలుగా తిరగడంలేదు.

తూర్పు, ఆగ్నేయ రైల్వేలలో రైళ్ళ రాకపోకల పరిస్థితి కూడా క్రమేణా మెరుగవుతూ వుంది. నగరంలో నడిచే లోకల్ రైళ్ళు మాత్రం యింకా పూర్తిగా పునరుద్ధరించబడలేదు. కొన్ని స్పెషల్ ట్రయిన్‌లు మాత్రమే నడుస్తున్న .

నేటి సాయంత్రం ప్రారంభం కానున్న 'మృతవీరుల స్మారక దినోత్సవ' మౌన ప్రదర్శనలు శాంతియుతంగా జరిగేట్లు చూడవలసిందిగా ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులకు శ్రీ నందా విజ్ఞప్తి చేశారు.

నేటి సాయంత్రం శ్రీ నందా తిరిగి ప్రతిపక్ష నాయకులతో సమావేశం కానున్నారు. ఆ సమావేశంలో తాజా పరిస్థితిపైన, ప్రస్తుత ఆహార ఆందోళన ఉద్యమ సందర్భంగా అరెస్టుచేయబడిన నాయకుల విడుదలను గురించి చర్చలు జరుగుతాయని తెలుస్తున్నది.

శ్రీ అతుల్యఘోష్‌కూడా నేడు హోం మంత్రిని కలుసుకొని చర్చలు జరిపారు.

ప్రస్తుత తీవ్రపరిస్థితికి ప్రభుత్వ వైఖరే కారణం

బెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, మాజీ అధ్యక్షులు, శాసన సభ్యులూ ఐన శ్రీ అజయ్‌కుమార్ ముఖర్జీ నేడు హోం మంత్రిని కలుసుకొని ప్రస్తుత తీవ్రపరిస్థితికి ప్రభుత్వం చాకచక్యంతో వ్యవహరించకపోవటమే కారణమని తెల్పారు.

బెంగాల్ కాంగ్రెసు కార్యకర్తల సదస్సు తరఫున శ్రీ ముఖర్జీ తన అనుయాయులు 8 మందితోపాటు శ్రీ నందాను కల్సుకున్నారు. సమావేశానంతరం ఆయన పత్రికా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మామూలు పరిస్థితులు నెలకొనేంత వరకు కలకత్తా విడిచి వెళ్ళవలదని తాను శ్రీ నందాను కోరానని చెప్పారు.

కలకత్తాప్రముఖులతోచర్చలు

జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు శ్రీ త్రిగుణసేన్, డా. అమియోబోస్, డా. నిహార్‌మునీలతో సహా 5 గురు కలకత్తా ప్రముఖులు నేటి సాయంత్రం హోం మంత్రినికల్సుకొని చర్చలు జరిపారు.

ఆహారపదార్థాల ఇతరజీవితావసర వస్తువులకు సంబంధించి ప్రజల కోర్కెలు దీర్ఘకాలంగా పరిష్కరించబడక పోవటమే ప్రస్తుత ఆహార ఆందోళనా ఉద్యమానికి కారణమని. ఈ ఆందోళనకు రాజకీయ ఉద్యమంతో ఎట్టి సంబంధంలేదని వారు శ్రీ నందాకు స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది.

రేపు సాయంత్రం హోం మంత్రి ఢిల్లీకి బయలుదేరి వెళతారు.

పంజాబీ సుబాకు మతప్రమేయం లేదు

శ్రీ స్వరణ్ సింగ్ వివరణ

జలంధర్, మార్చి 13

పంజాబీసుబా నిర్మాణం ఏదో ఒక మతానికి వ్యతిరేకంగానో, అనుకూలంగానో ఉద్దేశించినదిగాదని విదేశాంగ మంత్రి శ్రీ స్వరణ్ సింగ్ నేడిక్కడ చెప్పారు.

పంజాబీ సుబా కేవలం పంజాబీ భాషా ప్రాతిపదికపై మాత్రమే ఏర్పడుతున్నది. దీనిని గురించి ఎవరికీ అపోహ ఉండనవసరం లేదన్నారు. ద్విభాషా రాష్ట్ర ప్రయోగం విఫలమైందని చెప్పారు.

పంజాబీ సుబా భారతదేశ అంతర్భాగంగా వుంటుందని. దాని ఏర్పాటువల్ల దేశ సమైక్యతకు ఎలాంటిభంగం వాటిల్లదని చెప్పారు.

"హిందువులు, సిక్కులు సోదరులు. దేశ సరిహద్దులను సంరక్షించే సాయుధ బలగాల చందంగా మనందరమూ చేయిచేయి కలిపి దేశాభ్యుదయానికికృషి చేయాలి. అంతరంగిక శాంతిభద్రతలను కాపాడడం మనందరి విధి" అని ఆయన అన్నారు.

అకాలీ దళంలోని మాస్టర్ తారాసింగ్ గ్రూపు కొనసాగిస్తున్న ఆందోళనోద్యమాన్ని ప్రస్తావించి హిందీవ్యతిరేకతను పూనినంత మాత్రాన ఈ అకాలీదళం పంజాబీభాషకు సేవచేసినట్లు కాదన్నారు. హిందీ మన జాతీయభాష. దానికి సముచిత గౌరవం ఇవ్వాలి. అని చెప్పారు.

తారాసింగ్ కుమారుని అరెస్టు

జలంధర్, మార్చి 12

మాస్టర్ తారాసింగ్ కుమారుడు సర్దార్ మోహన్‌సింగ్‌తోసహా ఆ గ్రూపుకు చెందిన పదిమంది సభ్యులను జలంధర్‌లో యీరోజు తెల్లవారుఝామున పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

అరెస్టులు

మాస్టర్ తారాసింగ్ గ్రూపుకు చెందిన అకాలీదళం సభ్యులను 61 మందినీ, సుబా వ్యతిరేక ప్రదర్శకులు మరో పదిమందిని పోలీసులు యీరోజు రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల్లో అరెస్టు చేశారు. వీరిలో జనసంఘానికి చెందిన ఒక శాసనసభ్యుడు కూడా వున్నారు.

విశాలాంధ్ర

కాంగ్రెసు పాలనలో పోలీస్ వ్యవస్థ

మొన్న శాసనసభలో పోలీస్ పద్దుపై కాంగ్రెస్ సభ్యుడు శ్రీ పోతుల గున్నయ్య ప్రసంగిస్తూ, తన జిల్లాలో ఫలానా పని (అది ఏదనే విషయం ముఖ్యం కాదు) చేసి పెట్టవలసిందిగా పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ నంబియార్‌కు చేసిన విజ్ఞప్తి సభాధ్యక్ష స్థానంలో వున్న శ్రీ భాట్టం శ్రీరామమూర్తికి అనుచితంగా తోచింది. పోలీస్ అధికారికికాక, మంత్రిగారికి విజ్ఞప్తి చేసికొమ్మని సభ్యుడికి సలహా ఇచ్చారు.

శ్రీ గున్నయ్య అమాయకుడుగా కనిపించవచ్చు. కాని అమాయకుడు కాదు. శాసనసభ్యుడుగా తనకుగల దీర్ఘానుభవంలో శ్రీ గున్నయ్యగారు ఒక్క విషయం బాగా గ్రహించినట్లు కనిపిస్తుంది. అయిదేళ్ళనాడున్న మంత్రి ఈనాడు లేడు. ఈ నాడున్న మంత్రి వచ్చే ఎన్నికల తరువాత ఉండకపోవచ్చు. కాంగ్రెస్ ముఠాల బలాల్లో వచ్చే మార్పులు, వాటిమధ్య జరిగే పదవుల పంపకాలు మొదలగు అనేక విషయాలపై ఇదంతా ఆధారపడి వుండనేది శ్రీ గున్నయ్యగారి స్వానుభవం.

శ్రీ గోపాలరెడ్డిపోయి, శ్రీ సంజీవరెడ్డి వచ్చినా, శ్రీ సంజీవరెడ్డిపోయి, సంజీవయ్య వచ్చినా, ఉభయులూపోయి బ్రహ్మానందరెడ్డి వచ్చినా, పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ నంబియార్ వుంటున్నారు. ఆయన క్రింద వున్న పోలీస్ అధికారులు వుంటున్నారు. ఉద్యోగం నుండివిరమించుకొనే వరకు ప్రతి అధికారి ఇలాగే వుంటారు. అందువల్ల "పర్మినెంట్ గవర్న్మెంట్" అని అనబడే ఈ వ్యవస్థపై శ్రీ గున్నయ్యగారికి, మంత్రిపై కన్నా (అతను తన పార్టీవాడైనా సరే) ఎక్కువ విశ్వాసం వుండటం సహజం.

అంతేకాదు, ప్రభుత్వ యంత్రాంగమూ, ముఖ్యంగా అందులో నిర్బంధ విధానాన్ని అమలుజరిపే విభాగమయిన పోలీస్‌శాఖా, అధికారాలలో వున్న కాంగ్రెస్‌పార్టీ పరస్పరాశ్రయులనే విషయంకూడ శ్రీ గున్నయ్య తన రాజకీయానుభవం ద్వారా గ్రహించి వుంటారు. అందువల్ల ఒకరిపై ఒకరు ఆధారపడిన ప్రభుత్వానికీ, పోలీస్ శాఖకూ మధ్య తేడా చూపవలసిన అవసరం ఆయనకు కనిపించి వుండదు.

ఈ పరస్పరాశ్రయత కన్నులున్న ప్రతిఒక్కరికీ కనిపిస్తున్నది.

కాంగ్రెసుపార్టీకి గ్రామసీమలలో భూస్వాములు, పట్టణ ప్రాంతాలలో పెట్టుబడిదారులు, కంట్రాక్టర్లు ప్రధానమైన పట్టుగొమ్మలు. ఈ వర్గాల దోపిడీ నిర్విఘ్నంగా కొనసాగాలంటే వారికి పోలీసుల అండదండలవసరం. భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలను ప్రజలు ఏమాత్రం ప్రతిఘటించినా పోలీసులు భూస్వాములపక్షం వహించి ప్రజలపైన వారికి తోడ్పడే అభ్యుదయ రాజకీయపార్టీలపైన విరుచుకపడటం అనునిత్యం చూస్తున్నాం. నల్లగొండజిల్లా, దేవరకొండ తాలూకాలో నిజాంనాటి రజాకార్ దుండగాలను మరపించే క్రూర హింసాకాండను సాగిస్తూండటం ఇందుకొక ఉదాహరణ. ఇక పట్టణాలలోని దోపిడీవర్గాలకు పోలీసుల సహాయం ఏ రూపంలో వుంటుందో, కార్మికుల సమ్మెసందర్భంలో స్పష్టంగా కనిపిస్తుంది. యజమాని పక్షం వహించి కార్మికులను, వారి నాయకులను అరెస్టు చేయటం, సమ్మెదార్లపై దౌర్జన్యం సాగించడం, లేక యజమానుల రౌడీ మూకలు కార్మికులపై సాగించే అఘాయిత్యాలను చూచీ చూడనట్టుండటం, పైగా ప్రజలే దౌర్జన్యం చేశారని తప్పుడు కేసులు బనాయించడం–ఇవన్నీ సర్వ సాధారణమయిన విషయాలు. నాగార్జున సాగర్‌లో కంట్రాక్టర్ల దోపిడీకి వ్యతిరేకంగా సాగిన సమ్మె, బెల్లంపల్లి గని కార్మికులపై జరిగిన గూండాగిరి మొదలయినవెన్నయినా ఉదాహరణలుగా ఇవ్వవచ్చు.

ప్రభుత్వం అవలంబించే ప్రజావ్యతిరేక విధానాలకు ప్రజల ప్రతిఘటన ఎదురైనప్పుడు వారిని అణచడానికి కాంగ్రెస్ ప్రధానంగా పోలీసు బలంపై ఆధారపడక తప్పదు. ప్రతిఘటన పోలీస్ శక్తికి మించిపోయి నప్పుడు పశ్చిమ బెంగాల్‌లోలాగా సైన్యంపై ఆధారపడే స్థితి ఏర్పడటం కూడా కద్దు. కాని అది అరుదు.

ఈ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయాధికారానికీ, కాంగ్రెసుకు అండగా వున్న భూస్వామ్య పెట్టుబడిదారీ వర్గాల ఆర్థిక దోపిడీకి పోలీసు అధికారులు తోడ్పడుతూ వున్నప్పుడు, పోలీసు అధికారులకు, అందుకు ప్రభుత్వం తగిన ప్రతిఫలం ముట్టజెప్పడం సహజం. పోలీసు అధికారులలో వ్యాపించిన లంచగొండితనాన్ని, అవినీతిని, ప్రజలపట్ల పాళేగార్లలా వ్యవహరించేవారి అహంకార వైఖరిని మంత్రులు అందువల్లనే సమర్థించే స్థితికి దిగజారారు.

శ్రీ అహ్మద్ అలీఖాన్ పోలీసు పద్దును ప్రవేశపెడుతూ ఈసారినేరాలు తగ్గాయని లెక్కలు చూపారు. అసలు ఈ లెక్కలు ఎవరిచ్చినవి? పోలీసు అధికారులే. లెక్కల్లో నమోదు కాని నేరాలసంగతేమిటి? హత్యలే లెక్కకు రాకుండా పోతున్నవని కాంగ్రెస్ సభ్యులే శాసనసభలోచెప్పారు. రాష్ట్ర రాజధానిలోనే రెండు శవాలు బయట పడితే చడీచప్పుడూ లేకుండా వాటిని పాతిపెట్టడం జరిగిందంటే మారుమూల ప్రాంతాల విషయం అడగనక్కరలేదు.

ఇక దొంగతనాలవిషయ మందామా పోలీసు శాఖతో లావాదేవీలు లేని దొంగలముఠా లేదు.

అంతర్జాతీయ బందిపోటువాళ్లాట్‌కు కేంద్రపోలీస్‌శాఖతో సన్నిహితులుంటే స్థానిక దొంగల ముఠాతో రాష్ట్రంలోని ఆయా స్థానిక పోలీస్ అధికారులకు లావాదేవీ లున్నాయి.

రాజమండ్రి రైల్వేస్టేషనువద్దరైలు వాగన్లలోని సరకులు అపహరించే రెండు దొంగల ముఠాల కార్యకలాపాలను గురించి నేటి 'విశాలాంధ్ర'లో ప్రకటిస్తున్నాం. పోలీసుల షరీకు లేకుండా ఆ ముఠాలు ఇంత నిర్భయంగా ఎలా వ్యవహరించడంసాధ్యం? ఇలాంటి ఉదాహరణలు ఎన్నైనా ఇవ్వవచ్చు.

బ్రిటిష్ హయాంలో "పోకిరీకి పోలీస్‌పని" అనే సామెత పుట్టింది. దేశ స్వతంత్రమైన తరువాత ఏవిధమైన మార్పురాని శాఖల్లో పోలీస్ శాఖది ప్రథమ తాంబూలం.

శాసనసభ్యుడు శ్రీ ధర్మభిక్షన్ని రాజధానిలోనే ప్రభుత్వ ఆస్పత్రివద్ద అనేకుల సమక్షంలో బూతులు తిట్టడానికి వెనుకాడని పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరు పోలీసు అధికారవర్గానికి ఒక నమూనా మాత్రమే.

లెజిస్లేచర్ కాంగ్రెసుపార్టీ నాయకత్వ ఎన్నికల సందర్భంలో అధికార ముఠాప్రత్యర్థిముఠాకు చెందిన తనపార్టీ వారిపైననే సి. ఐ. డి. పోలీసుల నిఘా వుంచే హీనస్థితికి దిగ జారినప్పుడు పోలీసుల నుండి ఎవరికి రక్షణవుంది?

దేశాన్ని అధోగతికి తీసుకొని పోతున్న కాంగ్రెసుపరిపాలనా ధోరణులకు పోలీసు వ్యవస్థ ఒక ఉదాహరణ.

ఆసియారాజ్యంగా సోవియట్ రష్యా

కె. పి. యస్. మీనన్ ప్రశంస

న్యూఢిల్లీ, మార్చి 12

తాష్కెంట్ ప్రకటనతో సోవియట్ యూనియన్ ఒక పెద్ద ఆసియా రాజ్యంగా ఆవిర్కారం పొందింది. అని మాస్కోలో మాజీ భారత రాయబారి శ్రీ కె. పి. యస్. మీనన్ నేడిక్కడ రష్యన్ భాషాధ్యయనసంస్థ అధ్వర్యాన జరిగిన ఒక సభలో చెప్పారు.

భారత సోవియట్ దేశాలు ఒండొరులను నిర్లక్ష్యం చేసుకోజాలవనే యదార్థాన్ని దేశ స్వాతంత్ర్యానికి పూర్వమే కీర్తిశేషులైన జవాహర్‌లాల్ నెహ్రూ గుర్తించారు. ఆ నిర్ధారణ యీనాడు యదార్థమని ఋజువైంది. మాదేశాన్నిప్రమాదస్థితిలో సోవియట్ యూనియన్ ఆదుకున్నది.

అంతేకాదు, భారత పాకిస్తాన్‌ల మధ్య సమోధ్య పొసగజేసేటందుకు కృషిచేసింది. ఈ కృషిద్వారా భారత సోవియట్ దేశాల మధ్య మైత్రి మరింత బలపడింది. అని శ్రీ మీనన్ చెప్పారు.

ఈ సంవత్సర మొదటి నెలలో 75,764 టన్నులు కృత్రిమ నూలును జపాను వుత్పత్తి చేసింది.

* * *

జూన్ నెలలో చైనా ప్రధాని చౌ ఎన్ లై రుమేనియా పర్యటన జరపవచ్చునని తెలుస్తున్నది.

హవానాసభ నిర్ణయాల ప్రాధాన్యం

చైనా పాత్ర

శ్రీ

హర్‌బన్స్ సింగ్

ఖండత్రయ మహాసభ జరిగిన క్యూబా రాజధాని హవానా పట్టణమంతా ఎర్రజెండాలతో ముచ్చటగా అలంకరించబడింది. ప్రతిముఖాణం (షాపు) సుస్వాగత పతాకాలతో మహాసభకు వస్తున్న ప్రతినిధులకు ఆహ్వానం పలుకుతూంది. పట్టణంలోని ప్రతిమలుపులో పెద్దపెద్దగుంపులుప్రతినిధులనుఆహ్వానిస్తున్నాయి. అందమైన క్యూబా బాలికలు సైనికదుస్తులతో రాకపోకలను కంట్రోలు చేస్తుంటే, మేముఆశ్చర్యచకితులమయ్యాం. మేము హవానా చేరినసమయంలో, మేము పవిత్రాత్మక స్థలంలో వున్నట్లుగా స్పష్టమైంది. జనవరి 3 మొదలు 15 వరకు, 82 దేశాలనుంచి వచ్చిన 512 మంది ప్రతినిధులతో హవానాలోని హోటలు లిబ్రిలో ఈ మహాసభ జరిగింది.

మహాసభ ఆదినుంచి తుదివరకు జరిగిన కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించబడినాయి. ఈ మహాసభ యేర్పాటు చేయడానికి యెటువంటి విప్లవాత్మకమైన, క్రియాత్మ, అప్రమత్తతతో గూడినసంస్థ కృషిని కొనసాగిస్తున్నదో యీ మహాసభ నిర్వాహకులకు మాత్రమే సుబోధకము. క్యూబాలాంటి చిన్న దేశంప్రతిభాషకుఅనువాదకులను, దుబాసీలనుయేర్పాటు చేయడమంటే అద్భుతం తప్ప మరేమీకాదు.

క్యూబా విప్లవ 7 వ వార్షికోత్సవ రోజు జనవరి 2 న ఫైడెల్ కాస్ట్రో చేసిన ప్రసంగం మహాసభ వుద్దేశ్యాలను వెలువరించింది. అమెరికా నాయకత్వాన అంతర్జాతీయ సామ్రాజ్యవాద ప్రపంచ వ్యాపిత పథకాన్ని ఆయన ప్రసంగంలో బహిర్గత పరచారు. మహాసభ అత్యవసరంగా పరిశీలించవలసిన సమస్యలను కూడ ఆ ప్రసంగంలో నొక్కిచెప్పారు. చైనా, క్యూబాలమధ్య నూతనంగా ఆవిర్భవిస్తున్న యిబ్బందులనుకూడ ఆ ప్రసంగంలో తెలపటం జరిగింది. ప్రతినిధులను ఆహ్వానిస్తూ కాస్ట్రో చేసిన ప్రసంగాన్ని చైనా హర్షించడానికిగాని అభినందించడానికిగాని తిరస్కరించింది.

కమిషన్ల యేర్పాటు

వివిధదేశాలప్రతినిధి వర్గాలనాయకులవుపన్యాసాలతో మహాసభప్రారంభమైంది.దీనితరువాతరాజకీయ,సాంఘిక, సాంస్కృతిక, నిర్మాణ విషయాలపై నాలుగు కమిషనులు నియమించబడ్డాయి. ఈ కమిషన్లలో దాదాపు 100 తీర్మానాలు ఆమోదించబడ్డాయి. కమిషన్లు అనేక యిబ్బందులను సహజంగా ఎదుర్కొనవలసి రావడం వలన, దీర్ఘ చర్చలు జరపడం జరిగింది. ఉదాహరణకు అందులో ఒక కమిషను తనపనిని 10 వ తేదీ వుదయం ప్రారంభించి, మరుసటిరోజు వుదయం 10 గంటలవరకు తన పనిని కొనసాగించింది. మూడు ఖండాలలోని వివిధ భాగాలలో వివిధ రకాలైన పరిస్థితులున్న కారణంగా ప్రథమంలోనే అభిప్రాయ భేదాలు వుద్భవించాయి. అందులో కొన్ని దేశాలు వారి విముక్తి కొరకు యిప్పటికీ పోరాడుతూనే వున్నాయి. అందులో కొన్ని సాయుధ పోరాటాన్ని నడుపుతున్నాయి. ఇంకా కొన్ని దేశాలు విముక్తి పూర్వం వున్న సమస్యలను పరిష్కరించుకొనేదానికి వివిధపద్ధతులతో ప్రయత్నిస్తున్నాయి. కొన్ని దేశాలు సోషలిస్టు దేశాలు. మొత్తంమీద, అత్యధిక తీర్మానాలు యేకగ్రీవంగా ఆమోదించబడినాయి. కొన్ని సందర్భాలలో వోటింగు అవసరమయింది.

ఖండత్రయ సంస్థ యేర్పాటు

ప్రపంచ సామ్రాజ్యవాదం, దాని వలసలను కోల్పోయి, అనేక పరాజయాలకు గురైన అనంతరం వియత్నాం, జింబాబ్వే. డొమినికన్ రిపబ్లిక్‌లలోనూ, మూడు ఖండాలలోని అనేక ప్రదేశాలలోనూ దురాక్రమణలు చేస్తున్న సామ్రాజ్యవాద స్వభావాన్ని అందరూ గుర్తించారు. ప్రపంచవ్యాపిత సామ్రాజ్యవాద దురాక్రమణను నిరోధించడానికి ఖండత్రయ సంస్థ నొకదానిని యేర్పాటు చేసి, నినాదాలు, ఎత్తుగడలతో ఒక వేదికను రూపొందించే అవసరాన్ని మహాసభ మొత్తంగా గ్రహించింది. దీని ఫలితంగానే క్యూబాలో తాత్కాలికంగా ఖండత్రయ కార్యాలయాన్నొకదానిని యేర్పాటు చేశారు. ఒక్కొక్క ఖండంనుంచి 4 గురు ప్రతినిధులు చొప్పున, క్యూబా పార్టీ నాయకుడు ఒస్మానీసేన్ ఫ్యూగస్ కార్యదర్శిగా యీ కార్యాలయం కార్యక్రమాన్ని నడుపుతుంది. 3 ఖండాలనుంచి నియమితులైన ప్రతినిధులు: ఆఫ్రికా ఖండం నుంచి ఐక్యఅరబ్ రిపబ్లిక్, గినీ, పోర్చుగీసు వలసలు, కాంగోలు. లాటిన్ అమెరికా ఖండంనుంచి వెనిజులా, క్యూబా, డొమినికన్ రిపబ్లిక్, చిలీలు. ఆసియాఖండం నుంచి ఉత్తర కొరియా, దక్షిణ వియత్నాం, పాకిస్తాన్, సిరియాలు.

సామ్రాజ్యవాద దురాక్రమణదారులను విముక్తి పోరాటాలద్వారా త్రిప్పి కొట్టకపోయినట్లయితే, ప్రపంచ యుద్ధ ప్రమాదం అభివృద్ధి అవుతుందని మహాసభ గ్రహించింది. నూతనంగా యేర్పడిన ఖండత్రయ సంస్థ ప్రతి విముక్తి పోరాటానికి సహాయపడటం అత్యవసరం. అందుకుగాను ఒక సహాయక కమిటీ నియామకం జరిగింది. అమెరికా నాయకత్వాన వున్న ప్రపంచ సామ్రాజ్యవాద విధానానికి వ్యతిరేకంగా పోరాడడానికి సోషలిస్టు దేశాలు, అంతర్జాతీయ కార్మికవర్గం, విముక్తి పోరాటాలు - ఒక్క మాటలో చెప్పాలంటే సామ్రాజ్యవాద వ్యతిరేక శక్తులన్నీ సహకార సమన్వయాంతో పని చేయాలని సహాయక కమిటీ చేసిన సాధారణ ప్రకటనలో నొక్కి చెప్పింది.

ఈ నూతనసంస్థ 1958 లో స్థాపించబడిన ఆఫ్రికా ఆసియా సంఘీభావ కమిటీ కొనసాగింపు. ఈ కమిటీ గత 7 సంవత్సరాలుగా చెప్పలేనంత కృషి చేయడమేగాక, లాటిన్ అమెరికా విముక్తి వుద్యమాలతో సంబంధాలను నెలకొల్పింది. లాటిన్ అమెరికా, ఆఫ్రో - ఆసియా విముక్తి వుద్యమ ప్రవాహాల రెండింటిని సమ్మిళితం చేయడానికి యీ కమిటీ నిర్ణయించింది. కార్యాచరణ కార్యక్రమంతో కూడిన యీ నూతనసంస్థ అవిర్భావం ఒక చారిత్రాత్మక ఘటన అయింది. సామ్రాజ్యవాద శక్తులు సైనికచర్యతో యెక్కడ జోక్యం చేసుకుంటున్నవో ఆ విషయాలపై ప్రధానంగా మహాసభ తన దృష్టిని కేంద్రీకరించింది. ఇతర సమస్యలను వదలివేయడం జరగలేదు. నయా వలసవాద దురాక్రమణను ఎదుర్కొంటున్న దేశాలలోని స్వతంత్ర ఆర్థిక విధానాల సమస్యను ఆర్థిక కమిషన్ చేబట్టింది. సామ్రాజ్యవాదశక్తులు చేస్తున్న సాంస్కృతిక దురాక్రమణను ఎదుర్కొనే సమస్యను, నూతనంగా విముక్తి పొందిన దేశాలలోని సాంస్కృతిక విప్లవ సమస్యను సాంస్కృతిక కమిషన్ చర్చించింది.

ఈ విజయాలను సాధించడం అంతతేలికగా జరుగలేదు. వివిధ దేశాలలో రకరకాలుగా యేర్పడిన పరిస్థితులనుంచి కొన్ని అభిప్రాయ భేదాలు యేర్పడినాయి. చైనా నాయకత్వాన కొన్నిదేశాలు పెద్దయిబ్బందిని కలిగించాయి.

రాజకీయ కమిషన్ చర్చలు - తీర్మానాలు

ఐక్యరాజ్య సమితిని పూర్తిగా బహిష్కరించాలని, శాంతియుత సహజీవనం, నిరాయుధీకరణలలో విశ్వాసాన్ని వదలుకోవాలని రాజకీయ కమిషనులో చైనా ప్రతినిధివర్గం కోరింది. ఐక్యరాజ్య సమితి పక్షపాత విధానాలను, ఐరాస వుపసంఘాలను సామ్రాజ్యవాదులు వుపయోగించుకొంటున్న పద్ధతిని ఖండించాలని తీవ్రమైన చర్చ అనంతరం కమిషను ప్రకటించింది. అయితే మూడు ఖండాలలోని దేశాలు ఐరాసను బహిష్కరించే విషయాన్ని కమిషను పేర్కొనలేదు. శాంతియుత సహజీవనమంటే అర్థం సామ్రాజ్యవాద, బానిసత్వాల సహజీవనం కాదని వేరొక తీర్మానంలో కమిషన్ చెప్పింది. సామ్రాజ్యవాదుల దురాక్రమణను, జోక్యాన్ని వ్యతిరేకించడానికి, అణుయుద్ధ ప్రమాదాన్ని నిరోధించడానికి శాంతియుత సహజీవనం వర్తిస్తుందని ఆ తీర్మానంలో స్పష్టం చేయబడింది. సామ్రాజ్యవాద వ్యతిరేక వర్గపోరాటాలకు శాంతియుత సహజీవనం, అనుకూలమైనదని తెల్పారు. హవానా మహాసభ యేవో కొంతమందితో కూడిన కజ్జాకోరుసభ అనే సామ్రాజ్యవాదుల ప్రచారాన్ని యీ తీర్మానం త్రిప్పికొట్టింది. ప్రపంచ శాంతిశక్తుల, జాతీయ విముక్తి శక్తులమధ్య యీ తీర్మానంద్వారా మహాసభ ఐక్యతను సాధించింది. ఈ తీర్మానం [illegible] వంతు మెజారిటీతో ఆమోదించబడింది. చైనా నాయకత్వాన 10 దేశాలు మాత్రమే వ్యతిరేకించాయి.

సాంఘిక సాంస్కృతిక కమిషన్

సాంఘిక, సాంస్కృతిక కమిషనులో ప్రధానంగా కార్మిక, మహిళా, యువజన సంస్థలపై భారతదేశం 3 ముసాయిదా తీర్మానాలను తయారు చేసింది. ప్రపంచ సామ్రాజ్యవాదం, ప్రపంచ ట్రేడ్ యూనియన్లకాన్ఫడరేషన్ ద్వారా కార్మిక సంఘాలను విచ్ఛిన్నం చేయడానికి తన ప్రయత్నాలను రెట్టింపు చేసిన దృష్ట్యా, కార్మికవర్గ ఐక్యతకు, ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్యతో సంబంధాలను పెంపొందించుకోవడానికి సంఘీభావ ఉద్యమ చరిత్రలో మొట్టమొదటి సారిగా కృషి సల్పింది. ప్రపంచ కార్మిక సమాఖ్య సామ్రాజ్యవాద అనుకూల సంస్థ అనీ, సామ్రాజ్యవాద వ్యతిరేక మహాసభలో దీని నామాన్ని వుచ్చరించగూడదని చైనా ప్రతినిధులు ప్రకటించారు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాలలోని మహిళా సంస్థలు ప్రపంచ ప్రజాస్వామ్య మహిళా సమాఖ్యతో సహకరించకూడదని కూడ ప్రకటించారు. ప్రపంచ కార్మిక సమాఖ్య, మహిళా సమాఖ్య, యువజన సమాఖ్యలతో సహకారాన్ని సిఫారసు

(మిగతా చివర పేజీలో)

అత్యవసరపరిస్థితి కొనసాగింపుకై ప్రభుత్వం ఎత్తులు

రాజ్యసభలో శ్రీ గోవిందన్ నాయర్ విమర్శ

న్యూఢిల్లీ, మార్చి 11

హోంమంత్రి శ్రీ నందా, రాష్ట్రాల ముఖ్యమంత్రులు అత్యవసర పరిస్థితిని వుపసంహరించడానికి యిష్టంలేక దేశంలో బెంగాలులాంటి పరిస్థితులను సృష్టిస్తున్నారని నేడు రాజ్యసభలో కమ్యూనిస్టు సభ్యులు యం. ఎన్. గోవిందన్‌నాయర్ తీవ్రంగావిమర్శించారు.

ఇదే రకమైన పరిస్థితిలో నందా, ముఖ్యమంత్రులు దేశాన్ని పరిపాలించడమే వారి వుద్దేశ్యమైతే, ప్రజానీకం అంగీకరించదని ఆయన అన్నారు.

పశ్చిమ బెంగాలులో జరిగిన సంఘటనలకు కేంద్రం బాధ్యత వహించాలని ఆయన హెచ్చరించారు.

ప్రధాని కలకత్తా వెళ్ళినపుడు ప్రతిపక్ష నాయకులను ఎందుకు కలుసుకొనలేదని కమ్యూనిస్టు సభ్యులు శ్రీ పి. కె. కుమారన్ ప్రశ్నించారు.

ప్రతిపక్ష నాయకులను ప్రధాని కలుసుకొనకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి నిరోధించారా? అని కూడ ఆయన ప్రశ్నించారు.

బెంగాలు ప్రతిపక్ష నాయకులను కలుసుకోవడానికి ప్రధాని శ్రీమతి ఇందిర చొరవ ఎందుకుతీసుకోలేదనిఇండిపెండెంటుసభ్యులు శ్రీ గంగాశరణ సిన్హా ప్రశ్నించారు. ఆహారం జాతంతటికీ సంబంధించిన సమస్య అనీ, కనుక దీనిని జాతీయ విధానంపైనే పరిష్కరించాలని, ప్రతిపక్ష నాయకులను కలుసుకొనకుండా ప్రధానిని యేవోశక్తి అడ్డగించిందని ఆయన అన్నారు.

మంత్రులు రెచ్చగొట్టే ప్రకటనలు యివ్వకుండా వుండేటట్లు ప్రధాని హామీ యివ్వాలని అయన కోరారు. కేరళ, పశ్చిమ బెంగాలు ఆహార పరిస్థితిపై పార్లమెంటులో చర్చ జరిగేటప్పుడు, ఆందోళననే వృత్తిగాపెట్టుకొన్నవారు నిరుద్యోగులని ఆహార మంత్రి చెప్పారని, ఈ రకమైన రెచ్చగొట్టే ప్రకటన చేయడం ఆహార మంత్రికి తగినది కాదని ఆయన తీవ్రంగా విమర్శించారు.

హోం మంత్రి శ్రీ నందా సభ్యులు చేసిన విమర్శనలను తిరస్కరిస్తూ, ప్రభుత్వం తనంతట తానుగా రైల్వే ఆస్తిని నష్టపరచుకొంటుందా? అని ఆయన అన్నారు.

ప్రభుత్వం బెంగాలులో ప్రశాంతపరిస్థితిని కలుగజేయడానికి ఆతురత జెందుతున్నదని ఆయన తెలిపారు.

ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి సభ్యులు ప్రశ్నలకు జవాబు చెపుతూ రాజ్యాంగబద్ధంగానే రాష్ట్ర ప్రభుత్వానికి సహాయార్థంగా సైనిక బలగాలను పంపడం జరిగిందని ఆమె అన్నారు.

దక్షిణ వియత్నాం సైన్యంలో లుకలుకలు

వియత్కాంగ్ దళాలచే మూడు ఓడల ముంపు

దానాంగ్ (దక్షిణ వియత్నాం) మార్చి 12

దక్షిణ వియత్నాంకు చెందిన ఐదుఉత్తర మండలాలకుసైన్యాధ్యక్షులుగా, బర్తరఫ్‌చేయబడిన లెఫ్టినెంట్ జనరల్ న్గుయెన్‌చాన్‌ధీను నియమించాలని కోరుతూ దానాంగ్‌లో యీరాత్రి సాధారణ సమ్మెకుపిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా నేడిక్కడ జరిగిన రెండవ ప్రదర్శనలో ఒక సైనిక మేజరు ఈ పిలుపు నిచ్చారు.

పౌరులతోనూ, సైనికులతోనూ యేర్పాటు చేయబడిన కమిటీ యేర్పాటు చేసిన వెయ్యిమంది సభికుల నుద్దేశించి మాట్లాడుతూ యీ మేజర్ యీ పిలుపు నిచ్చారు.

రేపు ఈ సమ్మెను జరుపుతారు. ఈ రోజు 170 వేల మందిప్రజలు వూరేగింపు జరిపారు.

గత గురువారం సైగాన్‌లో జరిగిన దేశవ్యాపిత పాలకమేజర్ జనరల్ నాయకత్వపు సమితి సమావేశంలో తనకు ఆరోగ్య కారణాలవల్ల సెలవు నిప్పించ వలసిందిగా కోరినట్లు అధికార పూర్వకంగా తెలుస్తున్నది.

లావోస్ సరిహద్దుమొదలు, ఉత్తర వియత్నాంవరకు తన స్వాధీనంలో వున్న ప్రాంతాన్ని కొంతమంది యువ ఉద్యోగులు, బౌద్ధుల సహాయంతో స్వతంత్ర రాజ్యాన్ని యేర్పాటు చేయాలని థీ ప్రయత్నించినట్లు గూడా. అందువల్లనే బర్తరఫ్ చేయబడినట్లు తెలుస్తున్నది.

జనరల్ థీకి అనుకూలంగా కొన్నిచోట్ల ప్రదర్శనలు జరుగుతున్నట్లు వార్తలందుతున్నాయి.

ఇక్కడకు 55 మైళ్ళ దూరంలో వున్న పాత రాజధానిలో విద్యార్థులు యిందుకు నిరసనగా తమ క్లాసులకు హాజరు కాలేదని గూడా తెలుస్తున్నది.

సైగాన్ బౌద్ధ నాయకులు యీ విషయం చర్చించ డానికి సమావేశ మవుతున్నట్లు గూడా తెలుస్తున్నది.

జనరల్ థీ పేరు ఉపహరించకుండా యీహొద్దులు ఒక ప్రకటనచేస్తూ సైన్యంలో అనైక్యత-వివాదం వున్నదని ఖండించారు. విదేశాలలోవున్న కమాండర్లు అందరూ వెంటనే సైనిక కార్యకలాపాలకు రావలసిందిగా విజ్ఞప్తి చేశారు.

ఓడలలో మందుగుండు ప్రేలుడు

350 టన్నుల మందుగుండుగల మూడు పెద్ద ఓడలలో ప్రమాదం సంభవించిందని, ఆ మూడు ఓడలు, సైగాన్‌కు దగ్గరగా వున్న నదిలో మునిగిపోయాయని దక్షిణ వియత్నాం సైనిక ప్రతినిధి ఒకరు తెలియచేశారు.

అమెరికా అమానుష చర్యలు

వియత్నాంలో విషవాయు ప్రయోగంపై 'టాస్' విమర్శ

మాస్కో, మార్చి 12

దక్షిణ వియత్నాం ప్రజలపై అమెరికా విషవాయువులను, రసాయనాలను ప్రయోగిస్తున్నదని, సోవియట్ వార్తా సంస్థ 'టాస్' నేటిరాత్రి ప్రకటించింది.

యుద్ధరంగంలో రసాయనాలను ప్రయోగించడానికి హిట్లరుముఠా సైతం సాహసం చేయలేక పోయారని టాస్ తెలిపింది.

సర్వసాధారణంగాగుర్తించినఅంతర్జాతీయ న్యాయసూత్రాలను, మానవత్వాన్ని మానవతానీతిని అమెరికా యుద్ధోన్మాదులు తమ పాదాలక్రింద యేవిధంగా నలిపివేస్తున్నదీ ప్రపంచమంతా పరిశీలిస్తున్నదని ఆ వార్తా సంస్థ తెలియజేసింది.

అమెరికా ఆథునపాలైన విధానాన్ని తొలగించడానికి, అమెరికాదురాక్రమణ దారులకు ఎవరూ సహాయపడరని తెలిపింది.

దక్షిణ వియత్నాం ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించుకొనేందుకు, దురాక్రమణ దారులను గెంటివేసేందుకు తీసుకున్న దృఢనిర్ణయాన్ని అమెరికా దురాక్రమణ దారులు ఛేదించలేరని టాస్ తెలిపింది.

లీ-షావ్-చీ త్వరలో పాకిస్తాన్ పర్యటన సంభవం

కరాచీ, మార్చి 12

చైనా అధ్యక్షులు లీ-షావ్-చీ, అయూబ్‌ఖాన్ ఆహ్వానంపై స్నేహపూర్వక పర్యటన జరుపనున్నారని నేటి రాత్రి విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటించింది.

అయితే, పర్యటన తేదీని ప్రకటనలో తెలియ జేయలేదు. అయితే రెండు దశలుగా మార్చి చివరలో పశ్చిమ పాకిస్తానులో ఏప్రియల్ మధ్యలో తూర్పు పాకిస్తానులో పర్యటన జరుపుతారని ఆ ప్రకటనలో తెలిపారు.

చైనా విదేశాంగ మంత్రి మార్షల్ చెన్‌యీ కూడా వస్తారని ఆ ప్రకటనలోవుంది.

పర్యటన తేదీలను త్వరలో ప్రకటిస్తారని భావించ బడుతున్నది.

ఉగండా పంచదార వుత్పత్తి 1964 కన్న 1965 లో దాదాపు పది టన్నులు తగ్గింది.

శాసనసభలో ప్రశ్నోత్తరాలు

ఆంధ్రలో స్కూటర్ల ఫ్యాక్టరీలు

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, మార్చి 12

సహకార పారిశ్రామిక సంస్థల నుండి వచ్చిన యెనిమిది దరఖాస్తులలో, ఒకటి హైదరాబాద్‌లో స్కూటర్ల ఫ్యాక్టరీ నెలకొల్పడానికి అనుమతికై వచ్చిందని, అనుమతికై రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేసిందని రాష్ట్ర శాసనసభలో ప్రశ్నోత్తరాల సమయంలో కమ్యూనిస్టు సభ్యులు శ్రీ స్వర్ణ వేమయ్య ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు అన్నారు. ఆటో సైకిళ్ళు, మోపెడ్స్ తయారుచేయడానికి అనుమతికై అయిదు దరఖాస్తులు వచ్చాయని ఆయన అన్నారు. దీనికై విజయవాడలోనూ, తాడేపల్లి గూడెంలోనూ ఉన్న నేషనల్ 'స్కూటర్ల తయారీ సంస్థలకు అనుమతి యివ్వవలసిందిగా గూడా కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిందని ఆయన అన్నారు.

ఆరుమాసాలక్రితమే యీ సిఫార్సులు చేయబడినాయని ఆయన అన్నారు.

ఆర్థిక వనరులను చూసి రాష్ట్రప్రభుత్వం సంతృప్తి చెందిన మీదనే యీ ఫ్యాక్టరీల అనుమతికై కేంద్రప్రభుత్వానికి సిఫార్సు చేసిందని అనుబంధ ప్రశ్నలకు సమాధానంగా అన్నారు. ఇవి వివిధ మేనేజిమెంట్ల కింద వున్నాయని అన్నారు.

శ్రీ ఏ. సర్వేశ్వరరావు, శ్రీ వంకాసత్యనారాయణ (కమ్యూ) ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెబుతూ రెండుకోట్ల రూపాయల పెట్టుబడితో రాష్ట్రంలో ప్రారంభింప దలచిన వ్యవసాయ పారిశ్రామిక కార్పొరేషన్‌కు మూలధనంకు డబ్బు యివ్వవలసిందిగా కేంద్రానికి విజ్ఞప్తి చేశామని, జవాబు కోసం యెదురు చూస్తున్నామని అన్నారు.

పారిశ్రామిక శాఖ అధికారులు కలకత్తా సెంట్రల్ మెరైన్‌లోవున్న కేంద్ర గ్లాస్ సిరమిక్ పరిశోధనా సంస్థలు భావనగర్‌లోవున్నసాల్ట్ కెమికల్ పరిశోధనాసంస్థను చూసారనీ, అధికారులు ఆంధ్రలో యేర్పాటు చేయించే వ్యవసాయ పారిశ్రామిక కార్పొరేషన్ యెక్కడ నిర్మించేది నివేదిస్తారని ముఖ్యమంత్రి అన్నారు.

మేనేజ్‌మెంటు సరిగాలేని పాఠశాలలను రాష్ట్రప్రభుత్వం తీసుకొనేందుకు ఆంధ్రప్రదేశ్‌వరకే పరిమితంచేయబడి ప్రస్తుతం వున్న చట్టాన్ని తెలంగాణాకు కూడా వర్తించేటట్లు చేయడానికి శాసనం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ప్రశ్నకు సమాధానంగా విద్యా మంత్రి శ్రీ ఏ. బలరామిరెడ్డి అన్నారు. దాని ఫలితంగా జంటనగరాలలో ప్రభుత్వసలహాను ఉల్లంఘించి ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలు ఫీజులు వసూలు చేయలేవని, ఆయన అన్నారు. అయితే వీటిని గుర్తించకుండా పర్యవేక్షణకు లేదని అందువల్ల విద్యార్థులు నష్ట పోతారని ఆయన అన్నారు.

దీనికి శిక్షణా గ్రాంటులను మంజూరు చేయకుండా వుంచలేమనీ, ఈ పాఠశాలలకు ప్రభుత్వం గ్రాంటులను ఇవ్వబడటం లేదని ఆయన అన్నారు. మొత్తంమీద ఫీజు వసూలు చేస్తున్న పాఠశాలలు 15 వున్నాయనీ, జంటనగరాలలో వున్న యీ పాఠశాలలో ఎక్కువ భాగం మిషన్ పాఠశాలలని ఆయన అన్నారు.



మార్చి 11 వ తేదీన విజయవాడలోని విద్యాధరపురంలో రోడ్డుపట్టిన్ తప్పి కొద్దిలో నదిలో పడబోతూ ఒక 15 ఏండ్ల బాలునిపైగా లారీపోయింది. పండ్లకొట్టులో గుమాస్తా ఐన కరీముల్లా అను ఆ బాలుడు వెంటనే మరణించాడు.

బంజర్లపై పెట్టుబడిదార్ల కన్ను

న్యూఢిల్లీ, మార్చి 12

సాగుపలాయకై నిరుపయోగంగా పడివున్న భూములను సాగుచేయడానికి జాయింటు స్టాక్ కంపెనీలను ప్రోత్సహించవలసిందిగానూ, ఇజ్రాయల్‌లో మాదిరిగా మిశ్రమ వ్యవసాయాన్ని ప్రవేశ పెట్టాలని నేడిక్కడ జరుగుతున్న భారత పరిశ్రమల, వాణిజ్య సమాఖ్య 39 వ వార్షిక సమావేశం ప్రభుత్వాన్ని కోరింది.

వ్యవసాయంలో స్వయం సమృద్ధిని సాధించడానికి పారిశ్రామిక వేత్తల కృషిని తెలుపుతూ, అదే సమయంలో అధికోత్పత్తికి వున్న ప్రతిబంధకాలను నిర్మూలించవలసిందిగా కోరారు.

వ్యవసాయ వుత్పత్తులలో పెరుగుతున్న కొరతకు ఆందోళనను వ్యక్తంచేస్తూ, పరిశ్రమలకు కావలసిన ముడిపదార్థాల కొరకు వ్యవసాయ ఆర్థిక విధానాన్ని పెంపొందించాల్సిన అవసరముందని వ్యాపారస్తులకు గుర్తుచేసింది.

విత్తనాల క్షేత్రాల యెడల పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు మరింత వుత్సాహాన్ని ప్రదర్శించాలని, అలాంటి సంస్థలకు ప్రభుత్వం ప్రత్యక్ష తోడ్పాటు అందించాలని ఆ సమాఖ్య కోరింది.

భాషా ప్రాతిపదికపై ఆహార పంపిణీ జరగాలని కోరుతూ, గుత్త ధాన్య సేకరణను ఆ సభ విమర్శించింది.

రేషనింగు తప్పనిసరయితే, సేకరణ ప్రాంతంలో గ్రేడెడ్ లెవీ మంచిదనీ, వ్యవసాయదారునిచేతులలో మిగిలివున్నధాన్యాన్ని స్వేచ్ఛగా అమ్ముకునేందుకు అనుమతించాలని ఒక తీర్మానంలో తెలిపింది. ఆహార మండల విధానం వుండకూడదని తెలియజేసింది.

మిశ్రమ వ్యవసాయంలో సహా వ్యవసాయ పద్ధతులను మెరుగు పరచేందుకు, మంచి విత్తనాలను సరఫరా చేసేందుకుగాను పరిశ్రమలు ప్రదర్శనా క్షేత్రాలను తీసుకొని, వాటిని ప్రదర్శనా కేంద్రాలుగా నడపాలని సమాఖ్య వేరొక తీర్మానంలో తెలిపింది. ఆ చుట్టు ప్రక్కల ప్రాంత రైతులకు సరఫరా కేంద్రాల ద్వారా రైతులకు విత్తనాలను సరఫరా చేయాలని తెలిపారు.

వ్యవసాయాభివృద్ధి కొరకు రసాయనిక, యితర ఎరువులను, మంచి విత్తనాలను వ్యవసాయ రంగంలో పెట్టుబడి పెట్టాలని సూచించారు.

ముడి పదార్థాల కొరత కారణంగా ఎరువుల పరిశ్రమలో తీవ్ర క్లిష్ట పరిస్థితులకు గురికావలసి వస్తున్నదని ప్రతినిధులు ఆందోళనను వ్యక్తం చేశారు.

ఇర్రిగేషన్ సౌకర్యాల వినియోగం కొన్ని రాష్ట్రాలలో తక్కువగావున్నదని, ఇర్రిగేషన్ సౌకర్యాల వినియోగాన్ని పెంపొందించాలని ప్రతినిధులు కోరారు.

గిద్దలూరుకు విద్యుత్సరఫరా

హైదరాబాద్, మార్చి 12

గిద్దలూరు నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ ఇ. బలరామిరెడ్డి తమ నియోజక వర్గ గ్రామాలకువిద్యుత్సరఫరా సమస్యను గురించి రాష్ట్ర ముఖ్యమంత్రికి నేడొక మెమొరాండం సమర్పించారు.

తమ నియోజక వర్గంలో గిద్దలూరు. అనుమలవీడు, రాచర్ల, కంచిపల్లి, కృష్ణంశెట్టిపల్లి, ముండ్లపాడు గ్రామాలకే విద్యుత్సరఫరా జరుగుతున్నదనిఆమెమొరాండంలో తెలిపారు.

చినకంబం-ఆకివీడు, గిద్దలూరు - కొమరోలు. గిద్దలూరు - రాచర్ల, పలకవీడు - సోమిదేవపల్లి విద్యుత్పథకాలను అమలు జరిపి గ్రామాలకు విద్యుత్సరఫరా చేస్తే రైతులు పంటలు బాగా పండించేటందుకు తోడ్పడగలుగుతుందని ఆయన తమ మెమొరాండంలో వివరించారు.

ఈ పథకాల క్రింద తురిమెళ్ళ, నార్స, సోమిదేవపల్లి గ్రామాలకు విద్యుత్సరఫరా వెంటనే జరిగించవలసిందిగా కోరుతూ, కేవలం నూతుల ఆధారంగా జరిగే అక్కడి వ్యవసాయానికి సహకరించవలసిందని కోరారు.

"రామరాజ్యం - కామరాజ్యం - యమరాజ్యం!"

లోక్‌సభలో చలోక్తులు

న్యూఢిల్లీ, మార్చి 11

కాంగ్రెస్ పదే పదే వల్లిస్తు వచ్చిన రామరాజ్యం ప్రస్తుతం కామరాజ్యమైందని అది త్వరలోనే యమరాజ్యంతో అంతమౌతుందని ఇండిపెండెంట్ సభ్యుడు శ్రీ యస్. యం. బెనర్జీ నేడు లోక్ సభలో విమర్శించారు.

దానికి కాంగ్రెస్ సభ్యుడు శ్రీ విభూతి మిశ్రా తిరిగి చలోక్తి విసరుతూ హిందూపురాణాల ప్రకారం నేరస్తులను శిక్షించడానికి దేవుడు యమరాజును అట్టిపెట్టుకొన్నారని అలాగే కామరాజు గూడా శ్రీ బెనర్జీవంటి రాజకీయ వేత్తల కోసం యమరాజును తన జేబులో అట్టిపెట్టుకొని వుండవచ్చునన్నారు.

సోషలిజాన్ని సత్వరమే సాధించేందుకు వీలుగా తీవ్రమైన పరిపాలనా మార్పులను ప్రవేశపెట్టాలని కోరుతూ శ్రీ మిశ్రా ప్రతిపాదించిన తీర్మానంపై చర్చ కొనసాగుతున్న సందర్భంలో ఈ చలోక్తులు జరిగాయి.

తెలంగాణాలో రైతులవద్ద అమ్మకం పన్ను వసూళ్ళు

శాసన సభలో తీర్మానం

హైదరాబాద్, మార్చి 12

తెలంగాణా ప్రాంతంలో ఆహార కార్పొరేషన్ ఏజంట్లు రైతులవద్ద ధాన్యం కొనే సందర్భంలో సేల్స్‌టాక్సు వసూలు చేస్తున్నారని- నేడు రాష్ట్ర శాసనసభలో ఒక కాల్ ఎటెన్షన్ తీర్మానాన్ని ప్రవేశ పెడుతూ శ్రీ నరసారెడ్డిగారు తెలియజేశారు.

రివెన్యూమంత్రి శ్రీ రామచంద్రారెడ్డి యిందుకు సమాధానం చెప్తూ, చట్టరీత్యా యిందులో కొంత యిబ్బంది వుందని తెలియజేశారు.

ఏజంట్లద్వారా జరిగే ధాన్యం కొనుగోలును ప్రస్తుత చట్టంక్రింద మొదటి టర్నోవర్‌గా పరగణించడం జరుగుతూ వుంది. ఆ మేరకు కొన్నిచోట్ల అమ్మకం పన్ను వసూలుచేస్తున్నారు. ప్రభుత్వం యీ విషయాన్ని పరిశీలిస్తున్నది. అవసరమైతే చట్టాన్ని సవరించుకుంది. అని ఆయన చెప్పారు.

శ్రీ గజేంద్ర గాడ్కర్‌కు వీడ్కోలు

ఢిల్లీలో అశోక్ మెహతా అధ్యక్షతన సభ

న్యూఢిల్లీ, మార్చి 12

భారత రాజకీయరంగంలో కీర్తిశేషులైన నెహ్రూ ఎలాంటివారో, న్యాయశాస్త్ర రంగంలో గజేంద్ర గాడ్కర్ అంతటివారు అని ప్రణాళికా శాఖామంత్రి శ్రీ అశోక్ మెహతా నేడిక్కడ ఒక సభలో చెప్పారు.

భారత సుప్రీమ్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవి నుండి విరమిస్తున్న శ్రీ గాడ్కర్‌కు వీడ్కోలు యిచ్చేటందుకు జరిగిన యీ సభకు శ్రీ మెహతా అధ్యక్షత వహించారు.

దినదినాభివృద్ధి చెందుతున్న మనదేశంలో న్యాయశాస్త్రం సాంఘిక పరివర్తనా శీలతకు గొప్ప బోధకారి అవుతున్నదంటే, శ్రీ గాడ్కర్ లాంటివారి న్యాయ శాస్త్ర పారీణతే అందుకు ఆధారం. అని శ్రీ మెహతా కొనియాడారు.

సాంఘికమైన మార్పులు జరుగుతున్న మనలాంటి దేశంలో, యీ పరివర్తనా శీలతకు ఎంతో ప్రాముఖ్యత వుంది, దీనిని గమనించక తీరదు. ప్రతిఒక్కరూ సమాజం పట్ల తమ విధులనూ, బాధ్యతలనూ గుర్తించాలి. న్యాయవాదులు ఇందుకు దోహదం చేయగలరు. అని శ్రీ మెహతా అన్నారు.

శ్రీ గజేంద్ర గాడ్కర్ వీడ్కోలు ప్రసంగాలకు సమాధానం యిస్తూ మాట్లాడారు. సమాజంలోఆర్థిక, సాంఘికమార్పులను తెచ్చేందుకు న్యాయశాస్త్రం. ఒక బలీయమైన సాధనం. న్యాయపద్ధతుల్ని మక్కీకి మక్కీ అమలుజరపటం సరిపోదు. ప్రజలను చైతన్యవంతుల్ని చేయాల్సి వుంటుంది. అని ఆయన చెప్పారు.

ఢిల్లీ సర్వెంట్స్ ఆఫ్‌ది పీపుల్ సొసైటీ ఆధ్వర్యాన జరిగిన యీసభలో నగర్ మేయర్ శ్రీ నూరుద్దీన్ అహ్మద్, మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీ యస్. ఆర్. సుల్కానీ ప్రభృతులు ప్రసంగించారు.

28వ తేదీన 'క్విట్ వర్కు'కు సర్వత్రా సన్నాహాలు

పశ్చిమగోదావరిజిల్లా ప్రాథమిక ఉపాధ్యాయుల తీర్మానం

తాడేపల్లిగూడెం, మార్చి 10

పశ్చిమ గోదావరిజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ కార్యవర్గ అత్యవసర సమావేశం ఈనెల 6 వ తేదీన స్థానిక విద్యాభవన్‌లో సంఘాధ్యక్షులు శ్రీ ఎమ్. రాజగోపాలరావుగారి అధ్యక్షతను జరిగింది. ప్రధాన కార్యదర్శి శ్రీ పిల్లి సుబ్బారావు ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదిక, జమా ఖర్చులు, ఏకగ్రీవంగా ఆమోదించారు. శ్రీ చెన్నుపాటి లక్ష్మయ్యగారు హాజరై వుద్యోగ ప్రతినిధులకు ప్రభుత్వానికి జరిగిన సంప్రదింపులు విపులంగా వివరించి మార్చి 28 కి వుద్యోగులు అందరూ సమైక్యంగా నిలబడవలసిన ఆవశ్యకతను వివరించారు. ఇంకను వివిధ తీర్మానములు ఆమోదింపబడినాయి. ఉద్యోగులందరూ సంయుక్త కార్యాచరణ సమితి నిర్ణయాన్ని అమలుజరపాలని. జిల్లాలోని ఉపాధ్యాయులకు యితర వుద్యోగులకు జిల్లా సంఘం విజ్ఞప్తి చేసినది.

ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్ణయం

గుంటూరులోని అఖిల ప్రజారోగ్య శాఖ పనివారల సంఘ కార్యవర్గం నేడు సమావేశమై సోదర ప్రభుత్వసంస్థల నిర్ణయానుసారం మార్చి 28 వ తేదీన పని నిలుపుదల చేయడానికి నిర్ణయించారు.

రాజమండ్రి మెడికల్ ఎంప్లాయీస్

ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాజమండ్రి బ్రాంచి సమావేశము యూనియన్ సహాయ కార్యదర్శి శ్రీ నిమ్మకాయల వీరన్నగారి అధ్యక్షతను 6 వ తేదీన జరిగింది. డి. ఎ. పెరుగుదలకై మార్చి 28 న పనినిలుపుదలలో పాల్గొనుటకు శ్రీమతి బుచ్చమ్మ పెన్షన్ 4 సంవత్సరాల తదుపరి కూడా ఇవ్వని ప్రభుత్వ చర్యను గర్హిస్తూ, యూనిఫారంలు ఇవ్వనందుకు నిరసన తెల్పుతూనూ తీర్మానించారు.

కాకినాడ డివిజన్ హైవేస్ పనివారి నిర్ణయం

కాకినాడ డివిజన్ తాలూకు అమలాపురం సబ్‌డివిజన్ హైవేస్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యకర్తల సమావేశం యీ నెల 6 వ తేదీన యూనియన్ వుపాధ్యక్షులు, సూర్యనారాయణరాజుగారి అధ్యక్షతను అమలాపురంలో జరిగినది. అన్ని సెక్షన్‌ల నుండి ముఖ్యకార్యకర్తలు అంతా హాజరయ్యారు. తొలుత డివిజన్ యూనియన్ కార్యవర్గ సభ్యులు జట్టి అప్పలస్వామిగారి అకాల మరణానికి గాఢసంతాపం తెల్పుతూ తీర్మానించారు. డివిజన్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ చింతపల్లి కృష్ణమూర్తిగారు మహాసభ అనంతరం సాగించిన కార్యకలాపాలు, రాయబారాలు వాటి పర్యవసానంగా వచ్చిన ఫలితాలు వివరించారు. యూనియన్ కార్యదర్శి శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణగారు మాట్లాడుతూ ప్రభుత్వ వుద్యోగులందరితో పాటు హైవేస్‌పని వారు కూడా ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. మార్చి 28 న పని నిలుపుదలలో పాల్గొనాలని తీర్మానించారు.

విశాఖ మార్షలింగ్ యార్డు సమ్మె సమాప్తం

విశాఖపట్నం, మార్చి 9

గతనెల 25 వ తేదీన ప్రారంభమైన 3000 మంది విశాఖ మార్షలింగ్ యార్డు కార్మికుల సమ్మె 12 రోజులు జయప్రదంగా సాగి, ముగిసినది. ఈ రోజు వుదయంనుండి కార్మికులు ప్రశాంతంగా పనులలోకి వెళ్ళారు.

కేంద్రప్రభుత్వ అసిస్టెంటు లేబర్ కమీషనర్ శ్రీ ఎ. ఎస్. మగీమాగారు నిన్న జోక్యం చేసుకొని, ప్రధాన డిమాండు అయిన జీతాల రేటు పెరుగుదలగూర్చి తాను ఆగ్నేయ రైల్వే అధికారులతో మాట్లాడి ప్రయత్నిస్తానని, ముందు సమ్మె విరమించమని హితవు చెప్పారు. ఆయన మాట హామీపై మార్షలింగ్ యార్డు కార్మికులు సమ్మె విరమించారు.

నిన్న అసిస్టెంటు లేబర్ కమీషనరు (సెంట్రల్) ఆగ్నేయ రైల్వే మెన్సు యూనియన్ వాల్తేర్ శాఖ వారిని, సమ్మె చేస్తోన్న రైల్వే కార్మికుల్ని, ఆగ్నేయరైల్వే అధికారులను సమావేశ పరిచారు సంప్రదింపులు జరిపారు.

అంతకుక్రితం సమ్మె చేస్తోన్న 3000మంది కార్మికులు కలెక్టరు కార్యాలయానికి, కేంద్ర అసిస్టెంటు లేబర్ కమీషనర్ కార్యాలయానికి ప్రదర్శనగా వెళ్ళారు. మహజర్లు సమర్పించారు. ఆగ్నేయ రైల్వేమెన్సు యూనియన్ జోనల్ కార్యదర్శి శ్రీ కె. కె. మూర్తి, ఉపాధ్యక్షులు శ్రీ కె. యస్. మూర్తి, స్థానికశాఖ అధ్యక్షులు శ్రీ ఆర్. ఎమ్. రావు, కార్యదర్శి శ్రీ బి. వి. యస్. మూర్తిగారలు సమ్మెదారుల తరఫున వ్యవహరించారు.

రైల్వేమంత్రికి, పార్లమెంటు సభ్యులు శ్రీయుతులు పీటర్ అల్వారెస్, ప్రియగుప్తా, యస్. యం. బెనర్జీగారలు, ఆగ్నేయరైల్వే జనరల్ మేనేజరుకు టెలిగ్రాంలు యిచ్చారు.

విజయవాడ

తెలుగు భాషతోపాటు ఉర్దూను అధికార భాషగా చేయరాదని విజయవాడ స్వతంత్రపార్టీ ఇటీవల సమావేశమై నిర్ణయించినట్లు శ్రీ ప్రకాశచంద్ర శతపథి తెలియజేస్తున్నారు.

దివిసీమ గ్రామాల్లో కమ్యూనిస్టుపార్టీ నిధి వసూళ్ళు

యార్లగడ్డ, మార్చి 10

ఈనెల 3, 4 తారీఖులలో తాలూకా వ్యవసాయ కార్మికసంఘ కార్యదర్శి శ్రీ కారుమూరి దేవసుందరంగారి నాయకత్వాన తాలూకా వ్యవసాయ కార్మికసంఘ సభ్యులు గోకవైగ్రాబయేలు, మరీదు స్వామేలుగార్లు కలిసి నిమ్మగడ్డ, యార్లగడ్డ గ్రామాలలో పార్టీనిధి వ్యవసాయ కార్మిక పేటలలో ఇంటింటికి తిరిగి విజ్ఞప్తి చేయగా ప్రతివాడు వుత్సాహముగా పార్టీనిధి తమశక్తికొలది ఇచ్చారు. అంతేగాక తమ సంఘములో సభ్యులుగాకూడా చేరారు. నిమ్మగడ్డలో 70 మంది సభ్యత్వము చేరి 70 రూపాయల నిధి సమర్పించారు. యార్లగడ్డలో 100 మంది సభ్యులగా చేరి, 30 రూపాయల నిధి యిచ్చారు. ఇంకనూ 100 మంది సభ్యులు చేరుటకున్ను నిర్ణయించుకున్నారు. యీ కార్యక్రమంలో ఇబ్బందులు ఎన్నివున్నా కార్యకర్తలు బాగా పని చేశారు.

పిఠాపురంలోని ఆహార సమస్య గురించి ఆందోళన

మున్సిపల్ కమ్యూనిస్టు పక్ష నిర్ణయం

పిఠాపురం, మార్చి 10

తూర్పుగోదావరిజిల్లా పిఠాపురం మున్సిపల్ ప్రాంత కమ్యూనిస్టు పార్టీ జనరల్‌బాడీ సమావేశం శ్రీ కోనేటి వీరాస్వామిగారి అధ్యక్షతను జరిగింది. జిల్లాకమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ అల్లూరి వెంకట రామరాజు హాజరై జిల్లాలోని ఆహార సమస్యనుగురించి రిపోర్టు యిచ్చారు. తరువాత ఈ క్రింది తీర్మానము ఏకగ్రీవంగా ఆమోదించబడింది.

"పిఠాపురం మునిస్పల్ ప్రాంతంలో ఆహార సమస్య తీవ్రరూపం దాలుస్తున్నది. దాని పరిష్కారానికి జిల్లాలోని నిలువ ప్రాంతాలనుండి సరుకు వచ్చుటకు అవరోధాలను తొలగించడం ద్వారాను రింకు షాపులకు పూర్తి సప్లయి చేయడంద్వారాను ధరలను అదుపులోనికి తెచ్చుటకు తీవ్ర ఆందోళన చేయాలి, ఆవసరమైన రాయబారలను నడపాలి."

కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ వద్దకు టీచర్ల రాయబారం

తెల్లప్రోలు, మార్చి 12

కృష్ణాజిల్లా గ్రాడ్యుయేట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ తుర్లపాటి పూర్ణచంద్రరావు, కోశాధికారి శ్రీ యల్. వి. రామగోపాలంతో కూడిన ప్రతినిధివర్గం నిన్న వీరవల్లిలో కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావును కలుసుకొని అసోసియేషన్‌తరఫున ఒక "[illegible]" సమర్పించారు. అందులో బి. ఇ. డి ఉపాధ్యాయుల సర్వీసును రెగ్యులరైజ్ చేయవలెనని, స్వల్ప కాలిక బి. ఇ. డి శిక్షణ పొందిన ప్రథమజట్టు ఉపాధ్యాయులకు పూర్తి జీతాన్ని మంజూరుచేస్తూ యింకను ఉత్తరువులు పొందనివారికి త్వరలో ఉత్తరువులు అందజేయవలెనని, ప్రభుత్వ ఉత్తరువులు అందిన అనంతరం బి. ఇ. డి. ఉపాధ్యాయులకు సెలెక్షన్ గ్రేడ్ యివ్వవలెనని, అభ్యర్థించబడింది.

పత్రంలోని అంశాలను ప్రతినిధులు వివరించగా పరిషత్ చైర్మన్ ఎంతో శ్రద్ధగా,సానుభూతితో విన్నారు.

సర్వీస్ రెగ్యులరైజ్ చేయు విషయంలో తగుచర్య తీసుకుంటామన్నారు చైర్మన్. స్వల్ప కాలిక బి. ఇ. డి. ఉపాధ్యాయుల (ప్రథమ జట్టు)కు యింకను పూర్తిజీతము పొందనివారి జాబితా అసోసియేషన్‌ద్వారా అందజేస్తే ఎట్టి ఆలస్యంలేకుండా ఉత్తరువులు జారీచేయగలమని. ప్రభుత్వ ఉత్తర్వు అందిన తక్షణం సెలెక్షన్‌గ్రేడును అమలుపరచుటకు జిల్లాపరిషత్ వెనుకాడబోదని ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులు తమ హక్కులతోపాటు బాధ్యతలను గుర్తెరిగి యస్.యస్.యల్.సి. పరీక్షలలో పొరుగుజిల్లా గుంటూరును ఆదర్శంగా తీసుకొని మంచి ఫలితాలను సాధించవలసినదిగా కోరారు.

పాలకొల్లు స్వర్ణకార సమ్మేళన్

పాలకొల్లు, మార్చి 10

పశ్చిమ గోదావరిజిల్లా పాలకొల్లు పట్టణ స్వర్ణకార సమ్మేళన్ ఫిబ్రవరి 27 న జరిగింది శ్రీ చోడవరపు రాఘవాచార్యులు అధ్యక్షత వహించారు. శ్రీ కొసనా బ్రహ్మనరిదరావు, అధ్యక్షులుగా, శ్రీ గురజాపు చిన్న సత్యం ఉపాధ్యక్షులుగా, నాగులకొండ గిరిరాజా కార్యదర్శిగా వింజరపు సూర్యహనుమంతరావు కోశాధికారిగా మరి 9 మంది సభ్యులుగా ఎన్నుకోబడింది.

రాష్ట్రసంఘములన్నీ స్వర్ణకార సమ్మేళన్‌గా వ్యవహరించుటవల్ల పాలకొల్లు సంఘాన్ని స్వర్ణకార సమ్మేళన్‌గా రూపొందిస్తూ తీర్మానించడమైనది.

బర్సెలోనా విశ్వవిద్యాలయ విద్యార్థులు మార్చి 3 నుండి సమ్మె చేస్తున్నారు.

బ్లాక్, మున్సిపల్ ప్రాంత స్థాయిలో కూడ సంయుక్త కార్యాచరణ సమితులు

నిర్మించుటకు కడపజిల్లా ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ తీర్మానం

కడప, మార్చి 10

పంచాయతీ సమితి, మున్సిపల్ స్థాయిల్లోకూడా వివిధ ప్రభుత్వోద్యోగులతో సంయుక్త కార్యాచరణ సమితులను ఏర్పరచాలని కడపజిల్లా ఉపాధ్యాయసంఘ కార్యవర్గం నిర్ణయించింది.

కడపజిల్లా ప్రాథమికోపాధ్యాయ సంఘ కార్యవర్గ - ప్రత్యేకాహ్వానితుల సమావేశం ఉపాధ్యక్షులు శ్రీ బి. గంగులయ్యగారి అధ్యక్షతను 6 వ తేదీన జరిగింది. 40 మంది హాజరయ్యారు.

తొలుత శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి, గాడ్గిల్, సావర్కార్ గారల మరణానికి సంతాపం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శి శ్రీ కె. నాగమునిగారు కార్యదర్శి నివేదికను, జమా ఖర్చులను సమర్పించారు.

చర్చల అనంతరము, అవి ఏకగ్రీవముగా ఆమోదించబడ్డాయి. మార్చి 1, 2 తేదీలలో హైదరాబాద్‌లో జరిగిన ఫెడరేషన్ సబ్ కమిటీ విషయాలు, ప్రదేశ్ సంయుక్త కార్యాచరణ సమితి నిర్ణయాలను సమీక్షించుకొన్నారు.

సంయుక్త కార్యాచరణ సమితి నిర్ణయాల దృష్ట్యా, బ్లాకు, మున్సిపల్ ఏరియాలలోను అన్ని సంఘాలతో సంయుక్త కార్యాచరణ సమితులను ఏర్పాటు చేయాలన్నారు కార్యదర్శి నాగమునిగారు. ఈ నెల 28 వ తేదీన నిర్ణయించబడిన పని నిలుపుదల కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చెప్పారు. తదుపరి జిల్లాపరిషత్తు ప్యానల్ విషయమై హైకోర్టు యిచ్చిన స్టే ఆర్డరును గూర్చి చెప్పుచు ఆంధ్రప్రదేశ్‌లో హైకోర్టులో యింతవరకు కడప మునిసిపల్ ఉపాధ్యాయుల, పోరుమామిళ్ళ తదితర బ్లాకు ఉపాధ్యాయుల సీనియారిటీ, ప్యానల్ సెలెక్షన్‌లపై 'స్టే', తెప్పించిన ఘనత ఈ జిల్లా సంఘానికే గల్గినదని వక్కాణించారు. తదుపరి సభ్యుల రిపోర్టులు విన్న తర్వాత ఆయా సమితులలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వ్రాతమూలకంగాజిల్లాసంఘానికి పంపిన తగుచర్య తీసుకోగలమని తెలిపారు. ఫెడరేషన్ సభ్యత్వం జూన్ నెలాఖరునే ప్రారంభించి యిప్పటికంటే ఎక్కువ సభ్యత్వమును చేర్పించి మన సంఘ ఐక్యతను పెంపొందించాలన్నారు.

తీర్మానములకు ముందు రాజంపేట, జమ్మలమడుగు సమితులనుండి జిల్లా కార్యవర్గమునకు శ్రీ ఎస్. వెంకటరెడ్డి, శ్రీ సి. ఎరికలరెడ్డిగార్లను ఏకగ్రీవంగాను, ఉపాధ్యక్షులుగా నుండిన శ్రీ ఎ. సుబ్బయ్యగారి స్థానే పులివెందులనుండి శ్రీ టి. లక్ష్మిరెడ్డిగారలు ఉపాధ్యక్షులుగా ఎన్నుకొనబడ్డారు.

ఈ క్రింది తీర్మానాలను ఆమోదించారు.

(1) సీనియారిటీనిబట్టి హెడ్మాష్టర్లడ్యూటీ అలవెన్సు పోస్టును భర్తీచేయాలి. (2) బ్లాకు, మునిసిపల్ ఏరియాలలోను, యితర ఉద్యోగుల సంఘాల ప్రతినిధులతోను ఒక సంయుక్త కార్యాచరణ సంఘము తక్షణం ఏర్పాటు చేయాలి. (3) సంయుక్త సంఘాల పిలుపుననుసరించి మార్చి 28 వ తేదీన పని నిలుపుదలను జయప్రదముగా జరిపించాలి. (4) కేంద్ర ప్రభుత్వం అమలు జరిపిన డి. ఏ. రేట్లను ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని తరగతుల ఉద్యోగస్తులకు, ఉపాధ్యాయులకు అమలు జరపాలి. (5) ఈ సంవత్సరము వర్షాభావము వలన రాష్ట్ర వ్యాపితముగా చాలా ప్రాంతాలలో పైర్లు దెబ్బ తినిపోయాయి, ఇందువల్ల ఆహార ధాన్యాలకు కటకట ఏర్పడింది. ధరలు ఆకాశాన్నంటుచున్నవి. కాన బ్లాకు లెవెల్‌లో పబ్లిక్ సర్వెంట్సు కన్‌జూమర్స్ కో-ఆపరేటివ్ స్టోర్సును నెలకొల్పి ఆదుకోవాలి. (6) అన్ని తరగతుల ఉపాధ్యాయులకు అన్ని గ్రేడులలోను ¼ భాగం పోస్టులను సెలెక్షన్ గ్రేడు పోస్టులుగా నిర్ణయించి 66 జూన్‌నుండి అమలు జరపాలి. (7) స్వాధీనము చేసికొన్న స్కూళ్ళలోని నాటి ఉపాధ్యాయుల ప్రతిపత్తికి భంగం కలుగునని ప్రభుత్వ ఉత్తరువులున్నప్పటికీ చాల సమితులలో వాటికి భంగం కలిగించారు. కాన నాటి ఉపాధ్యాయుల ప్రతిపత్తిని పునరుద్ధరించాలి. (8) పంచాయతి రాజ్ వ్యవస్థకు ప్రాథమిక విద్యను అప్పగించి ఆరు సంవత్సరాలైంది. ఈ ఆరు సంవత్సరాల అనుభవం దృష్ట్యా విద్యాసంస్థలలో రాజకీయాలు ప్రవేశించాయి. ఇవి రాష్ట్రానికి ఆరోగ్యకరం కాదు కనుక సమితుల - పరిషత్తులనుండి విద్యాశాఖను వేరు చేయాలి. దాని స్థానే విద్యాబోర్డులను నిర్మించి విద్యాశాఖను దానికి అప్పజెప్పాలి. (9) 1966-67 సంవత్సరంలో సెకండరీ పాఠశాలలలోని హయ్యర్ ఎలిమెంటరీ స్కూళ్ళలోని 8 వ తరగతిని రద్దుచేసి క్రొత్త 8 వ క్లాసును ప్రారంభించనున్నారు, దీని మూలమున సెకండరీ గ్రేడు ఉపాధ్యాయులు రిట్రెంచి కాకుండా సర్దుబాటు చేయాలి.

పదవిని, అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న తాశీల్దార్

బదిలీచేసి బహిరంగ విచారణ జరపాలని కదిరితాలూకా కమ్యూనిస్టుపార్టీ డిమాండ్

కదిరి, మార్చి 12

అనంతపురంజిల్లా కదిరి తాలూకా తాశీల్దార్ చేస్తున్న అక్రమాలపై అధికార దుర్వినియోగాలపై, అతనిని బదిలీ చేసి - విచారించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తాలూకా కమ్యూనిస్టు పార్టీ ఒక ప్రకటన చేసింది.

తాలూకా కమ్యూనిస్టుపార్టీ తరఫున దాని కార్యదర్శి శ్రీ ఎస్. ఎం. నైజాం అలీగారు చేసిన ఆ ప్రకటనలో యిలా వుంది.

"అనంతపురంజిల్లా కదిరితాలూకా అవినీతిపరులైన వుద్యోగులకు సారవంతమైన గడ్డ అని ప్రసిద్ధి చెందుచున్నది. కదిరికి లంచగొండి వుద్యోగస్తులు అనేకులు వచ్చి పోయారు, కొందరు ప్రజల ఆగ్రహ, ఆవేశాలకు తట్టుకోలేక పారిపొయ్యారు, పరాన్నభుక్కులైన పలురకాల వుద్యోగులు కదిరికి వచ్చారు. కాని ప్రస్తుతమువున్న పుల్లయ్యగారిలాంటి వ్యక్తి కదిరిచరిత్రలో మరెన్నడూ రాలేదు.

అడిగేదాతలేక యితని లంచగొండితనం ఈ మధ్య పరాకాష్ఠ నందుకొనింది. హోల్‌సేల్ ధాన్యం వ్యాపారస్తుడు నామా రామచంద్రయ్యతో ప్రత్యక్ష సంబంధముంచుకొన్నాడు. ఈ యిరువురు తోడుదొంగలుగా తయారై ప్రథా ట్రేడింగు కంపెనీని సృష్టించి అనేక రూపాలలో వేనవేలు సంపాదిస్తున్నారు.

ప్రజలను ప్రభుత్వాన్ని మోసం చేయుచున్న యీ యిరువురు యిది వాస్తవం కాదని బుకాయించవచ్చు. కాని యీ క్రింది ప్రశ్నలకు సమాధానం యివ్వమని తహసీల్దారును అతని ప్రియతమ వ్యాపారి నామా రామచంద్రయ్యను ప్రజలు నిలదీసి అడగాలని కమ్యూనిస్టుపార్టీ విజ్ఞప్తిచేస్తున్నది.

కొన్ని ఉదాహరణలు; ప్రశ్నలు

1. కదిరిపట్టణంలో దాదాపు 15 మంది హోల్‌సేల్ ధాన్యం వ్యాపారస్తులుండగా తహసీల్‌దారు యిచ్చే పరిమిట్‌లలో యెక్కువభాగం నామా రామచంద్రయ్యకుగాని అతను సృష్టించిన ప్రథా ట్రేడింగ్ కంపెనీకిగాని పోతున్నాయి యెందుచేత? వీరి మధ్యగల అంతర్గత లావాదేవి ఏమిటి? ఇతరులవద్దవున్న పాతస్టాకు వదలి రామచంద్రయ్య వద్ద ప్రథా ట్రేడింగ్ కంపెనీవద్ద వున్న కొత్తస్టాకునే తహశీలుదారు రిలీజు చేయడములో వున్న అంతరార్థమేమిటి? వేలకు డబ్బుపెట్టిన యితర వ్యాపారస్తులు నాశనం కావలసిందేనా? వారికి వడ్డీ అయినా గిట్టుకోవాలాలేదా!

2. దొంగరవాణాలో పట్టుకొని ప్రొక్యూరు చేసిన ధాన్యముతో యెక్కువభాగం నామా రామచంద్రయ్యకుగాని అతని ప్రథా ట్రేడింగ్ కంపెనీకిగాని పోతున్నాయి యెందుచేత? తహసిలుదారుకు నామా రామచంద్రయ్యపైన గల ప్రత్యేక అభిమానము ప్రేమనుగల కారణం యేమిటి? ప్రొక్యూర్ చేసిన 100 కిలోల మూటకు 80,90 కేజీల తప్పుడు లెక్కవేసి అందులోవచ్చే ఆదాయాన్ని యిరువురు పంచుకొంటున్నారని అందరూ అనుకొంటున్నారే కాదంటారా?

3. మైదా, చక్కెర, రవ్వ అన్ని పర్మిట్లు, నామా రామచంద్రయ్యకే యెందుచేత? యితర వ్యాపారస్తులు లేరా?

4. కదిరి పట్టణములో యింతకుమునుపు నూకలు, రాగులు అమ్మడానికి నలుగురికి లైసెన్సు వుండేవి. ఆ నలుగురిలో నామా రామచంద్రయ్య బావ అయిన వై.వి. వెంకట సుబ్బయ్య ఒకరు. తహసీల్దారు కొద్ది రోజుల క్రితం నలుగురికి లైసెన్సు రద్దు చేసినారు. కాని నెల అనంతరము మరీ రామచంద్రయ్య బావకు మాత్రం లైసెన్సు యిచ్చినారు. అతడు పల్లెలవిగాని, టౌనువుగాని జనానికి నూకలు అమ్మినట్లు రుజువు లేదు. నామా రామచంద్రయ్యపైననేకాక అతని బావపైన కూడా యెందుకీ ప్రత్యేకమైన అభిమానం, తహశీలుదారువద్ద యెప్పుడూ జరగాలన్న నామా రామచంద్రయ్యను పట్టుకుంటే సరిపోతుందని జనం అనుకొంటున్నారే కారణమేమిటి?

ధాన్యం దొంగరవాణాలో అధికారుల పాత్ర

ఇంతేకాదు తహసిలుదారు ధాన్యం దొంగరవాణాకు ప్రత్యక్షంగాను పరోక్షంగాను తోడ్పడుచున్నారు. పెండ్లిళ్ళకు చక్కెర అడిగితే లంచం, పల్లెలలో చౌకధాన్యం డిపోలు అడిగితే లంచం, లైసెన్సు వగైరాలకు లంచం, ఒక్కటేమిటీ లంచమివ్వని యెడల అతనితో యెవ్వరైనాగాని యే పని చేయించుకోలేరు. పేద స్వర్ణకారుల పిల్లలకు బుక్ అలవెన్సుకుగాను ప్రభుత్వము సహాయముచేస్తే అందులో సంతకం పెట్టడానికి కూడా తన సొత్తుపోయినట్లుగా భావిస్తారు. పేదవిద్యార్థులకు ఇన్‌కం సర్టిఫికెట్టులో సంతకము చేయుడానికి నానా బాధపెడుతారు తహసిల్‌దారు

ఈ విధంగా ప్రజలను బాధపెడుతూ అనేక రూపాలలో తహసిల్‌దారు వేనవేలు డబ్బు సంపాదించారు. పట్టణంలోని స్వర్ణకారులందరికి పనిలేదు. కాని అతని సొంత స్వర్ణకారునికి మాత్రం నిత్యము పనివుండటట. ప్రతివారం ఒక బంగారునగ తయారు చేయించని ఎడల తహసిల్‌దారుకు నిద్రపట్టదని అందరూ అనుకొంటున్నారు. ఇందులోని నిజానిజాలకు అతడు అతని స్వర్ణకారుడే జవాబు చెప్పాలి. ఈ మధ్య తన కుమార్తె వివాహ సందర్భంలో పెండ్లి కానుకలమూలకంగా కొన్ని వేల రూపాయలు గుంజినాడట.

ఉద్యోగ ధర్మం విస్మరించిన యితని పాపం పండింది. ప్రభుత్వం వెంటనే యితనిని బదిలీచేసి బహిరంగ విచారణ జరిపిన కరపత్రములోని ప్రతి అక్షరము రుజువు చెయ్యడానికి ప్రజలు సిద్ధంగా వున్నారు. కమ్యూనిస్టుపార్టీ అందుకు సహకరిస్తుంది.

ఇతని దగ్గర మిత్రుడొకడు జిల్లాకలెక్టరు ఆఫీసులో ఉన్నతోద్యోగులలో ఉన్నాడని తహశీల్దారు తప్పుడు పనులన్నిటిని అతడు వెనుకేస్తున్నాడని అనేకులు అనుకొంటున్నారు, ఆ ఉన్నతోద్యోగి యెవరు? అతనికి ఇతనికి గల గాఢమైత్రి వెనకాలదాగిన చిదంబర రహస్య మేమిటి? అనేది ప్రభుత్వమే అన్వేషించి తెలుసుకోవాలి. ప్రజలకు తెలిస్తే కమ్యూనిస్టు పార్టీ దృష్టికి తీసుకొనిరావాలి.

తహశీల్దార్ లంచగొండితనంపై ప్రభుత్వము గట్టి చర్య తీసుకోవాలని ప్రజలు, వివిధ రాజకీయ పార్టీలు ఐక్య ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేయుచున్నాము"

వేరుశనగ చేలకు గొంగళి పురుగు

ఆచంట ప్రాంతంలో పంట విపరీతంగా నష్టమయ్యే ప్రమాదం

వ్యవసాయ శాఖాధికారులు వెంటనే తగు చర్య తీసుకోవాలని విజ్ఞప్తి

చినమల్లం, మార్చి 10

పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంటప్రాంతం చినమల్లం, కొడమంచిలి, తదితర గ్రామాలలో రెండవ పంటగా ఎక్కువమంది రైతాంగం వేరుశనగ వేశారు. విత్తనంకాయ విపరీతమైన రేటుక, బస్తా రు. 53/- వరకు పెట్టికొని ఎకరానికి మూడు బస్తాలవరకు వేశారు. ఇప్పటికే సస్యరక్షణ నిమిత్తం మూడుసార్లు ఎండ్రిన్ చల్లుట జరిగింది.

కాని, వేరుశనగ చేలకు గొంగళిపురుగు విపరీతంగా పట్టింది. పచ్చనిచేలు మోడు క్రింద అయిపోతున్నాయి. పురుగు రెండు అంగుళాలుండి డి. డి. టి. వగైరా కొట్టినా చనిపోవడం లేదు. చేలన్నీ గొంగళి పురుగుతో నిండిపోయి పంట సర్వనాశన మౌతోంది.

రైతాంగం, ప్రయివేటు వడ్డీవ్యాపారస్తుల నుండి విపరీతమైన వడ్డీకు డబ్బు తెచ్చి పెట్టుబడులు పెట్టారు. ఆ పెట్టుబడులు వచ్చే ఆశ ఏమీ కనబడటంలేదు. కౌలుదారులమొదటి పంట కౌళ్ళక్రింద చెల్లించి. రెండవ పంట మీదనైనా ఆధారపడదామని అనుకుంటే అది ఎంతమాత్రం నెరవేరేటట్టులేదు.

నర్సాపురం తాలూకా మూడుటన్నులక్లబ్ అధ్యక్షులు శ్రీ వత్సవాయి సుబ్బరాజు ఈ విషయమై ఒక ప్రకటనచేస్తూ వ్యవసాయశాఖాధికారులు ఈ దిగువ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు:

"గొంగళిపురుగును నిర్మూలించడానికి ఏ మందు వినియోగించాలో. ఆ మందును పవర్ స్ప్రేయరుతో సహా వెంటనే యీ ప్రాంతానికి పంపాలి.

అనుభవం కలిగిన వ్యవసాయ శాఖాధికారులు ఈ ప్రాంతంలో పర్యటించి రైతాంగానికి తగు సహాయం యివ్వాలి.

వేరుశనగ పైరు వేసిన చేలకు ఎకరానికి రు. 50 లు చొప్పున పంచాయతి సమితివారు అప్పుగా యివ్వాలి."

విజయనగరం బిస్కట్, పిప్పరమెంటు వర్కర్సు యూనియన్

విజయనగరం, మార్చి 10

విజయనగరంలో బిస్కట్ అండ్ పిప్పరమెంటు కంపెనీలలో పనిచేసే సుమారు 50 మంది కార్మికులు ఈ నెల 9 వ తేదీన శ్రీ దార రమణగారి అధ్యక్షతను సమావేశమై బిస్కట్ అండ్ పిప్పరమెంటు వర్కర్సు యూనియన్ అనే పేరుతో సంఘాన్ని స్థాపించి యీ దిగువవారిని కార్యవర్గముగా ఏర్పాటు చేయుటమైనది.

అధ్యక్షులు. శ్రీ సి. మృత్యుంజయరావు ఉపాధ్యక్షులు: దార రమణ. కార్యదర్శి: మొదర అప్పారావు. సహాయ కార్యదర్శి: పెంగాడ ఆదినారాయణ. కోశాధికారి: శ్రీ తారిక అప్పన్నగార్లను యింకా 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైనది.

గుంటూరు పట్టణ రిక్షా కార్మిక సంఘ సమావేశం

గుంటూరు మార్చి 10

గుంటూరుపట్టణ రిక్షాడ్రైవర్సు వర్కర్సు యూనియన్ జనరల్ బాడీ. యూనియన్ ఆఫీసులో 10 వ తేదీ శ్రీ కానూర్ల రామచంద్రయ్యగారి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి విజయవాడ పట్టణ రిక్షా డ్రైవరు యూనియన్ కార్యదర్శి శ్రీబెల్లపు శ్రీరాములు, తెనాలి పట్టణ రిక్షా డ్రైవర్సు యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీయుతులు ఈదర సాంబశివరావు, చొప్పలపూడి సాంబశివరావు, పట్టణకార్మికనాయకులు ఐ. యం. లింగం గార్లుహాజరైనారు.రిక్షాడ్రైవర్ల సాధక బాధలు, సంఘ నిర్మాణ ఆవశ్యకత, సంఘ పెద్దలకు కార్యకలాపాలు, సంఘ నిర్వహణలో రిక్షా డ్రైవర్ల కర్తవ్యాలు, అధికారుల చర్యలను గురించి వివరించారు.

తరువాత క్రొత్త రిక్షా లైసెన్సులు, డ్రైవర్సుకు యివ్వాలని, డ్రైవర్సుకు గాకుండా కొంతమంది రిక్షా ఓనర్సుకు యిచ్చిన కొత్త లైసెన్సులు, డి. ఎస్. పి. తమ అనుయాయులకు యిచ్చిన లైసెన్సులు విజయవాడ వాస్తవ్యులు రాష్ట్ర రిక్షా ఓనర్సు అసోసియేషన్ మాజీ అధ్యక్షులు శ్రీకోలాబోయిన చిన్నపిచ్చయ్యగారికి యిచ్చిన 30 కొత్త రిక్షా లైసెన్సులు రద్దుచేయాలని కోరుతూ తీర్మానించారు.

సమ్మె తరువాత చేసుకొన్న ఒప్పందం ప్రకారం రోజుకు రు 2.20 కన్నా ఎక్కువ తీసుకొంటున్న రిక్షా అద్దెలు తగ్గించుకోవాలనీ నిత్యం అనవసర పోలీసు కేసులకు జరిమానాలకు వ్యతిరేకంగా ఆందోళన చేయడానికి ప్రతి ఏడాది డ్రైవర్సుకు లైసెన్సులు యివ్వటంగాకుండా లోగడ లైసెన్సులు వున్నవారికి లైసెన్సులు రెన్యూవలు చేయించుకోవాలనీ, ప్రతి ఏడాది ఫోటోలు తీయించే విధానాన్ని నిరసిస్తూనూ, రిక్షాలకు యిచ్చిన పర్మనెంటు డ్రైవర్సు వుంటేనే రిక్షాలు ఫిటుచేయాలనీ తీర్మానించారు.

ఈ కోర్కెల సాధనకు తగు కార్యక్రమాన్ని జనరల్‌బాడీ రూపొందించింది.

కొరిటెపాడు యువజనసంఘ వైజ్ఞానిక పోటీలదరఖాస్తులు

గుంటూరు, మార్చి 11

గుంటూరు, కొరిటెపాడు యువజన సంఘంవారి నిర్వహించు గుంటూరు జిల్లా వైజ్ఞానిక, పోటీలు ఆటల పోటీలు కొరిటెపాడులో 1966 మార్చి 30, 31: ఏప్రియల్ 1, 2, 3 తేదీలలో జరుగుతాయి. వీటిలో పాల్గొనుటకు 10 వ తేదీ నుండి మార్చి 19 తేదీ వరకు దరఖాస్తులు పంపుకొనుటకు పొడిగించటమైనది. మార్చి 22 తేదీ డ్రా వుంటుంది.

రాజమండ్రిలో

పోలీసువారి మద్దతుతో రైళ్ళలోని సామగ్రి దొంగతనం

గూడ్సుబండినుండి బొగ్గు దొంగతనం గురించిన వార్త తెలియజేసిన వ్యక్తిపై ఆగ్రహంలో అంతర్యం

రాజమండ్రి, మార్చి 12

రైళ్ళనుండి సామగ్రులను దొంగిలించడం ఇక్కడ విరివిగా సాగిపోతోంది. ఇందుకు పోలీసువారి మద్దతు ఉన్నట్లు ఇటీవల జరిగిన ఘటనలు తెలుపుతున్నాయి. గూడ్సుబండినుండి బొగ్గు దొంగతనం గురించి బైటపెట్టిన ఒక వ్యక్తిపై పోలీసువారు మండిపడటంలోని 'అంతరార్థ మిదే'నని తెలుస్తుంది.

రాజమండ్రి అన్నపూర్ణమ్మ రైలుగేటు ప్రాంతంనుండి వీరేశలింగం హైస్కూలు దక్షిణ సరిహద్దు అవతలి ప్రాంతంవరకూ గల రైల్వే లైను మీద - రాజమండ్రి-గోదావరి స్టేషన్లమధ్య ప్రాంతంలో - సంవత్సరాల తరబడిగా రైలు వాగన్లలో నుండి సరుకులు దింపివేయడం జరుగుతోందట, ఓపెన్ వాగన్లలో ఏ సరుకు ల్నీ ఈ ప్రాంతంలో నిర్భయంగా అనధికారదిగుమతి జరుగుతుందని, ఇలాటి అనధికారదిగుమతిలో ఇనప దిమ్మలు, కోక్‌బొగ్గు, ఇనప వూసలు, యాంగ్యులర్లు, టిన్నురేకులు, వగైరా సామగ్రి వుంటోందని, ఇలా దొంగ తనంగా దిగుమతి జరుగుతుండగా ఎవరైనా అదేమని అడిగితే, ప్రాణాలు తీస్తారనే భయంతో పౌరులు మాట్లాడరని తెలుస్తోంది.

గూడ్సుబళ్ళు పై ప్రాంతంలో ఆగివున్నపుడు, అపుడపుడు బండ్లుప్రయాణం చేస్తుండగాను బాహాటమైన దొంగతనాలు జరుగుతాయని కొందరు తెలియచేశారు. పై చెప్పిన ప్రాంతంలోని ఈ దొంగతనాలలో రెండు గ్రూపులు పాల్గొంటున్నాయని, ఒక గ్రూపు ముత్యాలమ్మగుడివద్దగల రైలుకూము ప్రాంతంనుండి రాజమండ్రి స్టేషన్ వరకూ, మరో గ్రూపుపై రైలుకూమునుండి జాంపేట రైలు బ్రిడ్జివరకూ పని చేస్తున్నాయట, ఒక గ్రూపు మరో గ్రూపు సరిహద్దు దాటదని, అలా దాటి వెళ్ళి సరుకు దింపితే పరస్పరం నష్టపరిహారాలు చెల్లించుకుంటారనికూడా తెలిసింది.

దొంగతనం వార్త తెలిపినందుకు పోలీసుల మంట

ఉదాహరణకు 6-3-66 తేదీ ఆదివారం రాత్రి 8½ గంటల మధ్య రాజమండ్రినుండి బెజవాడపోయే గూడ్సుపై ప్రాంతంలో ఆగివుండగా సుమారు రెండు లారీలపైబడిన బొగ్గుదింపివేయడం జరిగింది. ఇలా దింపుతుండగా చూచిన శ్రీ సింహాల అప్పారావు అనే ఆసామిరాజమండ్రి రైల్వే పోలీసు స్టేషనుకు తెలియచేశాడట, ఇంతలోనే వారు ఒక లారీ బొగ్గును తరలించుకుని వెళ్ళినట్లు తెలిసింది. దీనిపై ఇంతవరకూ ఎవరినీ అరెస్టు చేయనట్లుకూడా తెలిసింది. శ్రీ అప్పారావు మిగిలివున్న బొగ్గును కాపలాపెట్టి పై దొంగతనాల విషయంలో గట్టిచర్య తీసుకోవాలని కోరగా పోలీసువారు అప్పారావుపై విరుచుకు పడ్డారనికూడా తెలిసింది,

రాజమండ్రి - గోదావరి స్టేషన్లు రెండింటిలోను రైల్వే పోలీసు స్టేషన్లువుండి, రాజమండ్రి స్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్‌ఫోర్సు కార్యాలయం వుండి కూడా ఈ రకంగా బాహాటంగా రాత్రులు దొంగతనాలు జరగడానికికొందరధికార్ల ప్రోత్సాహంలేకుండా యాదృచ్ఛికంగా జరగడం అసంభవమని తెలిసినవారు కొందరంటున్నారు.

దేశరక్షణ చట్టాన్ని నల్లేరుమీద బండిలా పోనిచ్చి అనేకమంది రాజకీయ వాదుల నరెస్టుచేసిన ప్రభుత్వం ఇలాంటి దొంగల విషయంలో ఎందుకు మాట్లాడదో అర్థం గాదని కూడా అంటున్నారు, రైల్వే వాగన్లలోని సరుకుల దొంగతనాల ఫలితంగా కోట్లాది రూపాయలను ఏటా ప్రభుత్వం నష్టంక్రింద చెల్లిస్తున్న విషయం పాఠకులకు విదితమే. (వి. వి.)

విజయనగరంలో తులం బంగారం రు. 190 వరకు ధర

విజయనగరం, మార్చి 10

విజయనగరంలో గతవారం రోజులలోను బంగారం ధర తులం రు. 190 వరకు బాహాటంగానే అమ్మకం జరిగింది. ఇంత అమ్మకం జరుగుతూవున్నా సెంట్రల్ ఎక్సైజువారు ఏం చేస్తున్నారో తెలియదు,

కూలి డబ్బులకు కక్కుర్తిపడి వస్తువులు తయారుచేసే స్వర్ణకారులపైన మాత్రం కేసులు పెట్టి,జరిమానాలువిధించడం జరుగుతూ వున్నది. (వి. వి.)

విజయవాడ చుట్టల పనివారి సమర్థన

విజయవాడ, మార్చి 14

విజయవాడ చుట్టల పనివారల సంఘ సర్వసభ్య సమావేశం నిన్న శ్రీ ఉప్పలపాటి వెంకటసుబ్బారావు అధ్యక్షతను జరిగింది.

(1) జీవితావసర వస్తువుల ధరలు విపరీతముగా పెరిగి ఉండుటచే కార్మికులకు కూలి పెంచమని యజమానులను కోరగా దానిని యజమానులు సానుభూతితో పరిశీలించికూలిని పెంచినందుకు అభినందన తెలియచేశారు,

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల న్యాయమైన కోర్కెలను బలపరుస్తు మార్చి 28 న ప్రదర్శనలు జరుపుటకు నిర్ణయించారు

టీచర్సు గిల్డు హోమ్‌కు 1001 రూపాయల విరాళం

వీరవల్లి, మార్చి 10

కృష్ణాజిల్లా శ్రీ కాకాని టీచర్సు గిల్డు భవన నిర్మాణానికి వీరవల్లి హైస్కూలు ఉపాధ్యాయ బృందం "పునర్జన్మ" అనే నాటకాన్ని ప్రదర్శించగా వచ్చిన మొత్తం విరాళంగా రు 1001 లను జిల్లాపరిషత్ చైర్మన్ శ్రీ. పిన్నమనేని కోటేశ్వరరావుగారికి తమ పాఠశాల వార్షికోత్సవ సందర్భముగా అందజేశారు.

రాష్ట్ర విద్యామహాసభలపట్ల ఉపాధ్యాయుల ఉత్సాహం

పలుచోట్ల విరాళాల వసూలు

గుంటూరు, మార్చి 10

మేనెలలో గుంటూరులో జరుగనున్న రాష్ట్ర విద్యామహాసభల సందర్భముగా పట్టణం ఉపాధ్యాయుల సమావేశం 8-3-66 సాయంత్రం యల్. యం. పి. స్కూలులో జరిగినది. సభకు జిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ మేడూరి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.

మహాసభల విషయములో ఇంతవరకు జరిగిన కృషిని సిటీ టీచర్స్ గిల్డు కార్యదర్శి శ్రీ పి. జగన్నాథం నివేదించారు. శ్రీయుతులు యస్. అంకమ్మనాయుడు(మునిసిపల్‌చైర్మన్) చావలి సూర్యనారాయణ (మునిసిపల్ కౌన్సిలర్) శ్రీ పి. శ్రీరామమూర్తి యమ్. ఎల్. సి, శ్రీ లక్ష్మయ్య యమ్. ఎల్. సి యం. రామచంద్రరావు అధ్యక్షులు సిటీ టీచర్స్ గిల్డు బి. బుచ్చిరాజు గ్రెజెటెడ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్సు శ్రీ కె. రాఘవాచారి (హెడ్మాష్టర్) శ్రీ యస్ వెంకటేశ్వర శాస్త్రి (హెడ్మాష్టర్) శ్రీ ఎడ్వర్డు థామస్(ఎల్ ఎమ్. సి. స్కూలు) గార్లు సభకు అరుదెంచి మహాసభల విజయాన్ని కాంక్షిస్తూ ప్రసంగించారు. జిల్లా విద్యా శాఖాధికారిణి శ్రీమతి కె. యమ్. సుగుణగారు కూడా హాజరై సభలను జయప్రదం చేయవలసినదిగా ఉపాధ్యాయులను ఉద్బోధించారు.

మహాసభలను జయప్రదం చేయవలసిందిగాను ఉపాధ్యాయులు చందాలు చెల్లించవలసిందిగాను కోరుతూ తీర్మానం చేశారు.

రు. 99 లోపు బేసిక్ పే తీసుకొనువారు 3 రూ: 100 నుండి 149 వరకు 4 రూ. 150 నుండి ఆపైన 5 రూ.

శ్రీ ఎస్. వి. సుందరావు వందన సమర్పణతో సభ సమాప్తమైంది.

గుంటూరు తాలూకా ఉపాధ్యాయుల విరాళం

గుంటూరు, మార్చి 11

ఈ సంవత్సరం మే నెలలో జరుగు ఆంధ్రప్రదేశ్ టీచర్సు యూనియన్ మహాసభల నిర్వహణకై గుంటూరు తాలూకా నుండి రు. 600/- విరాళాలు వసూలు చేయుటకు కోటా తీసికొన్నారు. సన్నాహక సంఘ నిర్ణయం ప్రకారం నూతక్కిజిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాష్టరు శ్రీ టి. జి. సంజీవరావు. డ్రిల్లు మాష్టరు శ్రీ టి. అంజిరెడ్డి. పెనుమాక జిల్లాపరిషత్ హైస్కూలు హెడ్మాష్టరు శ్రీ టి. జోగారావు. హిందీ పండిట్ శ్రీ కె. [illegible] గారలు. గుంటూరు తాలూకాలోనిపెనుమాక, నూతక్కి,మందడం పొన్నెకల్లు, రావెల హైస్కూల్సుకు వెళ్ళి విరాళాలు వసూలు చేశారు. ఆ యా గ్రామాల వాగ్దానం, వసూళ్ళ గురించిన వివరాలు.

(1) పెనుమాక హైస్కూలు వాగ్దానం రు. 150, వసూలు రు 75 లు, (2) తుళ్ళూరు హైస్కూలు రు.170లు.వాగ్దానం. (3)మందడం హైస్కూలువాగ్దానం రు.94వసూలు రు94లు, (4) నూతక్కి హైస్కూలు వాగ్దానం 200-రు. వసూలు 200 లు. (5) రావెల హైస్కూలు వాగ్దానం 121- రు. వసూలు 31 లు, (6) పొన్నెకల్లు హైస్కూలు రు. 116 లు. వాగ్దానం మొత్తం వాగ్దానం రు. 841,వసూలు రు. 330 లు.

పెనుమాక హైస్కూలు శ్రీఉపాధ్యాయులు ఒక బస్తా ఉల్లిపాయలు, రావెల హైస్కూలు ఉపాధ్యాయులు మిరపకాయలు, నూతక్కి ఉపాధ్యాయులు కూరగాయలు మహాసభకు సప్లయి చేస్తామన్నారు. మహాసభను జయప్రదమొనర్చాలనే ఉత్సాహంతో కార్యకర్తలు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.

గుంటూరులో

గుంటూరు, మార్చి 14

మే నెలలో గుంటూరులో జరుగనున్న రాష్ట్ర విద్యా మహాసభలకు ఎస్. కె. బి. ఎం మునిసిపల్ హైస్కూలు, ఆనంద తీర్థ అగ్రహారం ఉపాధ్యాయులు 9 మంది రు. 160 లను భూరి విరాళంగా ప్రకటించారు.

విరాళములు యిచ్చినవారు: శ్రీయుతులు సి. జగన్నాథం రు 25, పి. అన్నపూర్ణ 20, యం. సుజనాదేవి 20, కుమారి వై. వి. హితవచని 20, పి. సత్యనారాయణ 15, ఎ. సత్యవతి 15, ఎన్. సీతారామమ్మ 15, యం. నాగసుబ్బమ్మ 15, వి. ప్రకాశరావు 15 లు,

కురుక్షేత్ర విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ నియామకం

రాష్ట్ర ప్రభుత్వంపై పంజాబ్ విద్యామంత్రి విమర్శ

చండీఘర్, మార్చి 11

కురుక్షేత్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా మధ్యప్రదేశ్‌లోని మాజీ ఐ.ఎ.యస్. ఉద్యోగి శ్రీ బాల్‌చంద్‌ను నియమించడంలో రాష్ట్రప్రభుత్వం పెద్ద పొరపాటు చేసిందని పంజాబ్ విధాన సభలో నిన్న ప్రశ్నోత్తరాల సమయంలో నిన్న రాత్రి విద్యామంత్రి శ్రీప్రబోధ్‌చంద్రఅన్నారు.

అసలు ప్రశ్నకు సమాధానంగా ఆయన. యూనియన్ పబ్లిక్ సర్వీసుకమీషన్ అధ్యక్షుని సిఫార్సుమేరకు 1963 లో బాల్‌చంద్ రిటైర్ అయ్యారని అన్నారు.

మధ్యప్రదేశ్‌లో రాయపూర్ జిల్లా కలెక్టరుగా శ్రీ బాల్‌చంద్ వున్నపుడు ఆయన మీద అనేక ఆరోపణలున్నాయని శ్రీ ప్రబోధ్‌చంద్ర అన్నారు.

ఒంగోలులో చక్కెరకొరత

ఒంగోలు, మార్చి 10

సుమారు 10-15 రోజులనుండి ఒంగోలులో చక్కెర దొరకటంలేదు. ప్రభుత్వం వారు యిచ్చిన చక్కెర కార్డులపై యిచ్చే సొసైటీలలోను దుకాణములలోను చక్కెర కోటాలు రాలేదంటున్నారు. బ్లాకులో అక్కడక్కడ ఎక్కువ ఖరీదు అమ్ముతున్నట్లుగా అనుకుంటున్నారు. (వి. వి.)

రేడియో

మంగళవారం మార్చి 15

శక 1887 ★ ఫాల్గుణ 24

విజయవాడ

357.1 మీ. (840 కిలోసై.)

ఉదయం: 6-30 వందేమాతరం, శుభోదయం, ప్రసార విశేషాలు; 6-40 ఆం. వా; 6-45 భక్తిరంజని; 6-55 సూక్తి ముక్తావళి; 7-00 తె. వా; 7-15 ప్రాంజ; 7-30 సంగీతశిక్షణ; 7-45 వేణువు; 8-00 ఆం. వా; 8-15 హిం. వా; 8-30 బి. రామకృష్ణశాస్త్రి; 9-00 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 1-00 వనితావాణి; 1-30 అం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు; 5-35 లలిత సంగీతం; 6-00 ఆం. వా; 6-05 వాద్య బృందం; 6-15 ప్రాం. వా; 6-25 ప్రస్తుతాంశం; 6-30 హై. రిలే; 7-00 తె. వా; 7-15 దీక్ష; 7-25 ముఖ్య ప్రకటనలు; 7-30 హై. వలె; 7-45 చిత్రతరంగిణి; 8-00 ఉభయకుశలోపరి; 8-15 హిందీలో కార్యక్రమము; 8-30 రేడియో న్యూస్‌రీల్; 8-45 వాద్య సంగీతం; 8-55 ప్రస్తుతాంశం; 9-00 ఆం. వా; 9-15 ఆంగ్లం; 9-30 సంగీత నాటిక; 10-30 ఆం. వా; 10-35 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (ఎ)

405.4 మీ. (740 కిలోసై.)

ఉదయం: 6-30 వందేమాతరం, కార్యక్రమ వివరణ; 6-40 ఆం. వా; 6-45 భక్తిరంజని; 6-55 సూక్తిముక్తావళి; 7-00 తె. వా; 7-15 వి. రిలే; 7-30 డి. శేషగిరిరావు; 7-5 సరోద్; 8-00 ఆం. వా; 8-15 సంకీర్తనం; 8-30 వి. రిలే; 9-00 సమాప్తి.

మధ్యాహ్నం: 12-30 కార్మికులకు; 1-00 వి. రిలే; 1-30 అం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 వాతావరణ సూచన; 2-01 సుగం సంగీత్; 2-10 ఉ. వా; 2-20 సితార్; 2-30 ప్రసార సమాప్తి.

సాయంత్రం: 5-30 స్థానిక ప్రకటనలు. 5-35 వి. రిలే; 6-00 ఆం. వా; 6-05 ప్రాం. వా. - ఉర్దూ: (హైదరాబాద్, కడప లు మాత్రమే) 6-15 ప్రాం. వా; 6-25 ప్రస్తుతాంశం; 6-30 గ్రామస్థుల రేడియోగోష్ఠి; 7-00 తె. వా; 7-15 దీక్ష; 7-30 రేడియో వార్తావాహిని; 7-45 రేడియోకి వ్రాయటం; 7-55 విరామ సంగీతం; 8-00 మీరు కోరిన 8-30 రేడియో న్యూస్‌రీల్; 8-40 డ్రామా; 8-50 ఈరోజు పార్లమెంటులో; 8-55 ప్రస్తుతాంశం; 9-00 అం. వా; 9-15 ఉ. వా; 9-30 వి. రిలే; 10-30 ఆం. వా; 10-35 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - (బి)

కడప

333.3 మీ. (900 కిలో సై.)

విశాఖపట్నం

322.6 మీ. (930 కిలో సై.)

సా॥ 5-30 నుండి రా॥ 9-30 వరకు

89.42 మీ. (3355 కిలో సై.)

[హైదరాబాద్ మాత్రమే]

ఉదయం: 6-30 హై.ఎ.వలె; 7-45 సమాప్తి.

60.12 మీ. (4990 కిలో సై.)

8-00 హై. ఎ. వలె; 9-30 సమాప్తి.

42.02 మీ. (7140 కిలో సై.)

[హైదరాబాద్ మాత్రమే]

మధ్యాహ్నం: 12-30 హై.ఎ.వలె; 2-10 డి. శేషగిరిరావు; 2-30 ప్రసార సమాప్తి.

60.12 మీ. (4990 కిలో సై.)

సాయంత్రం: 5-30 హై. ఎ. వలె; 7-00 తె. వా; 7-15 హై. ఎ. వలె; 8-30 డి. శేషగిరిరావు; 8-50 హై. ఎ.వలె; 9-15 ఆంగ్లం; 9-30 హై. ఎ. వలె; 10-35 వాతావరణ సూచన - నేటి భావన - జన గణ మన - ప్రసార సమాప్తి.

మద్రాసు - (బి)

211.3 మీ. (1420 కిలో సై.)

ఉదయం: 6-00 వందేమాతరం, మంగళగానం: 7-00 తె. వా; (193.5 మీటర్లపై గూడా) 7-15 మెల్లిశై; 7-30 సంగీతామృతం; 8-00 ఆం.వా; 8-15 ప్రసార సమాప్తి.

మధ్యాహ్నం: 12-0 కార్మికులకు; 1-00 పాశ్చాత్య సంగీతం; 1-30 ఆం. వా; 1-40 హిం. వా; 1-50 తె. వా; 2-00 సమాప్తి.

[5-30 నుండి 6-30 వరకు 60.98 మీ.గూడా]

సాయంత్రం: 5-30 పాశ్చాత్య సంగీతం; 6-00 అం.వా; 6-05 ప్రాంతీయ వార్తలు; (193.5 మీటర్లపై గూడా) 6-20 వాతావరణ సూచన; 6-40 పేం; 7-00 తె. వా; (193.5 మీటర్లపై గూడా) 7-15 ప్రజారోగ్య ప్రసంగం (తెలుగు); 7-30 గీతమాలిక; 8-0 చిత్రగానం; 8-30 ఎస్. ఎస్. చిదంబరం; 8-50 ఈరోజు పార్లమెంటులో; 8-55 ప్రస్తుతాంశం; 9-00 అం. వా; 9-15 ఆంగ్లం; 9-30 పాశ్చాత్య సంగీతం; 10-30 అం. వా; 10-35 వాతావరణ సూచన - జన గణ మన - ప్రసార సమాప్తి.

విజ్ఞాన వీధులు

శుక్ర గ్రహాన్ని చేరుటకు మార్గం దొరికింది!

సోవియట్ దేశ పతాకం శుక్రగ్రహానికి అందజేయబడిందని టాస్ వార్తా సంస్థ చేసిన ప్రకటనను అందరూ చదివేవుంటారు. ఇది రోదసీపై మనం ఇంతకుముందు సాధించిన విజయాలన్నిటినీ మించిన విజయం. మానవ నిర్మితమైన ఒక వస్తువు ఒక గ్రహంనుంచి మరొక గ్రహానికి అంద జేయబడింది. చంద్ర మండల పరిశోధనకూడ ఇదే విధంగా ఆరంభమైందనే విషయం జ్ఞాపకం చేసుకోవాలి. ఏడేండ్ల క్రితం ఇలాగే సోవియట్ పతాకం చంద్ర మండలం మీదికి చేరవేయబడింది. ఇప్పుడు "లూనా-9" అనే సోవియట్ ఆటోమేటిక్ రోదసీ నౌక చంద్ర మండలం మీద సురక్షితంగా దిగింది. అంతరిక్షయాన శాస్త్రం అతిత్వరితగతిని అభివృద్ధి చెందుతోంది. ఎన్నేళ్ళకు లోపలనే మరొక ఆటోమేటిక్ అంతర్గ్రహ ప్రయాణ నౌక శుక్రగ్రహం మీద కూడ సురక్షితంగా దిగుతుందని చెప్పవచ్చు.

సమస్యలు

చంద్రమండలంమీద ఆటోమేటిక్ రోదసీ పరిశోధక నౌకను సురక్షితంగా దిగేటట్లు చేయడంకంటె, శుక్రగ్రహం మీద దానిని అలాగే దిగేటట్లు చేయడం చాలా కష్టం. మొదటి విషయం, శుక్రగ్రహంమీద దిగడానికి అనుకూలమైన భౌగోళిక పరిస్థితులు చాలా అరుదుగా సంభవిస్తాయి. శుక్రగ్రహంమీదికి పంపే రోదసీ పరిశోధక నౌక చంద్రమండలంమీదికి పంపబడిన దానికంటె ఎంతో ఎక్కువ వేగంతో ప్రయాణం చేయవలసివుంటుంది. అంటే, ఆ పరిశోధక నౌకను అంతర్గ్రహ విక్షేప మార్గంలో ప్రవేశపెట్టడానికి ఇంకా ఎక్కువ శక్తివంతమైన వాహక రాకెట్ అవసరమౌతుంది. అనౌకను ఆది అంతర్గ్రహ విక్షేపమార్గంలో అతిఖచ్చితంగా ప్రవేశపెట్టాలి. అదేవిధంగా ఆ నౌకయొక్క ప్రయాణమార్గాన్ని సరిదిద్ద దానికికూడ ఇంకా ఎక్కువ ఖచ్చితమైన ఏర్పాట్లు కావాలి - చంద్రమండలాన్ని చేరడానికి కొన్ని రోజులు చాలు. కాని శుక్రగ్రహాన్ని చేరడానికి కొన్నినెలలు పడుతుంది. అంటే, శుక్రగ్రహంమీదికి మనం ఎగురవేసే రోదసీ పరిశోధక నౌకలోని వివిధ సాంకేతిక పరికరాలు, చెడిపోకుండా కొన్నినెలలు సరిగా పనిచేయవలసి వుంటుందన్నమాట. చంద్రమండలంమీదికి వెళ్ళే నౌక కొన్నిలక్షల కిలోమీటర్ల దూరమే ప్రయాణించవలసి వుంటుంది. కాని శుక్రగ్రహంమీదికి వెళ్ళే నౌక కొన్నికోట్ల కిలోమీటర్లదూరంప్రయాణం చేయాలి.

రోదసీ నౌక ఎంత ఎక్కువ దూరం ప్రయాణం చేయవలసి వస్తే, దానితో మనం భూమి మీదినుండి సంబంధాన్ని పెట్టుకోవడం అంత ఎక్కువ కష్టమవుతూ వుంటుంది. చంద్రమండలం మీదికి ఎగిరే రోదసీ నౌక సూర్యునికి చాలా దూరంలో వుంటుంది. శుక్రగ్రహం మీదికి వెళ్ళే నౌక సూర్యునికి దగ్గర అవుతుంది. సూర్యునికి చేరువవు వెళ్ళిన కొలదీ వేడిమి ఎక్కువగా వుంటుంది అందువల్ల నౌకలోని సాంకేతిక సాధనాలను కంట్రోలుచేయడం మరింత కష్టమైపోతుంది.

సోవియట్ యూనియన్ ఎగురవేసిన "వీనస్-2" "వీనస్-3" రోదసీ పరిశోధక నౌకలు ఈ చిక్కులలో చాలావాటిని అధిగమించాయి. భూమికి, శుక్రగ్రహానికి మధ్య నుండే భౌగోళిక పరిస్థితి అనుకూలంగా వుండే సమయంలో అవి సరిగ్గా పంపబడ్డాయి. 1962 లో అమెరికా శుక్రగ్రహం మీదికి ఎగురవేసిన రెండు రోదసీ పరిశోధక నౌకలలోనూ ఒకటి ఇక్కడే పేలిపోయింది. రెండవది మాత్రమే భూగోళపు గురుత్వాకర్షణ మండలాన్ని దాటివెళ్ళింది. 1964 లో అమెరికా అంగారకగ్రహం మీదిని ఎగురవేసిన రెండు రోదసీ నౌకలలోనూ ఒకటి మాత్రమే అనుకున్నవేగాన్ని సాధించగల్గింది. సోవియట్‌యూనియన్‌ఎగురవేసిన రోదసీ పరిశోధక నౌకలు అంతర్గ్రహ విక్షేపమార్గంలో ఖచ్చితంగా ప్రవేశపెట్టబడ్డాయి ప్రత్యేకించి "వీనస్-2" నౌక ప్రయాణమార్గం ఏమాత్రం సరిదిద్ద నవసరంలేకపోయింది. అంతర్గ్రహ ప్రయాణ చరిత్రలో ఇది నిజంగా అపూర్వమైన విషయం.

బోలెడంత సమాచారం తెలిసింది

ఈ రోదసీ పరిశోధక నౌకల ప్రయాణాలలో వాటితో సంబంధాలు తెగిపోకుండా రెగ్యులరుగా కొనసాగింపబడినవి. భూమి మీదనున్న ఒక కేంద్రం, వాటికి ఆజ్ఞలను పంపింది, వాటిలోని పరిశోధక పరికరాలు పంపే సమాచారాన్ని అందుకుంది. ఆ కేంద్రాలలోని ఏర్పాట్లన్నీ ఎలా పని చేస్తున్నాయో తెల్పే "టెలిమెట్రిక్" సమాచారాన్ని కూడ ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుంది. "వీనస్ - 3" అంతరిక్షంలో ప్రయాణం చేసేటప్పుడు సరిగ్గా అనువైన సమయానికి, దాని విక్షేపమార్గం సరిదిద్దబడింది. దీని మూలంగానే అది శుక్రగ్రహాన్ని చేరుకోగలిగింది. దీనినిబట్టి సోవియట్ శాస్త్రజ్ఞుల భౌగోళపు అంచనాలు ఎంత సరి అయినవోచూడ యిట్టే అర్థమవుతుంది. ఆ నౌక శుక్రగ్రహాన్ని చేరుకునే చివరి దశ వరకూ కూడ దానితో సంబంధాలు తెగిపోకుండా కొనసాగింపబడ్డాయి.

"వీనస్-3" ప్రయాణం పూర్తి అయింది. ఆ ప్రయాణంలో మనకు అందిన సమాచారం చాలా వుంది. దాని సంతనీ ప్రాసెస్ చేయడానికి చాలా సమయంపడుతుంది.

అంతరిక్షయాన చరిత్రలో మొట్టమొదటిసారిగా, రెండు అంతర్గ్రహ పరిశోధక నౌకలు ఒకేసారి, ఒకదానికొకటి దగ్గరగా ప్రయాణించడం జరిగింది. ఈ రెండు పరిశోధక కేంద్రాలలోని సాంకేతిక సాధనాలు పంపే సమాచారాన్ని పోల్చిచూడడానికి మొదటిసారిగా మనకు అవకాశం కలిగింది. రోదసీలో మరియొక ప్రయోగం జరపడానికిది పూర్తిగా కొత్త పరిస్థితులను కలుగజేసింది. ఒక పరికరం పంపే సమాచారంమీద మనకు సందేహాలుండవచ్చు. అదే సమాచారాన్ని

యూరీ మారినిన్

రెండు పరికరాలు పంపినప్పుడు, ఆ రెండు సమాచారాలు ఒకలాగే వున్నప్పుడు సందేహాలు కలుగవు.

'వీనస్-2', "వీనస్-3" చేసిన ప్రయాణాలద్వారా మనకు కలిగిన అనుభవాన్ని తక్కువ అంచనా వేయకూడదు. ఈ అనుభవం మనకి బాగా ఉపయోగపడుతుంది. ముందు ముందు శుక్రగ్రహంమీదికి ఎగురవేయబడే ఆటోమేటిక్ రోదసీ కేంద్రాలకది ఎంతో లాభదాయకంగా వుంటుంది. చంద్రమండలంలాగ, అంగారక గ్రహంలాగ కాకుండా శుక్రగ్రహం ఎల్లప్పుడు మేఘావృతమై వుంటుంది. అందుచేత భూగోళం మీదనుంచి దానిని పరిశీలించడం కష్టం.

శుక్రగ్రహానికి మానవుని ప్రయాణం

శుక్రగ్రహంమీదికికూడ పరిశోధక పరికరాలను, టెలివిజన్ కెమేరాలను పంపే రోజు తప్పకుండా వస్తుంది. అగమ్యగోచరమైన శుక్రగ్రహపు ఉపరితలం ఎలా వుంటుందో త్వరలోనే మనకు తెలుస్తుంది. దానిలోని వివిధ ప్రాంతాలకు మన పరిశీలకులు త్వరలోనే పేర్లు పెడతారు. మానవ చోదిత రోదసీనౌక శుక్రగ్రహంమీద దిగే రోజుకూడా వస్తుంది. అక్కడ దిగేవారు, భూమిమీదనుంచి శుక్రగ్రహాన్ని చేరుకున్న తొలి ఆటోమేటిక్ రోదసీ పరిశోధక నౌక సోవియట్ యూనియన్ పంపిన "వీనస్-3" అనీ అది సోవియట్‌దేశ పతాకాన్ని అక్కడ ప్రతిష్ఠించిందని జ్ఞాపకం వుంచుకుంటారు.

మానవాళి పాలిటి దుష్ట శత్రువు గుండె జబ్బు

ఇద్దరు చికిత్సా నిపుణుల పదేళ్ల పరిశీలనలు

బాధ్యతాయుతమైన వృత్తి చేసేవారిలోనూ, పదవులను నిర్వహించే వారిలోనూ గుండెజబ్బు ఎక్కువ కనిపిస్తున్నదని, అటువంటి రోగులు చిన్న వయసులోనే మరణించటం జరుగుతుందని పశ్చిమ జర్మనీకిచెందిన ఇద్దరు చికిత్సా నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లక్ష జనాభాగల ఒక పారిశ్రామిక నగరంలో అన్ని తరగతుల ప్రజలపై పది సంవత్సరాలపాటు పరిశీలనలు జరిపి వారు ఇటీవలే వివరాలు వెల్లడించారు.

గుండె జబ్బులపై లెవర్ కునేన్ లో సంవత్సరాలుగా భారీయెత్తున జరుగుతున్న పరిశీలనలు ఇటీవలే ముగిశాయి. పశ్చిమ జర్మనీలోని ఈ పారిశ్రామిక నగరంలో, మొత్తం జనాభాపై, చికిత్సా నిపుణులైన ప్రొఫెసర్ నాకర్, డా. వైడిమన్ లిద్దరూకలసి, పది సంవత్సరాలపాటు పరిశీలనలుజరిపి,అతితీక్షణమైన యీవ్యాధిచరిత్రను సూక్ష్మమైన అంశాలతో సహా రికార్డుచేశారు.

ఆ వైద్య నిపుణు లిద్దరి కృషి శ్లాఘనీయమైనదనటం అలా ఉంచి వైద్య చరిత్రలో ప్రముఖ ఘట్టం క్రిందే గుర్తించాల్సివుంది. కారణం, వారి పరిశీలనలు, ప్రయోగాలు సంఘంలోని కేవలం ఒకే ఒక వర్గానికిగాని, కొన్ని తరగతుల ప్రజలకుగాని కాదా ఒక ఫ్యాక్టరీకి గాని, లేదా ఫలానా వయసులో వున్నవాళ్ళకనిగాని, లేదా ఫలానా వయసులో వాళ్ళకనిగాని పరిమితమవక ఆ ఆధునిక పారిశ్రామిక నగర జనాభాలోని యావన్మందిపైనా జరుపబడింది, గుండెజబ్బు అనేది ఎందుకు కల్గుతున్నది? ఎటువంటి పరిసరాల్లో ఆ జబ్బు వాటిల్లుతున్నది అనే సమస్యలను

ఉర్స్ ఎఫ్ అల్లెన్

విపులంగా చర్చించి, ఆ వైద్య నిపుణ ద్వయం విశేషా చెన్నిటినో వైద్య శాస్త్రానికి సమకూర్చారు.

ఒక లక్ష జనాభాగల లెవర్ కునేన్ 1963 లో నగరంగా గుర్తింపబడింది. వీరిలో గత పదేళ్ళలోనూ 910 మందికి గుండెజబ్బు ప్రాప్తించటం జరిగింది. పశ్చిమ జర్మనీలోని తదితర ప్రాంతాలలో వలె ఇక్కడూ గుండె జబ్బుతో బాధపడేవారిసంఖ్య ఉన్నట్టుండి పెరిగిపోయింది. 1958 నుండి 1963 వరకూ వివరాలను పరికిస్తే ఈ వ్యాధిగ్రస్తులు ఒకటికి రెండింతలు పెరిగిపోయారని చెప్పక తప్పదు. ఇదే సమయంలో ఈ రోగుల సగటుఆయుఃప్రమాణం గూడా తగ్గిపోయింది.

గత నాలుగు అయిదు సంవత్సరాల్లో, 45 ఏళ్ళ వయసులోపున వున్నవారిలో గుండె జబ్బు అధికమైంది. ద్వితీయ ప్రపంచ సంగ్రామానికి ముందు అదే వయోతరగతికి చెందిన వారిలో ఈ వ్యాధి మచ్చుకైనా కన్పించేది కాదు. అయితే ఇవన్నీ పురుషులను గూర్చిన వివరాలు. స్త్రీ రోగులను పరిశీలిస్తేగూడా 5-10 సంవత్సరాల క్రితం నాటికంటే నేడు ఈ వ్యాధి చాలా అపాయకరమైన స్థితినే తెచ్చిందని చెప్పారు.

1957 లో గుండె జబ్బుతో బాధపడే ప్రతి ఏడుగురులోనూ ఒక స్త్రీ ఉండటంరివాజైంది. 1963 లో ప్రతి ముగ్గురు హృద్రోగ వ్యాధిగ్రస్తుల్లోనూ ఒక స్త్రీ వుండటం విచారకరమే మరి. దీనికి లెవర్ కునేన్ చికిత్సా నిపుణులిచ్చే సమాధానం సమంజసంగానే ఉంది. పశ్చిమ జర్మనీ ఆర్థిక స్థితిగతులవృద్ధ్యా మహిళలు, పూర్వంకంటేనాక ఎక్కువ బరువు బాధ్యతల్ని, ఉన్నతస్థాయి ఉద్యోగాల్ని, సాంఘిక కార్యక్రమాల్ని నిర్వహించవటం తప్పని సరైంది.

ఈ పరిశీలనకోసం జనాభాను మూడు వర్గాలుగా విభజించటం జరిగింది. ఒకటి. అన్ని తరగతుల కార్మికులు, రెండు: అన్ని తరగతుల ప్రభుత్వ ఉద్యోగులు, మూడు: స్వేచ్ఛగా జీవించే వివిధ వృత్తులవారు, పరిశ్రమలకు వాణిజ్య సంస్థలకు చెందిన యజమానులు, తత్ సమానమైన హోదాగలవారు ప్రభుత్వ అత్యున్నత ఉద్యోగులు, పది సంవత్సరాల పరిశీలనలో ప్రతి 1000 మంది కార్మికుల్లో 13 మంది హృద్రోగంతో బాధపడుతున్నారని తేలింది. మధ్యతరగతివారిలో వెయ్యికి 20మందిలో ఈజబ్బు కనిపించింది. ఇక ఎక్కువ బాధ్యతలు నిర్వహించే మూడవ తరగతివారిలో ప్రతి వెయ్యిమందికో 45 మంది తీవ్రమైన గుండెజబ్బుతో బాధపడుతున్నారు. వృత్తిలో, ఉద్యోగంలో మిక్కిలి బాధ్యతాయుతమయిన స్థానాల్ని నిర్వహించేవారు గుండెజబ్బులవల్ల చిన్న వయస్సులోనే మరణించటం జరుగుతుందని ఈ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

వీరవల్లి హైస్కూలు వార్షికోత్సవం

వీరవల్లి, మార్చి 10

కృష్ణజిల్లా పరిషత్ వీరవల్లి ఉన్నత పాఠశాల వార్షికోత్సవం జిల్లాపరిషత్ ఛైర్మన్ శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు గారధ్యక్షతను మార్చి10న జరిగినది. ప్రధానోపాధ్యాయులు శ్రీ బి. జాన్‌కోటయ్యగారు పాఠశాల వార్షిక నివేదికను సమర్పించారు. పాఠశాల టీచరు శ్రీ గద్దె నాగభూషణంగారు స్వాగత పత్రము చదివారు. "తెలుగు విద్యార్థి" ఎడిటర్ శ్రీ కొల్లూరి కోటేశ్వరరావు, విజయవాడ మాంటిసోరిస్కూలు ప్రిన్సిపాల్ శ్రీమతి కోటేశ్వరమ్మ, శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావుగార్లు ఉపాధ్యాయులు - విద్యార్థులు - తల్లిదండ్రుల బాధ్యతలను క్రమశిక్షణను గురించి ప్రసంగించారు. ఆటల పోటీలలో గెలుపొందిన వారికి శ్రీమతి వి. కోటేశ్వరమ్మగారు బహుమతి ప్రదానము చేశారు. భవననిర్మాణ ముఖ్యదాతలైన శ్రీ యనమల సుబ్బయ్య. సీతమ్మగార్లు అతిథులకు విందు ఏర్పాట్లు చేశారు. అనంతరం ఉపాధ్యాయులచే "ఏకాభిప్రాయం", విద్యార్థులచే "దేశంకోసం" నాటికలు, బాలికలచే నృత్యప్రదర్శనలు జరిగాయి.

శ్రీ పట్టపు దశరథరామయ్యగారు వందన సమర్పణ చేశారు.

గారపాడు పాఠశాల వార్షికోత్సవం

గారపాడు, మార్చి 10

గారపాడు పాఠశాల 4 వ వార్షికోత్సవం మార్చి 5 న శనివారం జరిగింది. ఉదయం 7 గంటలకు జాతీయ జండాను పత్తిపాడు సమితి ప్రెసిడెంటు శ్రీ గుంటుపల్లి సూర్యనారాయణ ఎగురవేసినారు. సాయంత్రం 7 గంటలకు బహిరంగసభ జరిగింది. సభ జిల్లా పరిషత్ ఛైర్మన్ మేడూరి నాగేశ్వరరావు అధ్యక్షతను జరిగింది, స్కూలు విద్యార్థుల రక్షణనిధికి 104-35నయాపైసలు రక్షణనిధికి సమర్పించినారు. ఆటలపోటీలలోగెలిచినవారికి గుంటుపల్లి సూర్యనారాయణగారు బహుమతులను పంచిపెట్టినారు.

మాధవరంలో రాత్రి పాఠశాల

ఖమ్మం, మార్చి 11

ఖమ్మంజిల్లా, ఇల్లెందు తాలూకా మాధవరం గ్రామ కమ్యూనిస్టుపార్టీ శాఖ సమావేశం ఇటీవల శ్రీ రాయపాటి గోపయ్యగారి అధ్యక్షతన జరిగింది. ఇల్లెందు తాలూకా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి వర సభ్యులు శ్రీ కన్నెర వేదాద్రిగారు సమావేశమునకు హాజరైనారు.

వారానికొకసారి శాఖ సమావేశము జరపుటకు, యువజన సంఘాన్ని పునరుద్ధరించుటకు నిర్ణయింపబడింది. రాత్రి పాఠశాలను వెంటనే నడుపుటకు తీర్మానింపబడియునది. (వి. వి.)

బెల్లంపల్లి బొగ్గు కార్మికులపై

ఐ. ఎన్. టి. యు. సి.కి చెందినరఘురాములు ముఠా దౌర్జన్యాలు

ఒక వ్యక్తి కనబడకుండా పోయిన స్థితి; దౌర్జన్యకారులపట్ల పోలీసువారి మౌనం

బెల్లంపల్లి, మార్చి 11

ఐ. యన్. టి. యు. సి నాయకుడుగా చలామణి అవుతున్న,ఆంధ్రప్రదేశ్ కాలరీ మజ్దూర్ సంఘ్ కార్యదర్శి ఆయూరి రఘురాములు మార్చి 1 వ తేదీన సుమారు 80 మందిగల తన గూండా ముఠాతోవెళ్ళి రామకృష్ణాపురము గని కార్మికుల ఇండ్లపై దాడిచేశారు.

కొత్తగూడెంనుండి రామకృష్ణాపురము గనులకు బదిలీ చేయబడిన కార్మికులకు ఆశ్రయమిచ్చినందుకు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కార్యకర్తయగు శ్రీ దొబ్బల రాజయ్యను అమానుషంగా కొట్టారు. అతను మూర్ఛబోయి క్రింద పడిపోయాక నోటినిండా మన్నుపోసి అతనివద్దవున్న రూ. 25 లు దొంగిలించారు. ఇంటిలోని సామానంతా విరగగొట్టారు. కొత్తగూడెంనుండి వచ్చిన కార్మికులు వంట చేసుకుని తింటుండగా వారిని చుట్టుముట్టి వారివద్దవున్న సుమారు రు. 250 లు లాగుకున్నారు. వారి వంట సామగ్రినంతా నేలపాలుచేశారు. కర్రలతో, ఇనుప సలాకలతో విపరీతంగా కొట్టుచూ, కొత్తగూడెం వెళ్ళి పోండి లేకుంటే చంపుతామంటూ, మంచిర్యాల రైల్వేస్టేషన్ వరకు తరుముకుంటూ వెళ్ళారు.

కార్మికులు రైల్వేస్టేషనులో తల దాచుకున్నందున గూండాలు స్టేషనుపైకూడ దాడి చేయ పూనుకున్నారు.

రైల్వేస్టేషన్‌పై దాడి జరపడానికి కూడా తయారీ

కాని స్టేషన్‌మాస్టర్ ప్రమాదాన్ని గుర్తించి తన సిబ్బంది సహాయముతో స్టేషన్‌లో గూండాలు దూరకుండా, నిరోధించి కార్మికులను కాపాడి వెంటనే గనుల ఏజంటుకు కబురు పంపారు. తదుపరి ఆ కార్మికులు పోలీసు రక్షణలో వుంచబడ్డారు.

గూండాల హింసాచర్యలకుగురియై గాయపడినవారు శ్రీయుతులు బెల్ల ఆశీర్వాదము, కొల్లాబత్తుల బాబురావు, ఎన్. రామచంద్రర్, రాయడి వల్లంశెట్టి. మరియు చిల్కపాటి రామారావుగార్లు. ఇదేమి అన్యాయమని గూండాలను అడిగినందుకు శ్రీ మేడమల దేవదానుపై చిత్రహింస జరిపి అడవిలోకి తీసికెళ్ళారు, అతడు ఏమైందీ యింతవరకు తెలియలేదు. అతనిపెట్టె గుడ్డలు మాత్రము అడవిలో పోలీసువారికి దొరికినవి,

దీనివల్ల ప్రజలు భయాందోళన చెందుచున్నారు. చాలామంది కార్మికులు పనులకు వెళ్ళడం లేదు.

ఈ గూండాలు గత ఆరు మాసాలనుండి రామకృష్ణా పురములో మందమర్రిలో యథేచ్ఛగా అనేక హింసా చర్యలు సాగిస్తున్నారు ప్రజలపై దాడిచేయడం. బలవంతంగా డబ్బు లాగుకోవడం స్త్రీలను అవమాన పర్చటం. ఇండ్లు తగుల బెట్టడం వగైరా జరుపుతున్నారు. ఇదంతా ఐ. యన్. టి. యు. సి. పేరుతో జరుగుతూంది.

గూండాలపట్ల పోలీసుల మౌనం

రాష్ట్రమంత్రులు. కేంద్ర హోంమంత్రి తమ వారనీ, తమను ఎవరేమీ చేయలేరనీ గూండాలు బాహాటంగా చెప్పుకుంటున్నారు. ఏకారణంచేతనైతేనేమి స్థానిక పోలీసు అధికారులు ఈ గూండాలపై గట్టిచర్యలు తీసుకోలేదు. వారిని యథేచ్ఛగా వదిలినందున నేడు ఈ దారుణ హత్యాకాండకు పూనుకున్నారు. కార్మికులను పనులకు వెళ్ళవద్దని, ఇండ్లలో నుండి వెలికి రావద్దని బెదిరిస్తున్నారు. ఇండ్లపై రాళ్ళువిసురుతున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసు అధికారులు నేటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదు.

జాడ తెలియని కార్మికుని గతి ఏమైనట్లు? పోలీసు అధికారులు గూండాలపట్ల ఎందుకు ఉపేక్ష వహిస్తున్నారు? అని ప్రజలు నానా విధాల ఊహలు అనుమానాలను వ్యక్త పరుస్తున్నారు. అన్నివర్గాల ప్రజలు, కాంగ్రెసులోని నిజాయితీపరులు, ఐ. యన్. టి. యు. సి లోని అనేకులు ఈగూండాల అమానుష చర్యలను అసహ్యించుకుంటున్నారు,

ప్రభుత్వ రంగంలోని కీలకమైనట్టి ఈ గనుల పరిశ్రమలో శాంతి, భద్రతలు కొన్నమైతే, ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ లేకుంటే పరిస్థితి ఎంత విషమిస్తుందో ప్రభుత్వమే యోచించాలి.

ఆయూరి రఘురాములు మరావారి ఈ అరాచక. హింసాత్మక చర్యలను తీవ్రంగా ఖండిస్తూ, వారిపై తగిన గట్టిచర్యలు సత్వరమే తీసుకొని పరిశ్రమలో శాంతిభద్రతల గ్యారంటీ, కార్మికులకు రక్షణ గ్యారంటీ కల్పించాలని. ప్రభుత్వమును వారికి. పోలీసు అధికారులకు విజ్ఞప్తి చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి బ్రాంచి ప్రధాన కార్యదర్శి శ్రీ జె. సహూర స్వామిగారు ఒకప్రకటన చేశారు.

గుడివాడ బార్ అసోసియేషన్

గుడివాడ, మార్చి 10

గుడివాడ న్యాయవాద సంఘానికి అధ్యక్షులుగా శ్రీ ఉప్పలపాటి వీరభద్రరావు, కార్యదర్శిగా శ్రీ తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులుగా శ్రీ తుమ్మలపల్లి రాజగోపాలరావు శ్రీ దుగ్గిరాల బుధాప్రసాద్ శ్రీ తాడంకి వెంకట పురుషోత్తమరావుగార్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



లేఖలు

1967 మునిసిపల్ ఎన్నికలకు 1965 నాటి నామినేషనులా!

మహాశయా,

ఆంధ్రప్రదేశ్‌లోని మునిసిపాలిటీలకు పోటీ చేయదలచుకున్న వారంతా 1965 సెప్టెంబరులో నామినేషన్లు వేశారు. ఇంతలో భారతదేశంపై పాకిస్తాన్ దాడిచేసింది. యుద్ధం ప్రారంభమైంది. మునిసిపల్ ఎన్నికలు వాయిదావేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. నామినేషన్లు వేసినవారంతా తాము డిపాజిటు చేసిన డబ్బు వాపసు చేయవలసిందిగా ఆ యా మునిసిపాలిటీ అధికారులను కోరారు. ఆయా అధికార్లు ప్రభుత్వానికి వ్రాశారు. మునిసిపల్ ఎన్నికలు వాయిదా పడినవేగాని రద్దుకాలేదుకదా, కాబట్టి డబ్బు వాపసు చేయడానికి అవకాశం లేదన్నది ప్రభుత్వం. ఇంతవరకు డిపాజిట్‌డబ్బు ఎవ్వరికీ యివ్వలేదు. మునిసిపల్‌ఎన్నికలు 1967 అక్టోబరులో మాత్రమే జరుగుతాయని ప్రభుత్వం విస్పష్టంగా ప్రకటించింది, కాని ఈ డబ్బు సంగతిమాత్రం ఏమీ తెలియదు. ఒకవేళ ఇదే నామినేషన్లతో 1967 లో ఎన్నికలు జరుపుతారా? అదే గనుక నిజమయితే 1965 సెప్టెంబరులో వేసిన నామినేషన్లతో 1967 అక్టోబరులో ఎన్నికలు జరుపుతారా? ఇది యెలా చెల్లుతుంది? రెండు సంవత్సరాల పిమ్మట ఆనాడు పోటీచేయ దలచుకున్న వారిని యే చట్టం ప్రకారం ఆపగల్గుతుంది. ఈ ప్రభుత్వం 1965 సెప్టెంబరులో నామినేషనులు వేసినా 1967 అక్టోబరులో ఆనాటి పరిస్థితులననుసరించి పోటీనుండి విరమించవలసివున్న అభ్యర్థులను, కాదు మీరు పోటీ చేసి తీరవలసిందేనని యేచట్టంప్రకారం నిర్బంధించగల్గుతుంది ప్రభుత్వం? ఈ రెండేండ్లలోనూ వయోజనులయ్యేవారినిఓటర్ల జాబితాలో చేర్చకుండానూ, లేదా అర్హత కోల్పోయిన వారిని ఓటర్ల జాబితానుండి తొలగించకుండానూ యేచట్టాన్ననుసరించి ప్రభుత్వం అడ్డగింపగల్గుతుంది? కాబట్టి ఓటర్ల జాబితాకు 1967 అక్టోబరులో సవరణలు అనివార్యం అని స్పష్టంగా తెలియుచుండగా 1965 సెప్టెంబరులో వేసిన నామినేషన్లపై 1967 అక్టోబరులో ఎన్నికలు జరపడం యెక్కడయినా వూహించే పనేనా? ఇన్ని అవకతవకలు పెట్టుకుని 1965 లో నామినేషన్లు వేసినవారి డిపాజిటు డబ్బు యివ్వకుండా ప్రభుత్వ ఖజానాలో వుంచుకోవడం యెలా చెల్లుతుంది. ఈ డబ్బుకు ప్రభుత్వం వడ్డీచెల్లించుతుందా?

ప్రభుత్వం తమ నిర్ణయాన్ని పునరాలోచించి ఎవరి డబ్బు వారికి వెంటనే వాపసు చేయించాలని కోరుతున్నాను. ఇట్లు

పసుమర్తి రామకోటయ్య, నెల్లూరు

పంచాయతీ "నిర్వహణ సమితుల" ఏర్పాటు

మహాశయా,

1964 ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీల చట్టములోని 40 వ సెక్షన్ ప్రకారము, ప్రతి గ్రామపంచాయతీ, వ్యవసాయమునకు. ప్రజారోగ్యమునకు, పారిశుధ్యము, కమ్యూనికేషన్లకు "నిర్వహణ సమితి" లేర్పాటు చేయవలసి యున్నది.

కొన్ని పంచాయతీలలో నిర్వహణ సమితి లేర్పాటకపోవుట, దానిమీద అధికార్లేమీ ఒత్తిడి చేయకపోవుట అత్యంత శోచనీయము. కొన్ని పంచాయతీలలో నిర్వహణ సమితు లేర్పడి యించుమించు రెండు సంవత్సరములగుచున్నను అవి నామమాత్రముగానే ఉండి కనీసం ఒక్కసారి రీమైనా సమావేశము ప్రజా సమస్యలు సర్పంచులు జరుపకుండుట మిక్కిలి విచారకరము. పర్పించ్‌ల యొక్క విధి నిర్వహణంలో లోపమున వచ్చును. ఇట్టివి ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యమును తగవు కావున అధికారులు సర్పంచ్‌లు "నిర్వహణ సమితులు" చట్టములో ఏల నిర్దేశించిరో, ప్రాముఖ్యము గ్రహించి, సదరు సమితులను తరచు సమావేశ పరచుచు సమితుల సలహా సంప్రదింపులతో పరిపాలన సాగించవలసినదిగా కోరుచున్నాను.

ఇట్లు,

నండూరి సూర్యవెంకటరత్నం
కొత్తపేట పంచాయతీ సభ్యురాలు
కొత్తపేట, తూ॥ గో॥ జిల్లా

పిండి మిషన్లవారి అక్రమాలు

మహాశయా,

కడపజిల్లా ప్రొద్దుటూరు సుమారు 60 వేల జనాభాగల పట్టణము. ఈ పట్టణంలో సుమారు 25 పిండి మిషనుల వరకు యున్నవి. ఈ పిండి మిషనులవలన ప్రజానీకానికి సౌకర్యములు కలుగుట మాని అన్యాయములు జరుగుచున్నవి. వీనిలో కొన్నిటిని ఈ క్రింద వివరింపదలచినది;

ఇంతకు మునుపు సాధారణపు పడి గింజలకు (రాగులు, జొన్నలు, సజ్జలు వగైరా) 5 పైసల వంతునను గోధుమ, బియ్యము వీటికి 8 పైసల వంతునను తీసుకొనుచుండిరి. ఇప్పుడు గింజల ధరలు ఎక్కువైనందున సాధారణ గింజలకు 8 పైసలు - గోధుమ, బియ్యము వీటికి 10 పైసల వంతున తీసుకొనుచున్నారు. అదీకాక పిండిని అంతయును ఇచ్చుటలేదు. మామూలుగా ఒకపడి గింజలకు ఒకటిన్నర పడి పిండియగును. కానీ - ఒకటింబావు లేక అంతకు తక్కువగాపిండిని ఇచ్చుచున్నారు. ఈ విధముగా మిగిలిన పిండిని బజారులో అమ్ముట పరిపాటియైనది, అడుగువారు ఎవరూలేనందున ఈ అన్యాయములుఇంకను ప్రబలి పోవుచున్నవి. చల్ల విషయములో కూడ బస్తాకు 1½ పడి లేక 2 పళ్ళ వరకు బియ్యమును రహస్యముగా లాగుచున్నారు. దీనివలన ప్రజానీకానికి ముఖ్యముగా బీదప్రజలకు ఎంతో అన్యాయము కలుగుచున్నవి. పై అధికారులెవ్వరూ దీనిని గమనించనందున రోజురోజుకు ఈ అన్యాయములు మితిమీరిపోవుచున్నవి. తిండిగింజలకు కొరవైన ఈ అత్యవసర పరిస్థితులలో ఇటువంటి అన్యాయములు జరుగుటవలన బీద ప్రజానీకము ఎన్నియో కష్టములను ఎదుర్కొనవలసి వచ్చుచున్నది. కావున జిల్లా కలెక్టరు తగుచర్య తీసుకొనవ ప్రార్థన.

ఇట్లు

సలహాసనపడి సుబ్బయ్య.
ప్రజాహక్కుల సంరక్షణసంఘ కార్యదర్శి,
ప్రొద్దుటూరు.

తనదికాని స్థలంనుండి అద్దె పొందుతున్న టీచర్

మహాశయా,

కృష్ణాజిల్లా మైలవరం పంచాయతీ సమితిలోని పోలుకొండ, పంచాయతీసమితి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీ వి. గోపిరెడ్డి ఆ స్కూలు మేనేజరుగా ఉన్నప్పుడు పాఠశాల కొరకు గ్రామస్థులచే కొనబడి, పాఠశాల కొరకు వినియోగింపబడుచున్న మాత్రమే ఇచ్చిన పాఠశాల భవనముచ్చు స్థలము తనదని మోసగించి ప్రభుత్వము నుండి గత 7 సంవత్సరాలుగా అద్దెను పొందుచున్నాడు. దానిపై అతనికెట్టి హక్కుకూడ లేదు. అది గ్రామస్థులచే కొని స్కూలు ఉపయోగార్థం నాటబడి క్రింద ఇవ్వబడినది. ప్రభుత్వమునకు ఉచితంగ ఇచ్చుటకు సిద్ధముగానున్న దానిని మాగా తెలియకుండా ప్రభుత్వమును మోసంచేస్తూ అద్దె అపహరించుటను ఆపి ఇప్పటికి మోసగించి పొందిన సైరం అతనినుండి రాబట్టవలెనని మైలవరం సమితి బి. డి. ఓ. కు 6 మాసముల క్రితమూ కృష్ణాజిల్లాకలెక్టరుకు 3 మాసముల క్రితమూ లబ్జుకు వ్రాసియున్నా

[illegible]

రాజమండ్రి జైలుసూపర్నెంట్ నిరంకుశ పరిపాలన

రాజమండ్రి, మార్చి 12

రాజమండ్రి సెంట్రల్ జైలుకు యిటీవల కొత్తగా వచ్చిన సూపరింటెండెంటు అధికార నిరంకుశత్వంవల్ల వార్డరు, కాన్విక్టువార్డర్లు, ఖైదీలు ఇంతకు ముందుకన్నా ఎక్కువ కష్టనష్టాలకు గురిఅవుతున్నారని తెలుస్తోంది. జైలు ప్రధానాధికారిగా ఖైదీల మంచిచెడ్డల్ని మానవతాదృష్టితో పరిశీలించ వల్సిందిపోయి, అధికార దర్పానికే విలువ యిస్తున్నట్లు తెలుస్తోంది.

చివరకు వార్డెన్లనూ, కాన్విక్టు వార్డర్లనూ కూడా అనేక యిబ్బందులకు గురి చేస్తున్నారనీ, ఈ విషయంలో సూపరింటెండెంటు క్రింది అధికారులను సహితం చులకనగా చూస్తున్నారని తెలుస్తోంది. ఈ పనిలో తనకు చేదోడు వాదోడుగా శ్రీ గౌడవలయ్య అనే ఒక అధికారిని వాడుకుంటున్నట్లు కూడా తెలుస్తోంది.

జైలు ప్రధానాధికారిగా జైలు వ్యవహారాలను సామరస్యంతో పరిష్కరించలేక, అతి స్వల్ప విషయాల్లో కూడా దురుసుగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. నియమిత సంఖ్య కంటె ఎక్కువ మంది వార్డర్లను స్వంతపనులకు వినియోగించు కొంటున్నట్లు అలాగే ఖైదీలచే యింటివద్ద చాకిరీ చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

ఈమధ్య ఒకసారి జైలు ఆవరణలో బీడీముక్క పడివుందని చెప్పి ఒక వార్డరుకు రు. 5 జరిమానా విధించారని, అసలు రాలాయని చెప్పి మరొక వార్డరుకు రు. 5 లు జుల్మానా విధించారని తెలుస్తుంది. ఖైదీలకి చెస్‌లో కాల్చిన బీడీ ఒకటి దొరికిందన్న మిషతో ఒక వార్డరుకు ఎక్స్ట్రాడ్యూటీ వేయించారని తెలుస్తోంది. [illegible] నారని చెప్పి ఇదివరకే వార్డరుకు ఒక వారం రోజు ఎక్స్ట్రాడ్యూటీ పనిష్మెంటుగా వేయించారని తెలుస్తోంది.

రికార్డుల్లో నౌకరీచేసేది ముగ్గురు; ఆచరణలో 19

మామూలుగా జైలు సూపరింటెండెంటుకు తన యింటివద్ద [illegible] ఖైదీలను [illegible] వార్డర్లను [illegible]

వార్డన్ లకుకూడా తప్పని 'ఖాంఛోత్'

సూపరింటెండెంటు బంగళా కూరగాయల రోజుకు 40 బిందెలు పోయాలని. కాని 7 బండ్ల నీళ్ళు [illegible] వస్తోందని [illegible]

(1) వారానికి ఒకసారి 'అప్పాయింట్మెంటు' [illegible] (2) [illegible] (3) [illegible] (4) [illegible] (5) వార్డర్లు [illegible] (6) నాల్గవ [illegible]

ఈ [illegible] తక్షణం [illegible] సూపరింటెండెంటు [illegible] అరికట్టాలని [illegible]

రిమైండర్ [illegible] తీసికొని [illegible] సొమ్ము [illegible] పట్టింపు [illegible] ఇప్పటికైనా [illegible]

బెంగాల్ అసెంబ్లీ సరిగా పని చేయడం లేదని నందా ఒప్పుకోలు

ప్రజల అసమ్మతి ప్రదర్శనకు పూర్తి అవకాశం యివ్వాలని హితవు

కలకత్తా, మార్చి 12

బెంగాల్ రాష్ట్ర శాసనసభ తన విధులను సక్రమంగా నిర్వహించడంలేదని హోం మంత్రి శ్రీ నందా నేడిక్కడ అంగీకరించారు.

మృతవీరుల దినోత్సవాన్ని జరపవద్దని శ్రీ నందా వామపక్ష ఐక్యసంఘటనను కోరారు. అయినప్పటికీ రేపు రాష్ట్రవ్యాపితంగా మృతవీరుల దినోత్సవం జరపడానికే ఐక్యసంఘటన నిశ్చయించుకొన్నది.

బెంగాల్ ఐక్యతనూ కృతనిశ్చయాన్ని బెంగాల్ ప్రజాకోర్కెలను ప్రదర్శించడానికి తమ ఆత్మబలిదానం చేసిన మృతవీరుల సంస్మరణార్థం రాష్ట్రవ్యాపితంగా మౌనప్రదర్శనలు జరుగుతాయని తొమ్మిదిపార్టీల వామపక్ష ఐక్యసంఘటన నేడు పత్రికా ప్రకటన చేసింది.

సెంట్రల్ కలకత్తాలోని రాజాసుబోద్‌మల్లిక్ చౌకిలో మృత వీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి ఘటించిన పిమ్మట మౌన ప్రదర్శన జరుగుతుంది.

భూపేష్ ప్రభృతుల ప్రకటన

కేంద్ర హోం మంత్రి శ్రీ నందాతోనూ, ఆహార మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యంతోనూ సంభాషణల అనంతరం ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు శ్రీయుతులు యస్. ఏ. చటర్జీ, భూపేష్‌గుప్తా, త్రిదీప్‌చౌదరీ, ద్విజేంద్రలాల్ సేన్ గుప్తాలు, నేటి రాత్రి ఒక ప్రకటనచేస్తూ తాము నేటి సాయంత్రం ఇద్దరు కేంద్ర మంత్రులతోనూ గంటన్నర పాటు నిర్మొహమాటంగా చర్చలు జరిపామని తెలిపారు. తాము వామపక్ష ఐక్య సంఘటన, ఫార్వర్డు బ్లాక్, పి. యస్. పి లు కోరుతున్న ప్రధాన కోర్కెలను వారి దృష్టికి తెచ్చామని పేర్కొన్నారు. పరిస్థితిపట్ల శ్రీయుతులు నందా, సుబ్రహ్మణ్యం తమ ఆందోళనను వ్యక్తపరిచారని. ప్రతిష్టంభనను తక్షణమే తొలగించడానికి కొన్ని చర్యలు తీసుకోబడతాయని చెప్పారన్నారు. పరిస్థితిని మామూలుస్థాయికి తీసుకురావడానికి తాము క్రింది చర్యలు సూచించామని తెలిపారు.

1. ఆహార ఆందోళన సందర్భంలోనూ, రక్షణ చట్టం క్రింద నిర్బంధించిన వారినందరినీ విడుదలచేయాలి.

2. పోలీసు సైన్యం కాల్పులపై హైకోర్టు న్యాయమూర్తులచేత తక్షణమే న్యాయ విచారణ జరిపించాలి.

3. అన్ని ప్రాంతాలకు చాలినంతగా ఆహార సరఫరాలను, కిరోసిన్ సరఫరాను చేయాలి.

4. రాష్ట్రంలో పోలీసు, సైనిక అత్యాచారాలను తక్షణమే నిలిపివేయించాలి.

అరెస్టయిన నాయకుల విడుదల జరిగిన వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రికీ, ప్రతిపక్ష సంప్రతింపులు జరిగేలా చూడాలి. శాసనసభ కార్యకలాపాలు పునరుద్ధరించబడేటందుకూ, అతి విషమంగా పరిణమించిన ఆహార సంక్షోభం పరిష్కారానికి అంగీకృత ఏర్పాట్లు జరిగేటందుకు ఇది అవసరమని తాము కేంద్రమంత్రులకు సూచించామని వారు చెప్పారు. వివిధ అతివాదపార్టీలకు చెందిన కార్యకర్తలపైవున్న అరెస్టు వారంట్లను రద్దు చేయాలనీ, పోలీసు కాల్పుల్లో మరణించిన వారి శవాలను, వారి బంధువులకు అప్పగించాలని, దహన సంస్కారాల సందర్భంలో జరిగే వూరేగింపులను ప్రభుత్వం అడ్డగించరాదని వారు కోరారు.

మృతవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా తలపెట్టిన మౌన ప్రదర్శనలకు ఎలాంటి అడ్డంకి కల్పించరాదనిగూడా వారు శ్రీ నందాను, ఆహారమంత్రిని కోరారు.

ప్రజలకు విజ్ఞప్తి

పోలీసు, సైన్యం అత్యాచారాలకు గురైన వారికీ, మృతుల కుటుంబాలకు ప్రతిపక్ష నాయకులు తమ సంతాప సానుభూతులు తెలియచేస్తూ, ఆహార ఆందోళనను ప్రశాంతంగా కొనసాగించాలని విజ్ఞప్తిచేశారు.

బెంగాల్ శాసనసభ సక్రమంగా పనిచేయడం లేదని నందా ఒప్పుకోలు

ప్రతిపక్ష బెంచీలన్నీ ఖాళీగా ఉండడం ద్వారా బెంగాల్ శాసన సభ సక్రమంగా పని చేయడం లేదని కేంద్ర హోంమంత్రి శ్రీ నందా నేడు అంగీకరించారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అసంతృప్తిని కష్ట నిష్ఠూరాలనూ. అసమ్మతినీ సాధ్యమైన అన్ని రీతుల్లోనూ, ప్రదర్శనరూపంలోగానివ్వండి, ఊరేగింపుల రూపంలో గానివ్వండి లేదా హర్తాల్ రూపంలో గానివ్వండి ప్రదర్శించడానికి సంపూర్ణమైన అవకాశం వుండాలన్నారు. దానికి ఎవరూ చివరకూ రాష్ట్ర ప్రభుత్వం సైతం అడ్డు చెప్పరాదన్నారు.

రాష్ట్ర పరిస్థితిని మామూలు స్థాయికి తీసుకరావడానికి తాను స్వయంగా చేయగలిగినదంతా చేస్తానని బెంగాల్ ప్రజానీకానికి శ్రీ నందా హామీ యిచ్చారు.

శ్రీ నందా నేటిరాత్రి ఇక్కడ ఒకపత్రికా విలేకరులసమావేశంలో ప్రసంగిస్తూ నిషేధాజ్ఞలను ధిక్కరించి మృతవీరుల దినోత్సవాన్ని జరపవద్దని వామపక్ష ఐక్య సంఘటనకువిజ్ఞప్తి చేశారు.

తాను రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెసు నాయకులు, కొంతమంది ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు, వార్తా పత్రికల సంపాదకులు. యూనివర్సిటీ ఉపాధ్యక్షులతో విస్తృతమైన సంభాషణలు జరిపామన్నారు.

ఈ పత్రికా సమావేశానికి బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ సేన్, కేంద్ర ఆహార మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం సైతం హాజరైనారు.

రాష్ట్రంలో మామూలు పరిస్థితి నెలకొల్పేందుకు ఏ చర్యలు తీసుకోవాలనుకున్నారు? అని పాత్రికేయులు అడిగినప్రశ్నకు శ్రీనందా సమాధానమిస్తూ తన పథకాలను వెల్లడించడానికి రేపటివరకు సమయం కావాలన్నారు. ముందు రాష్ట్ర శాసనసభ శాంతియుతంగా కార్యకలాపాలను సాగించడానికి అవసరమైన పరిస్థితులను కనుగొనాలన్నారు.

“ఏమి జరిగింది? దీనికి బాధ్యు లెవరూ అనే విషయాల్లోకి నేను వెళ్ళదలచలేదు. ఏమి జరిగినప్పటికీ పరిస్థితిని సత్వరం ఎదుర్కొనవలసి వచ్చింది. ప్రస్తుత పరిస్థితి బాగా లేదు. దాని నివారణకు చర్యలు గైకొనాలి” అని ఆయన అన్నారు.

దేశంలో ఉత్పత్తి చాలినంతగాలేదు. అందువల్ల ఆర్థిక కార్యకలాపాలకు అవరోధం కల్పించవద్దని నేను ప్రజానీకానికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది ఎవరికీ తోడ్పడదు. కష్టాలను తొలగించదు. ఫ్యాక్టరీలన్ని ఒకరోజుకూడా మూసివేయబడరాదు. అలా జరిగితే వేతనాలపై ఆధారపడిన కార్మికులు ఆ రోజు దినభత్యాలు అందక నష్టపోతారు అని అన్నారు.

ప్రజలు శాంతియుతంగా తమ నిరసనను తెల్పాలి తప్ప దౌర్జన్యానికి, హింసకూ పూనుకోరాదని హితోపదేశం చేశారు.

ప్రజలు తమ నిరసనను శాంతియుతంగా తెల్పినంతవరకూ ప్రభుత్వం జోక్యం కల్పించుకోబోదని, దౌర్జన్యాలకు, హింసా చర్యలకూ దిగితే శాంతి భద్రతలకై జోక్యం కల్పించుకోవలసి వస్తుందని అన్నారు.

ఈ ఆందోళనను ఎవరు ప్రారంభించారన్న విషయంలోకి తాను వెళ్ళదలచలేదని, ఎవ్వరినీ నిందించ దలచలేదని శ్రీ నందా అన్నారు.

ఒక విలేకరి: ఈ దౌర్జన్యకాండను కొనసాగిస్తానని మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ప్రకటించినట్లు మీరు పార్లమెంటులో చెప్పారు గదా?

శ్రీ నందా: భవిష్యత్తుకు మార్గం వేయడానికై నేనీ విషయంలోకి వెళ్ళదలచలేదు. నేను ప్రస్తుతం గతాన్ని మరచిపోతున్నాను. ఎందువల్లనంటే నగరంలోనూ, రాష్ట్రంలోనూ, శాంతియుతమైన మామూలు ప్రజాజీవితం నెలకొనాలని మనం కోరుకొంటున్నాము. భవిష్యత్తుల్లో ఇంకా తప్పిదాలు జరగకుండా, హాని కలగకుండా వుండేలాంటి చర్యలు మార్గాలను గురించి మనం ముచ్చటించుకొందాం.

ప్రశ్న: ప్రతిపక్ష నాయకులను కలుసుకొనడానికి బెంగాల్ ముఖ్యమంత్రి సిద్ధంగా వున్నారా?

శ్రీ నందా: వివిధ అవకాశాలను గురించి మేము శోధిస్తున్నాము. అయితే మా కింతవరకూ పరిష్కారానికి నిర్దిష్టమైన మార్గం కనిపించలేదు. ఈ పరిష్కార మార్గం రేపు కనుగొనగలమని ఆశిస్తున్నాం. అని అన్నారు.

మేము సమస్యలతో పెనుగులాడుతున్నాము. ఈ ఆందోళన వెనుక గల కారణాలను పరిశీలిస్తున్నాం. బాధ్యతాయుతమైన ఆచరణీయమైన సకల చర్యలూ గైకొనబడతాయి. బెంగాల్‌లో శాంతియుత వాతావరణం నెలకొనడానికి సమంజసమైన కృషి జరిగే వరకూ నేను కలకత్తా విడచి పోను” అని అన్నారు.

కలకత్తాలో షహాపూర్ పోస్టు ఆఫీసులో వుత్తరాల సంచులు కొన్నింటికి “దుండగులు” నిప్పంటించారని ప్రభుత్వం ప్రకటించింది.

24 పరగణాలు, హుగ్లీ, హౌరా జిల్లాల్లో సైన్యం పౌర అధికారులకు తోడుగా పని చేస్తూనే వుందనీ, హౌరా, బర్ద్వాన్ జిల్లాల్లో పరిస్థితి ప్రశాంతంగానే వుందని ఆ ప్రకటన తెలియ జేసింది.

రాష్ట్రంలోని పలు రైలుమార్గాల్లో గూడ్సు బండ్ల రాకపోకలు నిలిచిపోయి వున్నవి. లోకల్ రైలుబండ్ల సంఖ్యకూడా బాగాతగ్గించబడింది. వివిధ ప్రాంతాల్లో పోలీసులు, సైనికులు గస్తీ తిరుగుతున్నారు.

శక్తి విహీనగా చేసిన ఎన్నిక స్వభావం

న్యూఢిల్లీ, మార్చి 12

పార్టీ నాయకత్వానికి శ్రీమతి ఇందిరాగాంధి ఎన్నికైన పరిస్థితులు, ఆ ఎన్నిక స్వభావం ఆమెను శక్తివంతమైన ప్రధానిగా తయారు కానివ్వలేదనే అభిప్రాయాన్ని శ్రీమతి ఇందిరాగాంధినేడు పత్రికా విలేకరుల సమావేశంలో నిరాకరించారు.

ఈ సమస్యను లేవనెత్తిన పత్రికా విలేకరి ప్రధాని ఎన్నిక సమయంలో ఆమెను బలపరచని కాంగ్రెస్ లోని కొన్ని వర్గాలు ఇప్పుడు ఆమెను పూర్తిగా బలపరుస్తున్నాయా అని కూడా ప్రశ్నించారు.

శ్రీమతి ఇందిరాగాంధీ ఇలా సమాధానం చెప్పారు,

“ఎవరు బలపరుస్తున్నారు, ఎవరు బలపరచడం లేదు అనే దానితో సంబంధం లేకుండా ఒక వ్యక్తి ఎంత సామర్థ్యాన్ని కల్గివుంటాడో అంత సమర్థుడుగానే ఉంటాడని అనుకుంటాను.

ఇక పార్టీకి సంబంధించినంతవరకు దానిలో రహస్యమేమీలేదు. విభిన్న అభిప్రాయాలు పార్టీలో ఉన్నవన్న మాట నిజం. అవి ఎప్పుడూ ఉంటూనే వున్నాయి. ఇక ముందు కూడా వుంటాయి. ఏయే కారణాలపై ఎవరు ఎవరిని బలపరుస్తారో చెప్పటం కష్టం”

కేంద్రం బలహీనపడిందనే వాదనను ఆమె నిరాకరించారు.

దేశంలో కొన్ని ప్రాంతాలలో కన్పడుతున్న వేర్పాటు ఉద్యమాలకు కేంద్రం బలహీనత కారణం అనే అభిప్రాయాన్ని నిరాకరిస్తూ అలాంటి ఉద్యమాలు ఇంతకుముందుకూడా ఉన్నాయని, అయితే ఈ చర్యలను గురించి ఇంతకుముందుకన్నా ప్రజలకు ఇప్పుడు ఇంకా ఎక్కువగా తెలుస్తున్నది అని ఆమె అన్నారు.

శీఘ్రమే అలీనదేశాల సభకు ప్రధాని విముఖత

న్యూఢిల్లీ, మార్చి 12

అలీన రాజ్యాల మహాసభ వెన్వెంటనే జరగాలని తాను కోరటంలేదని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి నేడిక్కడ జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై పత్రికావిలేకరు లడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ అన్నారు.

దేశంలో శాంతిభద్రతలు కొరవడుతున్నాయని, దేశం ఎదుర్కొంటున్న కష్టాలను రాజకీయపార్టీలు ఎన్నికలముందు తాము బలపడటానికి ఉపయోగించుకోవాలని యత్నిస్తున్నాయని ఆమె ఆరోపించారు.

అంతమాత్రాన దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదం ఏర్పడగలదని తాను అనుకోవటం లేదని ఆమె అన్నారు.

అంతకుముందు ప్రెస్ అసోసియేషన్ ప్రధానికి సన్మానంజరిపింది. శ్రీమతి ఇందిరాగాంధి ఆ సన్మాన సభలో ప్రసంగిస్తూ దేశం ఎదుర్కొంటున్న చిక్కులతోపాటు, దేశం వివిధ రంగాలలో సాధిస్తున్న పురోగతిని కూడా పత్రికలు ప్రతిబింబించాలని అన్నారు.

పత్రికలవారు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ తాను అమెరికాను సందర్శించినప్పుడు అధ్యక్షుడు జాన్సన్‌తో పెక్కు విషయాలపై అభిప్రాయమార్పిడి జరుపుకోగలమని, సహజంగానే ప్రస్తుత భారత పరిస్థితులుకూడా ఆ సమావేశంలో చర్చకు వస్తాయని ఆమె అన్నారు.

తాను తిరిగి స్వదేశానికి వచ్చేటప్పుడు ఒకరోజు పారిస్‌లో ఉంటానని, కొద్దిసేపు మాస్కో విమానాశ్రయంలో ఉంటానని, అప్పుడు బహుశా సోవియట్ నాయకులతో చర్చలు జరపడం సాధ్యపడవచ్చునని ఆమె చెప్పారు.

తాష్కెంట్ ప్రకటనానంతరం తీసుకోబడిన చర్యలు సంతృప్తిని కల్గించాయా అన్న ప్రశ్నకు సమాధానంగా, బలాల ఉపసంహరణకు సంబంధించినంతవరకు, సంతృప్తికరమైన చర్యలు తీసుకొన్నాం. ఇంకా జరుగవలసిన పని ఎంతో వుంది అని ఆమె అన్నారు.

వియత్నాం యుద్ధానికి స్వస్తిచెప్పేందుకు భారతదేశం చొరవ తీసుకొంటున్నదా? అన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, ఆ సమస్యా పరిష్కారానికి మార్గం కనుగొనబడితే సంతసిస్తాం. కాని ఈ విషయంలో మనం ఏమీ చొరవ తీసుకోలేదు అని ఆమె అన్నారు.

మరో ప్రశ్నకు సమాధానమిస్తూ వియత్నాంపై అమెరికాబాంబులువేయటానికి భారతదేశం ఏనాడూ అనుకూలంకాదు అని ఆమె అన్నారు.

పంజాబీ సుబాపై కాంగ్రెస్ కార్యవర్గ తీర్మానానికి పెక్కు అర్థాలు నివ్వటం జరుగుతున్నదృష్ట్యా ఆ తీర్మానాన్ని వివరించవలసిందిగా ఒక పత్రికా విలేకరి కోరగా శ్రీమతి ఇందిరాగాంధి నవ్వుతూ “మీభాష్యం మీరు చెప్పుకోవడం మంచిది” అని అన్నారు.

మార్చి 18న అసెంబ్లీ సభ్యులతో ముఖ్యమంత్రి చర్చలు

రామగుండం ప్రాజెక్టు మొదలైన విషయాలపై

హైద్రాబాద్, మార్చి 12

రామగుండం థర్మల్‌స్టేషన్ నిర్మాణంపై పారిశ్రామికవేత్త శ్రీ ధర్మతేజతో చేసుకున్న ఒప్పందంపైనా, రిపబ్లికన్ ఫోర్జ్‌కంపెనీ వ్యవహారాలపైన, రాజమండ్రి పేపరుమిల్లుపైనా రాష్ట్ర శాసనసభలోని ముఖ్యమైన సభ్యులతో మార్చి 18 ఉదయం 11-30 గం. లకు అసెంబ్లీభవనంలోని కమిటీ హాలులో చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రి నిర్ణయించుకున్నారు.

ఈ పై విషయాలకు సంబంధించి. నాల్గు ప్రశ్నలు, ఒక స్వల్పవ్యవధి ప్రశ్న సభ ముందుకు రాగా ముఖ్యమంత్రి సభ్యులతో ఈ అంశాలపై అభిప్రాయమార్పిడి జరపాలనే వాంఛను వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి చేసిన అభ్యర్థనను ప్రతిపక్షల నాయకులు అంగీకరించి ప్రశ్నలను వాయిదా వేయటానికి ఆమోదించారు.

పై విషయాలపై యిటీవల వెలువడిన వార్తలు ప్రజలలోనూ, ప్రభుత్వ వర్గాలలోను అనేక సందేహాలకు దారితీసిన సంగతి పాఠకులకు విదితమే. (వి. వి.)

నిజామాబాద్ జిల్లా బోధన్‌లో పోలీసు అఘాయిత్యం

బోధన్, మార్చి 13

నిజామాబాద్‌జిల్లా బోధన్‌లో మునిసిపల్ కార్యాలయానికి యెదురుగావున్న ఖాళీస్థలం శ్రీమతి అజీజ్‌బేగమ్‌కు చెందివుంది. ఈ ఖాళీస్థలం శ్రీ కయూమ్ అలీషా స్వాధీనంలోనూ, మేనేజ్‌మెంటుక్రింద వుంటున్నది.

7 కుటుంబాలు యీ స్థలంలో పూరిపాకలు నిర్మించుకొని నివసిస్తున్నాయి. దీనికి మున్సిపాలిటి అంగీకరించింది.

కాని యిప్పుడు పై ఖాళీస్థానం తనదంటూ యెవరో ఒక మోసకారి చెబుతున్నాడు. ఆయిన పోలీసులకు మున్సిపాలిటీకి లంచం యిచ్చి యెటువంటి నోటీసు ముందుగా యివ్వకుండా ఆ కుటుంబాలవారు లేనిసమయం చూసి పూరిపాకలను పెరికివేయించారు.

మున్సిపాలిటీ సిబ్బంది పోలీసులు మొత్తం గుంపుగా వెళ్ళి వారి పూరిపాకలను పెరికివేస్తూ సామానులను దోచుకొని స్త్రీలను నానా దుర్భాషలాడారు. తర్వాత పోలీసులు వారిపై లాఠీచార్జీ చేసి నడివీధిలో పడవేశారు.

ఈ విషయం తెలిసిన కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీ బాలయ్య పోలీసులధికారులను ఈ దారుణకాండపై ప్రశ్నించగా, ఆయనను బలవంతంగా నిర్బంధించి, రాత్రి 8 గంటల వరకు పోలీస్‌స్టేషన్‌లో వుంచారు. తర్వాత విడుదల చేశారు.

పోలీసుల దారుణకాండకు నిరసనగా 400 మంది, పూరిపాకలలో నివసిస్తున్న ప్రజలు వూరేగింపు జరిపారు.

సామాజిక మార్పు త్వరితానికి బలమైన దేశనాయకత్వం

అవసరమని శ్రీ అశోక మెహతా

బొంబాయి, మార్చి 11

దేశంలో సామాజిక పరిణామం త్వరితం గావాలంటే దేశానికి బలమైన, కృతనిశ్చయమైన నాయకత్వం కావాలని కేంద్ర ప్రణాళికా మంత్రి శ్రీ అశోకమెహతా నేడిక్కడ అన్నారు.

మహారాష్ట్రశాఖ కామన్వెల్త్ పార్లమెంటరీ సంస్థవారు ‘ప్రజాస్వామ్యం సామాజిక పరిణామం’పై ఏర్పాటు చేసిన గోష్ఠిలో ప్రసంగిస్తూ శ్రీ మెహతా పైనుండి విధింపబడిన యేవో సంస్కరణలు సామాజిక పరివర్తనను తీసుకురాలేవని అన్నారు.

ప్రజాస్వామ్యంవల్ల కలిగిన లాభాలను మన ప్రజలు అనుభవిస్తున్నారని, మనం మన సమాజాన్ని మార్పు చేయాలంటే మనతో పాటు అనేకమంది ప్రజలను కొనిపోవాలని ఆయన అన్నారు.

నాగార్జున సాగర్ వద్ద కలరా

8 మంది మృతి

విజయపురి, మార్చి 12

నాగార్జునసాగర్ పరిసరప్రాంతాల్లో కలరావ్యాధి తీవ్రంగా వున్నట్లు వార్త వచ్చింది.

ఈ జాడ్యానికి గురై ఇప్పటికి 8 మంది మరణించారని, మరొకరు ఆస్పత్రిలో చేర్చబడ్డారని మా విలేకరి తెల్పుతున్నారు.

బంగారు నగల అమ్మకంలో మినహాయింపు

న్యూఢిల్లీ, మార్చి 13

14 క్యారెట్లకు మించిన బంగారు వస్తువులను, ఆభరణాలను, అవి 1963 జనవరి 10 నాటికిముందుతయారుచేయబడినవైనపక్షంలో వానిని వ్యాపారులు 1966 డిసెంబరు 31 లోగా అమ్ముకోవచ్చునని ప్రభుత్వం నేడిక్కడ అధికార ప్రకటన చేసింది. అయితే ఆభరణంలోని బంగారం, ఆభరణపు విలువలో 40 శాతానికన్నా ఎక్కువ ఉండరాదు. ఈమినహాయింపు1966మార్చి31వరకు ఇస్తూ గతంలో ప్రభుత్వం ప్రకటన చేసిందని అయితే బంగారు వ్యాపార సంస్థలు తమ వద్దనున్న ఆభరణాలు పూర్తిగా అమ్ముకు పోలేదని, కనుక ఈ మినహాయింపు గడువు పొడిగించవలసిందిగా కోరిన దృష్ట్యా ఈ సంవత్సరం డిసెంబరు 31 వరకు ఈ మినహాయింపును ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు అధికార ప్రకటన చెబుతున్నది.

అమృతసర్ లో కాల్పులు

(1 వ పేజీ తరువాయి)

ఏజన్సీ కార్యాలయాన్ని తగుల బెట్టడానికి ప్రయత్నించిన కొంతమంది యువకులపై అశ్విక పోలీసులు బెత్తాం ప్రయోగం జరిపారు. వీరిని చెదరగొట్టడానికి సాధ్యం గాక అదనపు పోలీసు బలగాలు రంగంలోకి వచ్చి బాష్పవాయు ప్రయోగం జరిపాయి.

అరెస్టులు

స్థానిక పోలీసులు నేడు 8 మంది స్థానిక జనసంఘ కార్యకర్తలను అరెస్టు చేశారు.

దీనితో పంజాబీ సుబా వ్యతిరేకోద్యమం సందర్భంలో ఇంతవరకూ లూధియానా జిల్లాలో అరెస్టయిన వారి సంఖ్య 104 కు చేరింది. వీరిలో మాస్టర్ తారాసింగ్ గ్రూపుకు చెందిన 5 గురు అకాలీలు కూడా వున్నారు.

ఒక పోలీసు మృతి

నేటిసాయంత్రం బాష్పవాయువు తూటాను మోసుకు వెళుతున్న ఒక పోలీసు, ఆ తూటా ప్రమాదవశాన ప్రేలడం వల్ల తీవ్రంగా గాయపడ్డాడు. అత్యంత ప్రమాదకర స్థితిలో అతనిని సమీపానగల ఆస్పత్రిలో చేర్పించారు. తర్వాత అతడు మరణించాడు.

ఈ సంఘటన అనంతరం నగరంలోని తంతి తపాలా భవనాల సంరక్షణకు సాయుధ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయబడింది.

92 మంది పోలీసులకు గాయాలు

పంజాబీ సుబా వ్యతిరేక ప్రదర్శనల సందర్భంగా అమృతసర్, లూధియానా, జలంధర్, హిస్సార్‌లలో ప్రదర్శకులకూ, పోలీసులకూ మధ్య జరిగిన సంఘర్షణల్లో ఇంతవరకూ కనీసం 92 మంది పోలీసులు, హోంగార్డులూ గాయపడ్డారని వార్తలు అందినట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రామ్ కిషన్ నేడు చండీఘర్‌లో ప్రకటించారు.

ఈ సందర్భాల్లో 25 మంది ప్రదర్శకులు మాత్రమే గాయపడినట్లు ఆయన చెప్పారు.

నిషేధాజ్ఞలను ధిక్కరించడంతో సహా వివిధ నేరాలక్రింద ఇంతవరకు 140 మందిని మాత్రమే అరెస్టు చేయడం జరిగిందని, ప్రదర్శకులు ఎంతగాకవ్వింపునకపూనుకొన్నప్పటికీ తన ప్రభుత్వము అత్యంత నిగ్రహంతో వ్యవహరించిందని చెప్పారు.

జలంధర్‌లో వివిధ కల్లోల ప్రాంతాల్లో గస్తీచర్యలు కొనసాగించే నిమిత్తం అశ్విక పోలీసుదళాలను, పోలీసుదళాలనూ నియమించడం జరిగిందన్నారు.

ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే వున్నదని రాష్ట్రపరిస్థితిని గురించితానుప్రధానమంత్రికీ, కేంద్ర హోం మంత్రికీ తెలియజేశానని చెప్పారు.

కాశ్మీర్ లో ప్లెబిసైట్ ప్రసక్తే లేదు

(1 వ పేజీ తరువాయి)

స్థిరత్వాన్ని సంపాదించా లన్నారు.

పాక్ అధ్యక్షుడు ఆయూబ్‌ఖాన్‌తో తాను సమావేశం జరపాలని కుతూహల పడుతున్నట్లు శ్రీమతి గాంధీ చెప్పారు. ఇటీవల సంఘర్షణ కాలంలో చెడిపోయిన మామూలు పరిస్థితులను ఉభయదేశాల మధ్య ఇంకా ఎంతగానో మామూలు స్థాయికి తీసుకొని రావాలసివున్న వున్న దన్నారు.

అమెరికా పర్యటన

మే మాసంలో పార్లమెంటు సమావేశం ముగిసిన అనంతరం తను అమెరికా పర్యటించ దలచుకున్నట్లు ఆమె చెప్పారు. ఫిబ్రవరిలోనే అమెరికా యాత్ర జరిపేందుకు కీ॥ శే॥ లాల్‌బహదూర్ శాస్త్రి నిర్ణయించుకొన్నారని, ఈ పర్యటన దీర్ఘకాలం వాయిదా పడరాదని అమెరికా అధ్యక్షుడు భావిస్తున్నారనీ ఆమె చెప్పారు.

ప్రస్తుత తన రాజకీయ పరిస్థితి గురించి, ప్రభుత్వం లేదా పార్లమెంటులోని మూల పరిస్థితిని గురించి అడిగిన ప్రశ్నకు శ్రీమతి గాంధీ సమాధానమిస్తూ భారతదేశం మధ్యే మార్గాన్ని, మిశ్రమ ఆర్థికవిధానాన్ని అవలంభించవలసి వుందన్నారు. ఇదితప్పితే అస్థిరత్వ ప్రమాదం దాపురించగలదన్నారు.

చైనాకు ప్రస్తుతం భౌగోళిక విస్తరణ కాంక్ష లేదని, అది చైనా దీర్ఘకాలిక పథకమని అన్నారు. చైనా ప్రస్తుతలక్ష్యం తన పొరుగు రాజ్యాలను నిర్వీర్య పరచడంద్వారా తన పలుకుబడిని పెంపొందించుకొనడమే నన్నారు.

చైనా ఇంకా భారతదేశానికి ప్రమాదకారిగానే వుందని, అది ఎప్పుడు భారీఎత్తున దాడి ప్రారంభించగలదో చెప్పడం కష్టమనీ అన్నారు. చైనా సైన్యాలు భారత సరిహద్దుల్లో మోహరించి వున్నాయనీ, ఆ విధంగా భారత రక్షణావసరాల్లపై ఖర్చు చేయిస్తున్నదనీ అన్నారు.

చైనా మరొక పర్యాయం తీవ్రమైన దురాక్రమణకు తలపడితే ఇతర దేశాలనుండి సహాయానికి భారతదేశం ఎదురు చూస్తుందా? అన్న ప్రశ్నకు సమాధానం చెబుతూ అమెరికా, రష్యాలతోసహా అన్ని మిత్రదేశాల నుండి సహాయానికి భారతదేశం యెదురు చూడగలదన్నారు.

“రష్యా మా పొరుగుదేశమని మాకు తెలుసు. అంతేగాక చైనాకు కూడా పొరుగు దేశం. అందువల్ల సోవియట్ సహాయం లేనిదే ఏపనిచేయడమూ మాకు కష్టసాధ్యం అని ఆమె అన్నారు.

వియత్నాం సమస్యపై శాంతియుత సంప్రతింపులు జరగడానికి ఏ రీతిలోనైనా తోడ్పడాలని తాను భావిస్తున్నాననీ, అయితే ఈ విషయంలో ఏ చర్యలు తీసుకోవాలని సూచించడం కష్టమనీ అన్నారు.

దక్షిణ వియత్నాంలో “ఆర్థిక, సాంఘిక కార్యక్రమాలకు” జాన్సన్ చేసే ప్రయత్నాలు శుభారంభ మన్నారు. అమెరికా దక్షిణ వియత్నాంకు ఎంత సహాయంచేసినా స్థానిక ప్రజలకు బలమైన పునాది వుండాలన్నారు. అమెరికా అందచేసే సహాయం బయట ప్రపంచంలో ఒకరకమైన ప్రత్యేక వాతావరణం కల్పిస్తుందనీ అందువల్ల దక్షిణవియత్నాం నాయకులు ఎవరైనప్పటికీ, తాను తనకాళ్ళపై నిలబడగలిగి వుండాలన్నారు.

నాటో సైనికసంస్థలతో ఫ్రాన్సు తెగతెంపులు

పారిస్, మార్చి 12

ఉత్తర అట్లాంటిక్ రక్షణ సంధి క్రింద సామ్రాజ్యవాదులు నిర్మించిన రెండు అనుబంధ సైనిక సంస్థలనుండి ఫ్రాన్సు ఉపసంహరించుకుంటున్నట్లు నేడు ప్రకటించింది.

పారిస్ సమీపంలోగల ఈ సైనిక సంస్థల ప్రధాన కార్యాలయాలు దేశం వెలుపలికి తరలించ బడతాయి.

ఈ విషయాన్ని తెలుపుతూ ఫ్రాన్సు నాటో యుద్ధ కూటమిలోని తన 14 మిత్ర దేశాలకు, నిన్న ఒక మెమోరాండం అందజేసింది.

యూరప్‌లోని మిత్రరాజ్యాల సర్వసైన్యాధిపత్య ఉన్నత కార్యాలయం, మధ్య యూరప్ సర్వసైన్యాధిపత్యం అనేవి ఈ రెండు సంస్థలు. ఇందులో మొదటిది అమెరికా సైన్యాధిపతి క్రింద, రెండవది ఫ్రెంచి జనరల్ క్రింద ఉన్నాయి.

అమెరికా - చైనాల మధ్య వార్సాలో చర్చలు

కొనసాగుతూనే వుంటాయని బుండి ప్రకటన

తైపే, మార్చి 12

వార్సాలో అమెరికా చైనా రాయబారుల చర్చలు అప్పుడప్పుడూ కొనసాగుతూనే వుంటాయని, అమెరికా విదేశాంగశాఖసహాయ మంత్రి విలియమ్ బుండేనేడిక్కడ కొమింగ్ టాంగ్‌ముఠాతో చర్చలు జరిపిన అనంతరం ప్రకటించారు.

వార్సా చర్చలు ప్రయోజనకరమైనవిగా తాను భావిస్తున్నామని కూడాఆయనతెలిపారు.

మార్కాపురం తాలూకాలో కరువుపనులు

కాల్ ఎటెన్షన్ తీర్మానంపై మంత్రి సమాధానం

హైద్రాబాద్, మార్చి 12

కమ్యూనిస్టుసభ్యులు శ్రీ పూల సుబ్బయ్య ప్రతిపాదించిన కాల్ ఎటెన్షన్ తీర్మానానికి సమాధాన మిస్తూ 65-66 సంవత్సరంలో వర్షాభావం వల్ల మార్కాపురం తాలూకాలోని మొత్తం 95 గ్రామాల్లోనూ కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని రివెన్యూ మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి నేడు శాసన సభలో చెప్పారు. ఈ తాలూకాలో కరువు పరిస్థితులకు ఒకకోటి 40 లక్షలమంది ప్రజలు గురయ్యారని మంత్రి చెప్పారు. వ్యవసాయ కార్మికులకు పని చూపించేందుకు పెక్కు సహాయ కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయని ఆయన చెప్పారు.

మార్కాపురం సమితి ప్రాంతంలో ఒక లక్ష రూపాయలు, ఎర్రగొండపాలెం సమితి ప్రాంతంలో ఒక లక్ష 25 వేల రూపాయల వ్యయంకాగల కరువు పనులను చేబట్టటం జరిగిందని ఆయన తెల్పారు. ఇంతవరకు మార్కాపురం తాలూకాలో 23 వేల రూపాయలు ఖర్చు చేశామని ఆయన చెప్పారు.

రు. 2.44 లక్షల భూమి శిస్తు రెమిషన్ ఇవ్వబడినట్లు, కరువు పరిస్థితులను తొలగించేందుకు 2.5 లక్షలు తక్కావీ ఋణాలను మంజూరు చేయటానికి నిర్ణయించినట్లు మంత్రి చెప్పారు. 54 దరఖాస్తులపై 23.7 వేల రూపాయలను ఇంతవరకు మంజూరు చేసినట్లు తహసీల్దార్లు తెల్పారని ఆయన అన్నారు.

అంతకుముందు కాల్‌ఎటెన్షన్ తీర్మానంపై శ్రీ పూల సుబ్బయ్య ప్రసంగిస్తూ మార్కాపురం తాలూకాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడినట్లు ప్రభుత్వం సైతం గుర్తించిందని అన్నారు. కరువుకు గురైన ప్రాంతంలోని ప్రజలకు ఋణాలు నిచ్చేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలను కేటాయించిందని, అయితే ఇంతవరకూ ఋణాలుమంజూరు కాలేదని అన్నారు.

ఈ ఋణాలపై వడ్డీ వసూలు చేయరాదని శ్రీ సుబ్బయ్య కోరారు. గతంలో బాకీలు ఉన్నారనే కారణంపైనా, ఇతర సాంకేతిక కారణాలపైనా పెక్కు దరఖాస్తులు తిరస్కరించబడ్డాయని తెల్పుతూ, సాంకేతిక కారణాలు అవతలబెట్టి, ప్రజలకు సహాయపడవలసిందిగా ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

(వి. వి.)

రక్షణ శాఖలమధ్య సమన్వయం

హైద్రాబాద్‌లో శ్రీ జనరల్ చౌదరీ ప్రసంగం

హైద్రాబాద్, మార్చి 13

దేశరక్షణకై రక్షణ శాఖలకు చెందిన వివిధశాఖల మధ్య సమన్వయం అవసరమని భారత-పాకిస్తాన్ సంఘర్షణ కాలంలో యిది గణనీయంగా ప్రదర్శించ బడిందని భారత సర్వ సైన్యాధ్యక్షుడు జనరల్ శ్రీ జె. యన్. చౌదరీ నేడిక్కడన్నారు.

కలకత్తాలో తిరిగి పోలీసు కాల్పులు

కలకత్తా, మార్చి 12

నేటిరాత్రి 10 గంటల ప్రాంతంలో ఉత్తర కలకత్తాలోని గిరీష్ ఎవెన్యూ వద్ద ప్రజలపై పోలీసులు కాల్పులు జరిపారు.

సైనిక గస్తీదళాలమీద, పోలీసుల మీద, ప్రజలు చేతిబాంబులు విసరి సంఘర్షణకు దిగారని అధికారులు చెప్తున్నారు.

అదే సమయంలో మధ్యకలకత్తాలోని బెరియాఘట్ ప్రాంతంలో కూడా ప్రదర్శకులపై పోలీసులు కాల్పులు జరిపారు. పోలీసు వ్యానుపై ప్రదర్శకులు బాంబు విసరారనే సాకుతో ఈ దారుణ కృత్యానికి పోలీసులు పాల్పడ్డారు.

అంతకుముందు 8 గంటలప్పుడు పశ్చిమ కలకత్తాలోని బందా-బస్తోల్లా ప్రాంతంవద్ద పోలీసు గస్తీదళంపై ప్రదర్శకులు బాంబులు విసరారని చెప్పి రెండు రౌండ్లు పేల్చారు. ఈ సందర్భంగా 8 మందిని పోలీసులుఅరెస్టు చేశారు.

బారక్‌పూర్‌లోని టెలిఫోను ఎక్ఛేంజి కార్యాలయం మీద కూడా బాంబులతో ప్రదర్శకులు దాడిచేశారని, అక్కడకూడా పోలీసులు కాల్పులు జరిపారని మరోవార్త తెల్పుతున్నది.

ఈ కాల్పుల ఫలితంగా సంభవించిన ప్రాణ నష్టాన్నిగురించి వివరాలు ఇంకా తెలియరాలేదు.

24 పరగణాల జిల్లాలో సంఘటనలు

24 పరగణాల జిల్లాలోని సోదెపూర్ వద్ద ఒక ప్రత్తిమిల్లు కాపలాదార్లు ఇద్దరిని నేడు ఎవరో కత్తితో పొడిచి చంపారు. ఈ సందర్భంగా జరిగిన సంఘర్షణలో ముగ్గురు కార్మికులు గాయపడ్డారు.

వెయ్యి మందికిపైగా జనం ఈ మిల్లుపై దాడిచేసి గోదాముకు నిప్పు అంటించారని ఫలితంగా రు. 7500 ల విలువగల ఆస్తి నష్టమైందని రాష్ట్రప్రభుత్వం నేటొక పత్రికా ప్రకటన చేసింది. ఈ జిల్లాలో నిక్‌వాగన్‌సమీపంలోని దమదమ్ ప్రాంతాలో ఒక పోలీసు శకటంపై బాంబు విసిరినట్లు కూడా ఈ ప్రకటన పేర్కొన్నది.

రు. 9200 చెక్కును రు. 29200 గా దిద్ది డబ్బుతీసిన ఘనుడు

కురుగొండ పంచాయతీ ప్రెసిడెంట్ సుందరరామిరెడ్డిపై ఇంతవరకు ఏ చర్యా తీసుకోని స్థితి

గూడూరు, మార్చి 12

నెల్లూరుజిల్లా గూడూరుతాలూకా కురుగొండ గ్రామ పంచాయతీ ప్రెసిడెంట్ శ్రీ పంగులూరు సుందరరామిరెడ్డిగారు, రు. 9200 ల చెక్కుకు అంకె మొదట్లో ‘2’ చేర్చి రు. 29200 గా చేసి ఆ మొత్తం బ్యాంకునుండి పొందినట్లు తెలిసింది. స్వర్ణకార సహకారసంఘ అధ్యక్షుని హోదాలో ఈ మొత్తం శ్రీ సుందరరామిరెడ్డిపేర గూడూరు పంచాయతీ సమితి బి.డి.ఓ.చే చెక్కుజారీఅయింది, అయితే సుందరరామిరెడ్డి ‘ఘనకార్యం’పై యింతవరకు ఎవరూ ఎట్టిచర్యా తీసుకోలేదు.

నెల్లూరుజిల్లా గూడూరు పంచాయతీసమితి బి.డి.ఓ. శ్రీ అల్‌ఫ్రెడ్‌గారు కురుగొండపంచాయతీ ప్రెసిడెంటు పంగులూరు సుందర రామిరెడ్డిగారికి 4-3-66 తేదీన 9200 రూపాయలకు నెల్లూరు కో-ఆపరేటివ్ సెంటరల్ బ్యాంకుకి చెక్కు యిచ్చారు. ఆ చెక్కును 29200 రూపాయలకు ఫోర్జరీచేసి, నెల్లూరు సెంట్రల్ బ్యాంకుతో డబ్బు తీసుకొన్నాడు.

గూడూరుతాలూకా కురుగొండ గ్రామంలో వెంకటేశ్వర గోల్డు స్మిత్ ఫర్నీచర్ మ్యాన్ ఫ్యాక్చరింగుకోఆపరేటివు ఇండస్ట్రియల్‌సొసైటీ అనే దానిని స్థాపించారు. ఆ సొసైటీకి సుందర రామిరెడ్డిగారే ప్రెసిడెంటుగా వుంటూ వున్నారు. ఆ సొసైటీకి గూడూరు సమితి మంజూరుచేసిన ఈ డబ్బుకు జారీచేసిన బ్యాంకి చెక్కును ఫోర్జరీచేసి 20 వేలు అదనంగా కలిపి. 20 వేల రూపాయలు డబ్బు తీసుకొన్నాడు. ఇతను యింకా కొన్ని కోఆపరేటివు సంస్థలకు ఆ గ్రామంలో ప్రెసిడెంటుగా వున్నాడని తెలియుచున్నది.

శ్రీ పంగులూరు సుందరరామిరెడ్డి తాలూకాలో కాంగ్రెసు వాదిగా చెలామణి అవుతూ జిల్లాలోయున్న కాంగ్రెసు పెద్దలయొక్క సానుభూతి సహకారాలు పొందుతూ వచ్చాడు. 1½ మాసముల క్రిందటనే కురుగొండ పంచాయతీకి ఏకగ్రీవముగా యెన్నుకోబడిన అధ్యక్షుడు.

పై ఫోర్జరీ కేసును మాఫీచేసే దానికిజిల్లా కాంగ్రెసు నాయకులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. ఇతను బహిరంగముగానే తిరుగుతూ 4-3-66 తేదీ డ్రా చేసిన డబ్బులో కొంతభాగం 7 వ తారీఖు, లోకల్ లైబ్రరీ అథార్టీ (గూడూరు తాలూకా తరుపున ఒక ప్రతినిధి) యెన్నికల సందర్భంలో కొంత డబ్బు ఖర్చు పెట్టానని తన మిత్రులతో చెప్పుకోవడం జరుగుతూంది. ఇంతవరకు యితనిమీద, గూడూరు పంచాయతీ సమితి బి. డి. ఓ. గాని, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకివారుగానీ యెటువంటి చర్యలు తీసుకోలేదు. (వి. వి.)

ప్రభుత్వ స్వాధీనమిల్లులలో వాటాలు పొందేందుకు బిల్లు

న్యూఢిల్లీ, మార్చి 11

ప్రభుత్వ నిర్వహణక్రింద నడుస్తున్న మిల్లులలో ఎక్కువ వాటాలను పొందేందుకు ప్రభుత్వం ఒక బిల్లును ప్రవేశపెట్టనున్నదని శ్రీ ఏ. పి. శర్మ ప్రశ్నకు సమాధానంగా నేడు లోక్‌సభలో మంత్రి సమాధానమిచ్చారు.

ఇండొనేషియాలో మామూలు పరిస్థితి

జకార్తా, మార్చి 13

ఇండొనేషియా అధ్యక్ష అధికారాలను సర్వసైన్యాధ్యక్షుడుసుహర్తోకు నిన్న ధారాదత్తం జరిగిన తర్వాత జకార్తాలో మామూలు పరిస్థితి ఏర్పడింది, ఈ నగరవీధులను సైనిక దళాలు, సైనిక శకటాలు దారి కీస్తుఉపసంహరించు కున్నారు.

ఇండొనేషియా అధ్యక్షుడు సుకర్నో రాజధానికి 64 కిలోమీటర్ల దూరంలో బోగోర్‌లో అధ్యక్ష భవనంలో వున్నారని తెలుస్తున్నది.

తన సర్వాధికారాలను సుహర్తోకు అప్పగించి యిక్కడనుండి నిన్న సుకర్నో హెలికాప్టర్‌లో వెళ్ళారు.

రీ టెండరు నోటీసు

కంకిపాడు గ్రామ పంచాయతీ

ఆర్. ఓ. సి, నెం. 150/66 A 1 తేదీ 12-3-66

కృష్ణాజిల్లా విజయవాడ తాలూకా కంకిపాడు గ్రామ పంచాయతీ ఏరియాలో యీ దిగువ నుదహరించిన పని చేయుటకుగాను కంకిపాడు గ్రామ పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగారిచే ది 22-3-66 వ తేదీ సాయంత్రం 4 గంటలకు సీల్డు టెండర్లు స్వీకరింపబడును. అదేరోజున 4-30 గంటలకు హాజరైన టెండరుదార్ల సమక్షములో దాఖలు చేయబడిన సీల్డు టెండర్లు తెరువబడును. టెండరు దాఖలు చేయువారు యీ దిగువ నుదహరించిన ప్రకారం ధరావతు చెల్లించి టెండర్లు, దాఖలు చేయవలెను. నిర్ణీత ధరావతు చెల్లించని; రసీదు జతపర్చబడని టెండర్లు నిరాకరింపబడును. మిగిలిన వివరములు ఆఫీసు పని చేయు వేళలో తెలుసుకొనవచ్చును.

వ. నెం.	పని పేరు	ఎస్టిమేటు మొత్తం	చెల్లింపవలసిన ధరావతు
		రూ.	రూ.
1.	కంకిపాడు పంచాయతీ కూరగాయలమార్కెట్టు భవన నిర్మాణము చేయుట.	26000-00	1300-00

(సం.) కె. యన్. మల్లేశ్వరరావు, బి. ఏ.
కార్యనిర్వహణాధికారి.
గ్రామపంచాయతీ, కంకిపాడు.

హవానా మహాసభ

(2 వ పేజీ తరువాయి)

చేయడమంటే ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికాల ప్రజా సంఘాల అంతర్గత వ్యవహారాలలో జోక్యం కల్పించుకోవడమే నని చైనా ప్రకటించింది. ఈ అంతర్జాతీయ సంస్థలకు వ్యతిరేకంగా రెండు రోజులపాటు చైనా నాయకత్వాన 10 దేశాలు చర్చించాయి. వాదించాయి. చివరకు భారతదేశంచే సభ ముందుంచబడిన యీ మూడు తీర్మానాలు 2/3 వంతు మెజారిటీతో ఆమోదించబడ్డాయి. మహిళా, యువజన, కార్మిక సంఘాలలోని ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి చేసిన ప్రయత్నాలు పూర్తిగా విఫలమయినాయి.

అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీని పూర్తిగా బహిష్కరించాలని డిమాండు చేస్తూ చైనా. దానిఅనుకూలురు సభముందు ఒక తీర్మానాన్ని పెట్టారు. అత్యధిక మెజారిటీతో యీ తీర్మానంకూడ ఓడించబడింది. వాస్తవంగా లాటిన్ అమెరికాదేశాలకు క్యూబా ఆటగాళ్ళు వెళ్ళడానికి అనుమతించే సంస్థ ఒక్క ఒలంపిక్ కమిటీమాత్రమే. అమెరికా సంస్కృతిని వారి పుస్తకాలు, చిత్రాలతోసహా బహిష్కరించాలని డిమాండు చేస్తూ చైనాబృందం మరోతీర్మానం ప్రతిపాదించింది, అయితే అమెరికా సామ్రాజ్యవాదుల సంస్కృతికి. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న అమెరికా ప్రజల సంస్కృతికి మధ్యనున్న తారతమ్యాన్ని కమిషన్ వివరించింది.

ఆర్థిక కమిషన్

ఆర్థిక కమిషన్‌లో ముసాయిదా తయారు చేయడానికి చైనా వ్యతిరేకించినప్పటికి భారతదేశం ఎన్నిక కావడంతో చైనా పరాజయం ప్రారంభమయింది. అమెరికా సామ్రాజ్యవాదంవలన సైనికంగా ముట్టడింపబడి, ఆర్థిక బహిష్కారాన్ని- నిషేధాలను ఎదుర్కొంటున్న క్యూబాకు ప్రతి సోషలిస్టుదేశం సహాయం చేయాలని డిమాండుచేస్తూ భారతదేశం ఒక తీర్మానాన్ని ప్రతిపాదించింది. అన్ని ఆర్థికసంబంధాలు పరస్పరలాభంపై ఆధారపడి వుండాలని చైనా కోరింది. క్యూబా పంచదారను కొనటానికి. దానికిబదులుగా క్యూబాకు బియ్యాన్ని యివ్వడానికి చేసుకొన్న ఒప్పందాన్ని తిరస్కరించిన చైనాను అభిశంసిస్తున్న భారతదేశ తీర్మానాన్ని అత్యధిక మెజారిటీతో ఆమోదించడం జరిగింది. శాంతియుత సహజీవన పద్ధతిపై పెట్టుబడిదారీ దేశాలతో వర్ధమాన దేశాలకున్న ఆర్థికసంబంధాలను చైనా వ్యతిరేకించింది, అయితే ఆర్థిక కమిషన్ చైనా సూచనను తిరస్కరించింది, ఈ కమిషనులోకూడ చైనా నాయకత్వానవున్న 10 దేశాలు వేరుచేయబడ్డాయి.

నిర్మాణ కమిషను చర్చలు

నిర్మాణ కమిషనులో ఖండత్రయ సంస్థ యేర్పాటును చైనా వ్యతిరేకించింది, అయితే కమిషను అత్యధిక బలంతో ఖండత్రయ సంస్థను యేర్పాటు చేయడానికి నిర్ణయించింది, ఒకవైపున ఐక్యఅరబ్ రిపబ్లిక్, సోవియట్ యూనియను, భారతదేశం. రెండవ వైపున క్యూబాలమధ్య అభిప్రాయ బేధాలున్న వనుటలో సందేహంలేదు. ఈ మహాసభను క్యూబాలో యేర్పాటుచేసి, విజయవంతం చేయడానికి పెద్ద ప్రయత్నం చేసిన దృష్ట్యా మాత్రమేకాక, లాటిన్ అమెరికా దేశాలలో అమెరికా సామ్రాజ్యవాదం క్యూబాను వేరు చేయడానికి ప్రయత్నించినదృష్ట్యా, గణనీయమైన రాజకీయ ప్రాముఖ్యత గలిగిన దృష్ట్యా, యీ నూతనసంస్థ ప్రథమ కార్యాలయాన్ని క్యూబాలో స్థాపించాలని క్యూబా ప్రతినిధివర్గ ప్రతిపాదన. ఈ సంస్థ స్థాపనను వాంఛించిన వారు, యీ అభిప్రాయ విభేధాన్ని చైనావారికి అవకాశంగా వుపయోగపడకూడదనివాంఛించే అత్యధిక ప్రతినిధులు క్యూబా ప్రతినిధుల ప్రతిపాదనను అంగీకరించారు.

వోటింగు వివరాలు

ఆసియా ప్రతినిధివర్గంలో భారత,రష్యాల నుంచి ఎక్కువస్థాయి కలిగిన ప్రతినిధివర్గం రాకపోయినప్పటికీ, హాజరైన ప్రతినిధివర్గం సమయోచితంగా, సమర్థవంత పాత్రను నిర్వహించింది. ఈ సంస్థ భవిష్యత్తును, కేంద్రాన్ని వ్యాఖ్యానించబోయేముందు వివిధ కమిషనులలో మనదృష్టికి వచ్చిన వోటింగు విధానాన్ని చూద్దాం. ఆఫ్రికా: 16 దేశాల ప్రతినిధివర్గాలు మెజారిటీతో వున్నాయి. 5 తటస్థంగానూ, 7 చైనాకు అనుకూలంగాను వున్నవి.

దక్షిణ ఆఫ్రికా, పోర్చుగీసు వలసలు (4 ఓట్లు), కాంగో (బ్రెజవిల్లీ), ఘనా, గెడాలోఫ్, నైజీరియా, సెనెగల్, సోమాలి, సూడాన్, మొరాకో, ఐక్యఅరబ్‌రిపబ్లిక్, జింబాబే మెజారిటీ తీర్మానానికి అనుకూలంగా వున్నాయి,

కాంగో (లియోపాల్డ్‌విల్లీ), గినీ, కీన్యా. నైగైర్, రువాండా తటస్థంగా వున్నాయి.

చైనా అనుకూల ప్రతినిధివర్గాలు: దక్షిణ పశ్చిమ ఆఫ్రికా, బసూటోలాండు, బెచూనాలాండు, బురుండి (సామ్రాజ్యవాద ఏజంటు, ప్రపంచ ట్రేడ్ యూనియన్ల కాన్ఫెడరేషన్ సభ్యురాలు). స్వాజిలాండు, ఉగాండా, టాంగానియా (కొన్ని సందర్భాలలో మాత్రమే.) లాటిన్ అమెరికా: బ్రెజిల్ బోలీవియా, కొలంబియా, క్యూబా, చిలీ, బ్రిటిష్ గయానా, డచ్ గయానా, మెక్సికో, పెరూ. ఉరుగ్వే, వెనిజులా ప్రతినిధివర్గాలన్నీ మెజారిటీతో వున్నాయి. మిగతా ప్రతినిధి వర్గాలన్నీ తటస్థంగా వున్నాయి. చైనాకు అనుకూలంగా ఒక్కరుకూడ ఓటు చేయలేదు.

ఆసియా: సైప్రస్, లెబనాన్, మంగోలియా, సోవియట్ రష్యా, ఒయన్, పాలెస్తైన్, అరబ్ పెనిన్‌సులా (సౌదీ అరేబియా), యెమెన్, దక్షిణ యెమెన్, భారతదేశం మెజారిటీతో వున్నాయి.

ఇరాను, ఇరాకు, జోర్డాన్, లావోస్, ఉత్తర వియత్నాం, దక్షిణ వియత్నాం, సిరియా, కొరియా, థాయిలాండ్ తటస్థంగా వున్నాయి.

కాంబోడియా, చైనా, మలయా. నేపాలు. పాకిస్తాన్, ఇండొనీషియా, జపాన్, కాలిమంతన్‌లు చైనాకు అనుకూలంగా వ్యవహరించాయి.

చైనా, పాకిస్తాన్, నేపాల్, మలయా, ఇండొనీషియా, కాంబోడియా, జపాన్, ఉగాండా, బసూటోలాండ్, బెచూయానాలాండ్ అన్ని సందర్భాలలోను ఒకటిగా వ్యవహరించాయి.

టాంగానియా కొన్ని సందర్భాలలో మాత్రం చైనాకు అనుకూలంగా వ్యవహరించింది.

మొత్తం 82 ప్రతినిధి వర్గాలలోనూ, 37 మెజారిటీ ప్రతినిధివర్గంగానూ, 30 తటస్థంగానూ, 15 చైనాకు అనుకూలంగాను వ్యవహరించాయి.

ఈ పరిస్థితిలో నూతన కార్యదర్శివర్గం యేర్పాటుచేయబడింది. పరిస్థితి యెప్పుడూ చెడుగాలేదు. సిరియా సామ్రాజ్యవాద వ్యతిరేకిగా, సోవియటు అనుకూల శక్తిగా తయారవుతుంది. తాష్కెంటు ఒప్పందం తదనంతరం పాకిస్తాను రాజకీయాలలోకూడ మార్పు వస్తున్నది. దక్షిణవియత్నాం, సోవియటు సంబంధాలు రోజురోజుకి సన్నిహిత మవుతున్నాయి. ఆఫ్రికాలో గినీ రాజకీయాలు త్వరగా మార్పుజెందుతున్నవి. చైనాతో క్యూబా సంబంధాలు రోజురోజుకి క్షీణిస్తున్న కారణంగా లాటిన్‌అమెరికాలోకూడ క్యూబాను బలపరచే పరిస్థితి అభివృద్ధి జెందుతున్నది. అందువలన యీ నూతనసంస్థపై యెటువంటి పరిస్థితిలోనూ చైనా సిద్ధాంతప్రభావం భవిష్యత్తులో ప్రసరించదు.

బెంగాలులో వున్న కల్లోలిత పరిస్థితుల దృష్ట్యా బెంగాల్ క్రికెట్ ఆటల పోటీలను క్రికెట్ అసోసియేషన్ రద్దుచేసింది,

మార్క్సిస్టు, లెనినిస్టు మూల సూత్రాలు

	పేజీలు	రు. పై.
1. గతితార్కిక భౌతికవాదం	250	1-50
2. చారిత్రక భౌతికవాదం	194	1-50
3. పెట్టుబడిధారీవిధానపు అర్థశాస్త్రం	194	1-50
4. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ సిద్ధాంతం, ఎత్తుగడలు	398	1-50
5. సోషలిజం, కమ్యూనిజం	421	1-50

ప్రథమ ముద్రణ అంతర్జాతీయ కమ్యూనిస్టు ప్రగతిశీల, ప్రజాతంత్ర ఉద్యమం ప్రశంసలను పొందగలిగింది. ఇది తమకు ఎంతో సహాయకరంగా వుందని అనేకమంది మార్క్సిస్టు ప్రచారకులు, అధ్యాపకులు ఉగ్గడించారు. ఒక సమగ్రమైన శాస్త్రంగా మార్క్సిజం, లెనినిజాన్ని సులభగ్రాహ్యమైనరీతిలో శాస్త్రీయ పద్ధతిలో ఈ గ్రంథాలు విశదీకరిస్తున్నవని వారు మెచ్చుకొన్నారు. "మొదటి ముద్రణ స్వభావ, స్వభావాలలో ఎట్టి మార్పు రాకుండా సోవియట్ కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలోను సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు 22 వ మహాసభ ఆమోదించిన ఇతర డాక్యుమెంట్లలోనూ గల అమూల్యమైన భావాలను పొందుపర్చటం ద్వారా రెండవ ముద్రణ మరింత పరిపుష్ట మొనర్చబడింది. మొదటి ముద్రణపై పత్రికలు ప్రకటించిన సమీక్షలలోను, పాఠకులు లేఖలలో వెలిబుచ్చిన సూచనలను దృష్టిలో ఉంచుకొని రెండవముద్రణ రూపొందించబడింది.

పోస్టేజి అదనం — ప్రతులకు:
విశాలాంధ్ర ప్రచురణాలయం. విజయవాడ-2
విశాలాంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్‌బజార్, హైద్రాబాద్

విద్యారంగంలో శోచనీయ స్థితి

శాసనసభలో విద్యాశాఖ పద్దుపై చర్చలో విమర్శలు

హైద్రాబాద్, మార్చి 12

నేడుదయం ప్రశ్నోత్తరాలు కాల్ అటెన్షన్ తీర్మానాల చర్చ పూర్తయిన వెనుక విద్యాశాఖామంత్రి శ్రీ బలరామిరెడ్డి విద్యాశాఖ పద్దులను సభ ఆమోదానికి పెట్టారు.

ప్రతిపక్షం తరపున శ్రీ పులుపుల శివయ్య చర్చను ప్రారంభించారు.

(ఈ వుపన్యాసం నిన్న ఇచ్చాము)

అనంతరం పి. ఆంథోనిరెడ్డి వుపన్యసించారు,

గైడ్సుద్వారా విద్యాబోధ జరుగుతుండటం విచారకరం. స్వార్థంకోసం రాజకీయ పార్టీలు విద్యార్థుల నుపయోగించుకుంటున్నాయి. అదే వారిలో అశాంతికి కారణం. రాజకీయ పార్టీలు ఒక ఒప్పందానికివస్తే దాగుంటుంది. పబ్లిక్‌స్కూళ్ళ పిల్లలకు రోజంతా బోధనాక్రమాన్ని అమలు జరుపుతాయి. బీదలు దాని నుపయోగించుకోలేరు. ఏదో విధంగా వారికి కూడా ఆ అవకాశం కలిగించడం మేలు.

విద్యాశాలల సంఖ్యను పెంచేకన్న నాలుగో ప్రణాళికలో మంచిపరికరాలు ఇవ్వడం మేలు.

7 వ తరగతి కామన్ పరీక్ష పథకం మంచిదే. కాని స్కూళ్ళలో తగినందరు యోగ్యతలు గల టీచర్లులేరు. అందుచేత ఆ లోపం తీరేవరకు కనీసం ఈ ఏడాది ఆ పరీక్ష లేకపోతే మంచిది.

సెకండరీ విద్యా విషయంలో పరిశీలనా క్రమం ఏర్పరచినది మంచిదే. కాని అది అమలు జరగడంలేదు. లెక్కలకు, సైన్సుకళలకు వేర్వేరు ఇన్‌స్పెక్టర్లుండాలి.

మల్టీ పర్పస్ స్కూళ్ళకు హెడ్మాస్టర్లను సమర్థులను, ఉత్సాహం కలవారిని నియమించాలి. లేకపోతేఅనంతపురం స్కూలులో మాదిరిగా ఇంజనీరింగ్ పరికరాలు మొదలయిన ఖరీదయిన సామాగ్రి నిష్ప్రయోజనం చేస్తారు.

శరీర వ్యాయామ బోధను కాలేజీలలో సాధారణ విద్యకూ, సాంకేతిక విద్యకూ, సహకారిగా వుండాలి. ప్రస్తుతం వున్న స్కూళ్ళు ఈ ప్రణాళికలో నెలకొల్పబోతున్న పాఠశాలలకు, కాలేజీలకు తగినందరు వ్యాయామోపాధ్యాయుల్ని తయారుచెయ్యలేవు. కనీసం మరో రెండయినా స్థాపించాలి.

శ్రీ రాంగోపాల్‌రెడ్డి (నే.డె.)విద్యాభివృద్ధి కోసం చేస్తున్న ప్రయత్నాలు సాగుతున్నా అవిద్య పెరుగుతూంది. ఏమంటే ఏయేటా పుట్టిన పిల్లల సంఖ్యలో సగానికి మాత్రమే విద్యనివ్వగలుగుతున్నాము. శిక్ష స్మృతిని అవలంబించాలి. అదిగాక కొద్ది చదువుకున్న వారుకూడా దానిని కాపాడుకోగల అవకాశాలు లేకుండా వున్నాయి. టెక్నికల్ విద్యకు ప్రాముఖ్యం యివ్వాలి,

శ్రీ శేషావతారం (కాం): విద్యా శాఖను రెండుగా విభజించడం మంచిది, విద్యా వయస్సు గల బాల బాలికలలో సగంమంది మాత్రమే స్కూళ్ళకోవున్నారు. దారిద్ర్యమే కారణం. ఎలిమెంటరీ విద్యతో పాటు సబ్బులు చేయడం వంటి చిన్న చిన్న వృత్తులుకూడా నేర్పాలి. సెకండరీ విద్యలో యంత్రపరికరాల వుపయోగం, మరమ్మతులు నేర్పడానికి పూనుకోవాలి. శాస్త్రవిజ్ఞానం వృద్ధి పొందించుకొనేటందుకు మనం ఇంగ్లీషును వుపయోగించుకోవలసిందే.

శ్రీ పి. వెంకటరెడ్డి (కాం): పాఠశాలలు పెడుతున్నాము. కాని వెనుకబడిన ప్రాంతాలలో భవనాలు అసలు లేకుండాపోతున్నాయి, ప్రధాన కారణం ప్రజలు సాయంచేయలేని దశలో వున్నారు. ప్రభుత్వం భవనాలకు కూడా గ్రాంట్లు యివ్వాలి. ఎక్స్‌టెన్షన్ ఆఫీసరుకు ప్రయాణాధికారం లేకపోవడంవలన ఆయన విధులను వేనిసీ నిర్వహించలేకున్నారు. ప్రభుత్వం యివ్వలేకపోతే సమితులైనా ఖర్చు లివ్వమనండి, ఆ అవకాశం యివ్వకపోతే ప్రస్తుతం ఆయన చేస్తున్న పనికో గుమాస్తా చాలు. ఎక్స్‌టెన్షన్ ఆఫీసరు అనవసరం. హెడ్మాస్టర్సుడ్యూటీ అలవెన్సు మూడేళ్ళు ఇచ్చినది, ఒకేమారు వసూలు చేయడం గురించి పునరాలోచించాలి,

శ్రీ మారారెడ్డి (స్వతంత్ర) పాఠశాలలకు భవనాలు ఇవ్వలేకపోతే ప్రయోజనంలేదు. విద్యార్థులు. టీచర్లు రేషియో పెంచుకుంటూ పోవడంవలన లాభం వుండదు.

శ్రీ పేట పాపయ్య (కాంగ్రెసు) విద్యాశాఖకి సరియైన కేటాయింపులు జరుగలేదు. ప్రాథమిక విద్యకి ప్రాధాన్యమివ్వాలి. ఏడవ తరగతికి కామన్ పరీక్షలు వచ్చే సంవత్సరంనుండి అమలు జరపాలి. ప్రభుత్వమే పాఠశాల భవనాల నిర్మాణం దేబట్టాలి. ప్రాథమిక పాఠశాలలో కూడా సాంకేతిక విద్యా ప్రాధాన్యందృష్ట్యా లాబరేటరీలు వుండాలి.

వుయ్యూరులో ఖాళీగావున్న భవనములో బాలికలకు పాలిటెక్నిక్ స్థాపించాలి.

డిప్లోమా, సర్టిఫికేటు స్థాయిలో కోర్సులు నేర్పాలి. తాలూకా కేంద్రాలలో పారిశ్రామిక ట్రైనింగ్ స్కూళ్ళు నెలకొల్పాలి.

గ్రంథాలయాలకు, వయోజన విద్యకి ప్రాముఖ్యమివ్వాలి.

శ్రీ భండారు నాగభూషణరావు(కాంగ్రెస్): జాతీయ భాషాభివృద్ధి విషయం మంత్రిగారి ప్రసంగంలో ఏమిలేదు, ఇంగ్లీషు భాషా వ్యసనా సంస్థల విషయం పెద్దగా చెప్పుకొన్నపుడు జాతీయ భాషయైన హిందీ ప్రసక్తిలేకపోవటం విచారకరం.

కాలేజీలలో సైన్సుకోర్సులు చదవటానికి సీట్లువారకక విద్యార్థులు బాధపడుతున్నారు. షిఫ్ట్ పద్ధతి ప్రవేశపెట్టటం ద్వారా ఈ యిబ్బంది నెదుర్కొనవచ్చు.

శరీర వ్యాయామాభివృద్ధికి కేటాయింపు జరగాలి. ప్రాచ్య భాషా కళాశాలకి యితోధికంగా సాయం చేయాలి. ప్రాచ్యభాషా కోర్సులలో సాంఘికశాస్త్రం చేర్చాలి.

గుంటూరులో స్థాపించిన ఇండస్ట్రియల్ టెక్స్‌టైల్ టెక్నాలజీ సంస్థ నిరుపయోగంగా ఉంది. వరంగల్లులో ఇలాంటి సంస్థ ఒకటి పెట్టాలి.

శ్రీ సి. నారాయణరెడ్డి (స్వతంత్ర): బలరామిరెడ్డిగారి చదువుకొన్న బట్టాజు బరువు బాగుందనేట్లుంది. ప్రభుత్వ విద్యావిధానం. కేంద్ర సర్వీసుపరీక్షలలో ఆంధ్రులు తగిన నిష్పత్తిలో ఉత్తీర్ణులు కావటం లేదు. సెకండరీ గ్రేడ్ శిక్షణ పొందిన వేలమంది నిరుద్యోగులుగా వున్నారు.

"యూనివర్శిటీలలో బోధన తెలుగులోనే జరగాలని త్వరగా నిర్దేశించాలి.

కడప జిల్లాలో బాలికల పాలిటెక్నిక్ స్థాపించాలి.

ప్రైవేటు కాలేజీలో వుపాధ్యాయులకు యు.జి.సి. వేతనాలు అమలుజరిగేట్లుచూడాలి.

శ్రీ మైనేని లక్ష్మణస్వామి (కమ్యూ) కామన్ పరీక్షను జిల్లాల స్థాయిలోనో సమితి స్థాయిలోనో జరపడం అవసరం. ప్రస్తుత నిర్ణయం ప్రమాదకరం. పరిపాలనా సౌకర్యం దృష్టితోగాక విద్యాదృష్టితో జరపాలి. మహిళల కాలేజీలు ఇంటిగ్రేట్‌చేసి ఒక ప్రత్యేకయూనివర్శిటీ పెట్టాలి. భవనాలుఇవ్వటం. బాలుర: టీచరు ప్రపోర్షను తగ్గించడం విద్యలో గుణాత్మక మయినమార్పు వస్తుంది.

ఉన్న ఉపాధ్యాయుల సంఖ్య రెట్టింపు చేయకుండా, కరకును పనికి ఒకరినివ్వకుండా పరికరాలిచ్చిన మాత్రాన సైన్సు బోధన మంచిగా పెరగదు.

ఉయ్యూరులో గరల్స్ పాలిటెక్నిక్ స్థాపించాలి. నందిగామ. నూజివీడులలో కాలేజీలకు అనుమతినివ్వాలి.

కంట్రోళ్ళపై ప్రభుత్వ విధానం

ప్రధాని ప్రసంగం

న్యూఢిల్లీ, మార్చి 12

వాటి అవసరం తీరిపోయినప్పుడు కంట్రోళ్ళను రద్దుచేయడానికి ప్రభుత్వం సిద్ధమే. అవసరమైనప్పుడు వాటిని విధించడానికిగూడా వెనుకాడదు. అని ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ నేడిక్కడ భారత పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య 31 వ వార్షిక సభను ప్రారంభిస్తూ చెప్పారు.

ఉక్కు. దుక్కయినుము, సిమెంటువంటి సరుకులపై కంట్రోళ్ళు విరమించబడిన విషయాన్ని ఆమె వుదహరించారు. అయితే కొరత పరిస్థితులున్నందువల్ల ధాన్యం కంట్రోళ్ళను వెంటనే ఎత్తివేయడం మాత్రం సాధ్యపడదు. కంట్రోళ్ళు అనివార్యం కూడా. అయితే కంట్రోళ్ళను అమలు జరిపేతీరు కొరతను శాశ్వతం చేసేదిగా గానీ, వుత్పత్తి దారుల్ని నిరుత్సాహపరచేదిగా గానీ వుండరాదు. అని ఆమె చెప్పారు.

వర్తమాన ఆర్థిక పరిస్థితిలో కంట్రోళ్ళ ప్రయోజనం, అవి అమలు జరుగుతున్న తీరు గురించి సమాఖ్య ప్రతినిధులతో ప్రభుత్వం జరిపే సంప్రతింపులు ప్రయోజనకరంగా వుండగలవని ఆశిస్తున్నాం అని ఆమె అన్నారు.

వ్యక్తిగత, కంపెనీల పన్నుల హెచ్చింపు గురించి సమాఖ్య అధ్యక్షుడు చేసిన విమర్శను ఆమె తిరస్కరించారు.

పొదుపును ప్రోత్సహించాలనేదే ప్రభుత్వ ఆశయం. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరీ అనివార్యమైతే తప్ప యే ప్రభుత్వం కూడా కొత్త పన్నులు విధించదు. అయితే బాధ్యతగల ప్రజా ప్రభుత్వాలు దేశ ప్రయోజనాల విషయంలో తమ విధులను నిర్వర్తించకతప్పదు. అని ఆమె అన్నారు.

కంట్రోళ్ళు విధింపు విషయంలోగానీ. వాటిని ఎత్తివేసేవిషయంలోగానీ ప్రభుత్వానికి పట్టింపు లేమీ లేవు, వాటిపైన కంట్రోళ్ళు అవసరమో. వేటిపైన వాటి అవసరంలేదో ఆలోచించాలి. అని ఆమె తమ ప్రభుత్వ విధానాన్ని వివరించారు,

బయటి శత్రువును ఎదుర్కోవడంలో మనదేశం ఎంతో సాహసోపేతంగా ప్రవర్తించింది. ఆర్థికాభివృద్ధి విషయంలో కూడా అదేవిధంగా ధైర్యంతో వ్యవహరించాలి. అని ఆమె కోరారు,

ఈ సభకు రైల్వేశాఖమంత్రి శ్రీ పాటిల్, రక్షణమంత్రి, వాణిజ్యమంత్రి మనుభాయ్‌షా, ఉక్కుశాఖ మంత్రి శ్రీ టి. యన్. సింగ్, యింకా చాలామంది ఉపమంత్రులూ, వివిధ మంత్రిత్వశాఖల కార్యదర్శులు హాజరైనారు.

నాల్గవ ప్రణాళిక వ్యయాన్ని తగ్గించాలన్న వాణిజ్య సమాఖ్య అధ్యక్షుని అభ్యర్థనను ఆమె తిరస్కరించారు,

మొదట మూడు పంచవర్ష ప్రణాళికలు అనుకొన్నమేరకు లక్ష్యాన్ని సాధించలేకపోయినమాట యథార్థమే. కాని అయితే అని సాధించిన ఫలితాలను తక్కువ అంచనా వేయడం తగదన్నారు.

మూడవ ప్రణాళిక అనేక విషయాల్లో లక్ష్యాన్ని సాధించలేకపోవడమే ప్రస్తుతం భారత ఆర్థికవ్యవస్థలో వచ్చిన నిస్పృహకు కారణమన్నారు.

ఈ లక్ష్యసాధన విఫలమవడానికి కారణం పాక్, చైనా దురాక్రమణ సమయాల్లో దేశ వనరులను రక్షణ కృషికి మరలించడమే నన్నారు. ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో దుబారాను తగ్గించి, సమష్టతను పెంచాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

దేశాన్ని ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించడంలో యువతరం ప్రాధాన్యతను గురించి శ్రీమతి గాంధి నొక్కిచెప్పారు.

తాను త్వరలోనే ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లోని యువకులైన పారిశ్రామికవేత్తల సాంకేతికులు, మేనేజర్ల సమావేశం జరపగలనని, ఆ సమావేశంలో నిర్దిష్టమైన సమస్యలను గురించి చర్చలు జరపగలనన్నారు. దేశప్రజల పై ఖరిలోనూ, కార్యాచరణలోనూ విప్లవాత్మకమైన మార్పు రావలసిన అవసరం వున్నదని ఆమె నొక్కిచెప్పారు.

లోక్‌సభ నుండి మధులిమాయే బహిష్కరణ

తరువాత బహిష్కరణ రద్దు

న్యూఢిల్లీ, మార్చి 11

లోక్‌సభలో కొంతమంది ప్రతిపక్ష సభ్యులు సభా మర్యాదలకు భిన్నంగా ప్రవర్తించినందుకు లోక్‌సభ స్పీకరు, సభా నాయకుడు శ్రీ సత్యనారాయణ సిన్హా నేడు విచారం వ్యక్తంచేశారు.

మన దేశంలో ప్రజాస్వామ్యం విఫలమైపోవాలని భారత దేశ శత్రువులు ఎదురు చూస్తున్నారని, అదే సమయంలో సభ్యులు ప్రజాస్వామ్యాన్ని రక్షించవలసిన బాధ్యతను విస్మరిస్తున్నారనీ స్పీకరు శ్రీ హుకుంసింగ్ హెచ్చరించారు.

మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన బాధ్యత మనపై వున్నదనీ, మనం ఆబాధ్యతను నిర్వహించకపోతే, భావి ప్రజలు మనలను క్షమించరనీ అన్నారు.

సభలో జరుగుతున్న ఘటనలపట్ల రెండు రోజులక్రితం స్పీకరు విచారం వెలిబుచ్చిన విషయాన్ని తిరిగి సభ్యులకు ఆయనే గుర్తు చేశారు.

పశ్చిమబెంగాల్ ఘటనలపై చర్చ జరపవలసిందిగా ప్రతిపక్షం చేసిన ప్రయత్నాల సందర్భంగా నేడు లోక్‌సభలో జరిగిన వాకౌట్లు, పరస్పర దూషణలు, కేకలతో సుమారు 90 నిమిషాలపాటు సభా కార్యక్రమం నిలిచిపోయింది. తర్వాత స్పీకరుపై విమర్శ చేశారు.

బెంగాల్ పరిస్థితిపైన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటన చేసిన తర్వాత, యస్. యస్. పి. సభ్యుడు శ్రీ మధులిమాయే చేసిన విమర్శపై. కాంగ్రెసు సభ్యులు ఉద్రిక్తత చెంది, కోపంతో ఆవిమర్శను ఉపసంహరించుకుని. క్షమాపణ చెప్పుకోవలసిందిగా కేకలు పెట్టారు.

సభా మర్యాదను పాటించవలసిందిగా స్పీకరు విజ్ఞప్తి మినహా కొన్ని నిమిషాల వరకు ఏమీ వినిపించలేదు. కొంతమంది కాంగ్రెసు సభ్యులు లేచినిలబడి మధులిమాయే విమర్శపట్ల పాయింటు ఆఫ్ ఆర్డర్లు, వ్యతిరేకత తెలియజేస్తూ చప్పట్లు కొట్టారు.

శ్రీ మధులిమాయే తన విమర్శను ఉపసంహరించుకోవాలనీ, లేకపోతే ఆ విషయాన్ని రికార్డు నుండి తొలగించాలనీ కాంగ్రెసు సభ్యుడు శ్రీ ఎ.పి. శర్మ అరిచారు.

తాను ఎందుకు ఉపసంహరించుకోవాలని, అటువంటి విమర్శలు గతంలో చెయ్యబడ్డాయనీ మధులిమాయే తిరిగి అరుస్తూ సమాధానం చెప్పారు.

ఆ మాటలను ఉపసంహరించుకోవలసిందిగా మధులిమాయేని స్పీకరు కోరారు. సభానిబంధనల పుస్తకం పుచ్చుకుని. తాను చెప్పేది ముందు వినవలసిందిగా లిమాయే కోరారు.

తన మాటలను ఉపసంహరించుకోకపోతే, లిమాయే సభనుండి బయటకు వెళ్ళిపోవాలని స్పీకరు హెచ్చరించారు.

స్పీకరు హెచ్చరికకు లిమాయే సమాధానం చెప్పకుండా అలాగే వుండిపోయారు.

వెంటనే లిమాయేని సభనుండి బహిష్కరించవలసిందిగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి తీర్మానం ప్రవేశపెట్టారు.

ప్రతిపక్షసభ్యులు శిక్ష తీవ్రంగా వుందని వాదించారు.

తర్వాత చాలసేపు ఆ విషయంపై పలువురు సభ్యులమధ్య వాగ్వివాదాలు జరిగాయి.

అంతవరకు మాట్లాడకుండా కూర్చున్న మధులిమాయే ఆవిషయం యింతవరకు తాను వినలేదని చెప్పారు. ఇప్పుడు కూడా స్పీకరు ఉత్తరువును పాటించడానికి తాను సిద్ధంగానే వున్నానని ఆయన చెప్పారు.

కొంతసేపు ఆవిషయంపై చర్చజరిగిన మీదట లిమాయే సభ నుండి బయటకువెళ్ళిపోయారు,

తరువాత సభ్యుల విజ్ఞప్తిపై బహిష్కరణ ఉత్తర్వు రద్దుచేయబడింది.

విదేశీ వాణిజ్యం జాతీయకరణకు మంత్రి షా నిరాకరణ

న్యూఢిల్లీ, మార్చి 10

దిగుమతి లైసెన్సుల సమస్యను క్రమబద్ధం చెయ్యడానికి న్యాయనిర్వహణ సంఘాన్ని నెలకొల్పడానికి నేడు అవకాశంలేదని లోక్‌సభలో వాణిజ్యమంత్రి శ్రీ మనూభాయిషా చెప్పారు.

ఈ విషయంపై వివిధ పార్టీలతో కేంద్ర హోంమంత్రి ప్రస్తుతం చర్చలు కొనసాగిస్తున్నారనీ, దానిపై వాణిజ్య మంత్రిత్వశాఖ, ప్రణాళికా సంఘం తమ పరిశీలనను పూర్తి చేశాయనీ ఆయన చెప్పారు,

ఆ సమస్య చాలా క్లిష్టమైనదనీ, ఒక పరిశ్రమకు, మరొక పరిశ్రమకు ఉత్పత్తి చేసిన సరుకులలోని దేశీయముడిపదార్థాలతో సంబంధం లేదనీ వేలాది పారిశ్రామికవేత్తలకు సంబంధించిన అంశమని షా చెప్పారు. అందుచేత 'ఆ సమస్య పరిష్కారానికి కార్యనిర్వాహక వర్గానికి బయట న్యాయవిచారణ సంఘం ఉండడానికి వీలుపడదని చెప్పారు.

మరో ఐదు సంవత్సరాలపాటు 31మార్చి 1971 వరకు ఎగుమతి, దిగుమతి కంట్రోళ్ళను ప్రభుత్వం కొనసాగించడానికి వీలుగా అధికారం యిస్తూ బిల్లును ప్యాసు చేశారు.

దిగుమతి లైసెన్సులను అక్షను వేయడానికి వీలులేదని వాణిజ్య మంత్రి చెప్పారు, ఆ విషయాన్ని ప్రణాళికా సంఘం, వాణిజ్య ఆర్థిక మంత్రిత్వ శాఖలు వివరంగా పరిశీలన జరిపాయని చెప్పారు. కొద్ది మంది ధనికులు వేలంలో ఎక్కువ మొత్తాలకు పాడుకుని, మొత్తం జాతినే వినాశానికి పాల్పడేట్లు చేస్తారని అన్నారు.

విదేశీ వాణిజ్యాన్ని జాతీయం చేయ్యాలని కోరుతూ కమ్యూనిస్టు సభ్యులు చేసిన సూచనను కూడా ఆయన తిరస్కరించారు.

క్రమేణా అమ్మకానికి కష్టమైన సరుకులను ప్రభుత్వ వాణిజ్య కార్పొరేషన్లద్వారా అమ్మకం కొనసాగిస్తామని చెప్పారు.

ఇంతవరకు రెండు ప్రభుత్వ వాణిజ్య కార్పొరేషన్లు విదేశీ వాణిజ్యం మొత్తం 2250 కోట్లలోను250కోట్లవ్యాపారంచేశాయని ఆయన చెప్పారు.

పాకిస్తాన్ రహస్య రేడియో

పాకిస్తాన్ ప్రభుత్వనిరాకరణ

కరాచీ, మార్చి 11

భారతప్రభుత్వానికి వ్యతిరేకంగా మిజోలు జరుపుతున్న తిరుగుబాటును బలపరుస్తూ. తూర్పు పాకిస్తాన్ నుంచి రహస్య రేడియో ప్రసారం చేస్తున్నదని భారత రేడియో వార్తాపత్రికల ప్రచారాన్ని నేటిరాత్రి పాకిస్తాన్ ప్రభుత్వం నిరాకరించింది.

అలాంటి రహస్య రేడియో కేంద్రం పాకిస్తాన్‌నుంచి యెప్పుడూ పని చేయలేదని యిప్పుడుకూడ చేయడంలేదని ఆప్రకటనలో తెలిపారు.

శాస్త్రీయ పారిశ్రామిక పరిశోధన సంస్థపై కమిటీ

రాజ్యసభలో డిమాండ్

న్యూఢిల్లీ. మార్చి 11

విదేశాల నుండి భారతదేశంవచ్చి ఉద్యోగాలుచేస్తున్న భారతీయ శాస్త్రజ్ఞులు నిరాశ చెంది తిరిగి పోవాలను కొంటున్నారన్న విషయాన్ని నేడు రాజ్యసభలో విద్యామంత్రి శ్రీ యం. సి. చాగ్లా ఖండించారు,

శ్రీ దయాభాయ్ పటేల్ ప్రశ్నకు సమాధానం చెబుతూ శ్రీ చాగ్లా, భారతదేశంలో పనిచేయడానికి వచ్చిన అనేకమంది శాస్త్రజ్ఞులు యింకా పనిచేస్తూనేవున్నారనిఅన్నారు.

విదేశాలలోవున్న 13 వేల మంది భారతీయ సాంకేతిక సిబ్బంది భారతదేశంలో ఉద్యోగం కోసం 1957 నుండి యీనాటి వరకు రిజిష్టరు చేసుకొన్నారనీ ఇందులో సగం మంది భారతదేశానికి తిరిగి వచ్చారనీ, మిగతావారు విదేశాలలో వున్నారని ఆయన అన్నారు.

శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధనాసంస్థ కార్యకలాపాలపై యేవైనా నిర్దిష్టమైనఫిర్యాదులను యీ సంస్థ అధ్యక్షురాలు ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి పరిశీలించగలదని, అవసరమైతే ఒక కమిటీద్వారా యీ విషయాన్ని పరిశీలించగలదని కేంద్ర విద్యామంత్రి శ్రీ చాగ్లా అన్నారు,

ఈ సంస్థ కార్యకలాపాలను సమీక్షించడానికి, నిధుల ఉపయోగాన్ని పరిశీలించడానికి పార్లమెంటు సభ్యులతో ఒక కమిటీని యేర్పాటు చేయాలని ప్రతిపాదించిన శ్రీ డి. యన్. కట్జూ (కాం) తీర్మానంపై ప్రసంగిస్తూ శ్రీ చాగ్లా యీ విషయ చెప్పారు.

ప్రపంచానికి యువతర నైపుణ్యం అవసరం

— ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 12

యువతరంలో అనేకమంది ముందుకు వస్తున్నారు. ప్రపంచానికి వారి నైపుణ్యం చాలా అవసరం. ఈ విషయంలో భారతదేశం మంచి అభివృద్ధి సాధించిందని ప్రధాన మంత్రి నేడిక్కడన్నారు.

ఈ విషయాన్ని గుర్తువుంచుకొన్న మీరు మీ మంత్రివర్గాన్ని యేర్పాటుచేశారా అని ఒక విలేకరి ప్రశ్నించగా ఈ విషయం చెప్పారు.

ప్రధాని ఇందిర: నేను వారి వయస్సు అడగడానికి భయపడ్డాను. నేను ఆ పని చేయలేదు.

పెరిగేకొలది యువతరం, వృద్ధాప్యం మధ్యవున్న రేఖ అంతరిస్తూ వుంటుందని శ్రీమతి ఇందిర అన్నారు.

అలవాటులేని ఆపోశన

దొంగిలించిన సొమ్ము ఖర్చుచేయడం తెలియక తికమక పడిన యువకుడు

బొంబాయి, మార్చి 12

బొంబాయిలో ఒక బట్టలదుకాణంలో పని చేస్తున్న ప్రవీణ్‌రాసిక్లాల్‌గాంధి అనేవుద్యోగి 17500 రూపాయలు దుకాణంనుండి దొంగిలించాడు.

బొంబాయినుండి కలకత్తా వెళ్ళాడు. కలకత్తాలో జరుగుతున్న హర్తాళ్ అతనిని అడ్డుకొంది. నిరాశతో ఢిల్లీ ప్రయాణం కట్టాడు. ఘనా పాటీలుబసచేసే ఒకహోటల్లో విశ్రమించాడు. తిరిగి బొంబాయి చేరుకున్నాడు. ఉన్న డబ్బును వినియోగించడానికి యేమార్గం కనపడలేదు.

ఆఖరికి తన మరణపత్రం వ్రాస్తూ తన మరణానికి యెవ్వరి ప్రమేయంలేదని తెలియబరచాడు. విసిగి వేసారిన యువకుడు ఆత్మహత్యకు తయారయ్యాడు. విషం పుచ్చుకున్నాడు. అధునికంగా తయారు చేసిందేమో ఆ విషం పనిచేయలేదు. తర్వాతవున్న డబ్బును స్నేహితులపై కురిపించి తాను అనుభవించని సుఖాలను వాళ్ళను అనుభవించమన్నాడు.

ఆఖరుకు పోలీసుల బారికి గురిఅయ్యాడు. తన వద్ద పోలీసులు 8100 రూపాయలు స్వాధీనం చేసుకున్నారు. కృష్ణజన్మస్థానంలో కూర్చోబెట్టారు. ఈ యువకుడు 15 రోజులపాటు ఇలా తిరగాడని పై వివరాలు తెల్పిన పోలీసుల కథనం.

కేరళ విద్యార్థులపై కేసుల ఉపసంహారణ

కేరళ పార్లమెంటుసభ్యుల సమాలోచనకమిటీలో విమర్శ

న్యూఢిల్లీ. మార్చి 12

కేరళలో ఆహారాందోళన సందర్భంగా హింసాకాండ జరిపారన్న ఆరోపణలమీద, విద్యార్థులపై పెట్టిన కేసుల ఉపసంహారణ విషయంవచ్చే 8 రోజులలోపూర్తిగాగలదని, దీనికి సంబంధించిన నివేదిక తన మంత్రిత్వ శాఖకు అందగలదని కేరళ పార్లమెంటు సభ్యులకు హోంశాఖ స్టేట్ మంత్రి శ్రీ జైశుక్లాల్ హాథీ నేడు హామీ యిచ్చారు.

కేరళ పార్లమెంటు సభ్యుల సమాలోచన కమిటీకి అధ్యక్షత వహిస్తూ యీ విషయం చెప్పారు. హోంమంత్రి నందా కలకత్తా పర్యటనకు వెళ్ళిన సందర్భంగా శ్రీ శుక్లా ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు.

విద్యార్థుల కేసులను ఉపసంహరించే విషయంలో యీకమిటీ సిఫార్సులు అమలు పరచడాన్ని ఆలస్యం చేసినందుకు కొంతమంది సభ్యులు విమర్శించారు. ఈ విషయంపై రాష్ట్రి సలహాదారుపై ప్రసాద్ వివరించారు.

కేరళ యూనివర్శిటీ బిల్లుపై తీవ్రంగా వున్న బేదాభిప్రాయాలు యీ కమిటీ చర్చించింది.

వైస్ ఛాన్సలర్‌ను మూడు సంవత్సరాలపాటు వుంచడంపట్ల, ఆయన నియామక పరిస్థితిపట్ల శ్రీ కంఠరనాయర్, శ్రీ పి. కె. వాసుదేవన్‌నాయర్. శ్రీ గోవిందనాయర్, శ్రీయుతులు గోవిందరెడ్డి శ్రీ రవీంద్రవర్మ అభ్యంతరాలు చెప్పారు.

చిలీలో కార్మిక సమ్మె

శాంతియాగో, మార్చి 12

ఉత్తరఎల్ - సాల్వదార్ రాగిగనుల వద్ద సమ్మెదారులకు పోలీసులకు. సైనికులకు జరిగిన సంఘర్షణలో 5 మంది సమ్మె చేస్తున్న కార్మికులు చనిపోయారు.

టెండరు నోటీసు

పశ్చిమ గోదావరిజిల్లా లోకల్ లైబ్రరీ అథారిటీకి సుమారు రు. 2,500-00 విలువ గల రేడియోలు సప్లయి చేయుటకు సీలు వేసిన టెండర్లు ఈ క్రింద సంతకము చేసిన వారిచే ది 16-3-66 సాయంత్రం 5 గంటల వరకు తీసుకొనబడును. షరతులు, పూర్తి వివరములు ఆఫీసునుండి పొందవచ్చును.

శ్రీ సి. గోవిందరావు.
B. Sc., D. L. Sc.,
సెక్రటరీ,
లోకల్ లైబ్రరీ అథారిటీ,
పశ్చిమ గోదావరిజిల్లా, ఏలూరు.



తెలుగులో ఉత్తమ నవలలు

బాల్యం, యౌవనం, కౌమార్యం	— టాల్‌స్టాయ్	542	6-00
అన్నాకెరినీనా	,,	424	5-00
నేరము - శిక్ష	— డోస్టోవస్కీ	550	6-00
పేదల బ్రతుకులు	,,		3-00
మృతజీవులు	— గొగోల్	486	6-00
అపరిచిత	— గలీనాని కొలయెవా	166	2-25
కాకలు తీరిన యోధుడు	— యన్. ఓస్ట్రోవస్కీ	728	8-00
ఆదర్శ జీవులు	— కొప్తాయేవా	800	9-00
పునరాగమనం	— బి. పోలెవాయ్		1-75
బీడుదున్నేరు	— షొలొఖోవ్	500	6-00
జీవన సమరం	— బి. పోలెవాయ్		4-50
గొడ్లకాపరి కథ	— యస్. తొకా	258	0-62
మిత్రుని హృదయం	— ఇ. కజకేవిచ్	272	1-50
గొప్పవారి గోత్రాలు	— షెడ్రిన్		3-50
అరుణ రేఖలు	— యూరిశైఖీవ్	216	2-25
బెల్కిన్ కథలు	— పుష్కిన్	190	2-00
పారిస్ పతనం	— ఇ. ఎహ్రెన్‌బర్గు	840	10-00

పోస్టేజి అదనం: ప్రతులకు:
విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ-2
విశాలాంధ్ర బుక్‌హౌస్, సుల్తాన్‌బజారు, హైద్రాబాద్

ADMARK

PRINTING
AND
BINDING

Yes... we have through experience Discovered... Just this thing — A very simple thing — that in production of Quality Work the primary thing besides attention, devotion, talent, etc., is the Love at every stage in handling the Job. Yes it is a Love as Great as a Mother's.

You can be sure of that devotion to the job you are pleased to entrust to us.

SWATANTRA ART PRINTERS
VIJAYAWADA-4 • PHONE 1336

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరపున ఎడిటర్, ప్రింటర్, అండ్ పబ్లిషర్ కాట్రగడ్డ రాజగోపాలరావు, స్వతంత్ర ఆర్టు ప్రింటర్స్, విజయవాడ-4. ప్రధాన సంపాదకులు [illegible]